www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రాహుల్ మాటిచ్చాడు కాబట్టే కులగణన

నాడు రేవంత్‌ను రెడ్లే వ్యతిరేకించారు
ఇప్పుడు ఆయన చుట్టూ చేరి.. భజన చేస్తున్నారు
నేను కేంద్ర మంత్రి కాకుండా అడ్డు పడ్డారు
బీసీ మంత్రులకు మంచి శాఖలూ ఇవ్వరా?
మీరెంత మంది? మీకెన్ని పదవులు??
రెడ్డి నేతల తీరుపై అంజన్ కుమార్ యాదవ్ ఫైర్
బీసీలను బీజేపీ ఎదగనివ్వదని వ్యాఖ్య

12



మంగళవారం | 25-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 328

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ. 12.48 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 6.31 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా.10.19-11.51; దుర్ముహూర్తం: ఉ.8.59-9.45, రా.10.20-11.08; అమృతఘడియలు: మ.12.14-1.48; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.39, సూర్యాస్తమయం: 6.16

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





కరీంనగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పట్టభద్రులు; వారిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కేసీఆర్ చీకట్లో మీ కాళ్లు పట్టుకున్నందుకేనా?

అందుకే కేసీఆర్, కేటీఆర్‌కు బీజేపీ రక్షణ

వారిని కాపాడుతున్నది కిషన్‌రెడ్డి, సంజయే
ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును అమెరికా నుంచి ఎందుకు రప్పించట్లేదు
ఫామ్‌హౌస్‌లోంచి సర్కార్‌పై కేసీఆర్ కుట్రలు
కేసీఆర్, కేటీఆర్, కవిత ఎవరికి ఓటేస్తారు?
కాంగ్రెస్‌ను ఓడించాలని అనడంలో మతలబేంటి?
మేం కులగణన చేపడితే.. బీజేపీ కుట్రలు
పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్‌రెడ్డి

నిజామాబాద్/మంచిర్యాల/కరీంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టు కాకుండా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లే కాపాడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసులో నిందితులైన ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు అమెరికాకు పారిపోతే.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కి ఇది సాధ్యం కావడం లేదా? అని ఎద్దేవా చేశారు. ఆ ఇద్దరిని రాష్ట్రానికి తీసుకువచ్చిన 48 గంటల్లోనే తాము బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తామని ప్రకటించారు. "కేసీఆర్ ఢిల్లీకి వచ్చి చీకట్లో మీ కాళ్ల

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రంలో 'ఆమ్జెన్' భారీ పెట్టుబడులు

రూ.1600 కోట్లతో విస్తరిస్తామన్న కంపెనీ సీఈవో
టెక్నాలజీ, ఇనోవేషన్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్
బయోటెక్ హబ్‌గా హైదరాబాద్ పేరు మరింత బలోపేతం
ట్రిలియన్ డాలర్ల జీడీపీ దిశగా అడుగులు: రేవంత్‌రెడ్డి

13

దమ్ముంటే బీఆర్ఎస్ స్కాంలను సీబీఐకివ్వండి

దోషులెవరైనా కేంద్రం అరెస్టు చేస్తుంది
ఫోన్ ట్యాపింగ్ నిందితులు ప్రభాకర్‌రావు, శ్రవణ్ పారిపోతే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేయొచ్చు కదా?
చీకటి ఒప్పందాలు మీవి.. బురద మాపైనా?
గతంలో ఏ ముఖ్యమంత్రీ.. ఎమ్మెల్సీ ప్రచారంలో పాల్గొనలేదు
సీఎంకు కేంద్ర మంత్రి సంజయ్ కౌంటర్

10

బీఆర్ఎస్‌తో రేవంత్ కుమ్మక్కు

అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు నిర్వీర్యం
సీఎం అసమర్థతను బీజేపీపై రుద్దే యత్నం
ఈ కేసును రేవంత్ వదిలినా.. మేం వదలం
దెయ్యమని తిట్టి.. సోనియా కాళ్లు మొక్కిందెవరు?: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అడుగడుగునా అవాంతరాలు

టన్నెల్‌లో తొలగని బురద.. మరింత పెరిగిన ఊటనీరు
బయటకు పంపేందుకు పనిచేయని కన్వేయర్ బెల్టు
పొక్లెయినర్ పంపినా మట్టి, రాళ్లు తరలించే వ్యవస్థ కరువు
13.62 నుంచి 13.63 కి.మీ. వరకు రెడ్‌జోన్‌గా నిర్ధారణ
సహాయక చర్యల్లో ర్యాట్‌హోల్ మైనర్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది
పుష్ కెమెరాలు, ఫ్రొబోస్కోప్‌లతో గ్యాప్‌లు గుర్తించే ప్రక్రియ
అర్ధరాత్రి నుంచి రాళ్ల తొలగింపు ప్రారంభమయ్యే అవకాశం



టన్నెల్‌లో సగానికి పైగా నిండిన బురద, నీరు; సహాయక చర్యల్లో సిబ్బంది

మహబూబ్‌నగర్/అచ్చంపేట/దోమలపెంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు చేపట్టిన సహాయక చర్యలు వేగంగా సాగడంలేదు. సహాయక బృందాలకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. టన్నెల్ పైకప్పు కూలిన ప్రమాద స్థలం చాలా దూరంలో ఉండటంతో శకలాలు, మట్టి దిబ్బలు, బురద తొలగింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కావడంలేదు. సొరంగంలో ఇంకా 2.5 మీటర్ల మేర బురద అలాగే ఉండటంతో అక్కడి నుంచి ఘటనా స్థలం వద్దకు నడవడం చాలా కష్టంగా మారింది. పైగా, ఆదివారంతో పోల్చితే ఊటనీరు మరింత పెరిగింది. ఇప్పటికీ నిమిషానికి దాదాపు 3500 లీటర్ల చొప్పున నీరు ఉబికి వస్తుండటంతో నిల్వ పేరుకుపోతోంది. 13 కిలోమీటర్ల లోపలి

మిగతా 3వ పేజీలో...

8 మంది టన్నెల్‌లో.. సీఎం ప్రచారంలో!

రేవంత్‌ది దిగజారుడు రాజకీయం: కేటీఆర్

3



ఊబకాయంపై 'దశ'దిశగా పోరు

విస్తృత ప్రచారానికి ప్రధాని మోదీ శ్రీకారం
ఒమర్, మోహన్‌లాల్, ఆనంద్ మహీంద్ర సహా 10 మంది ప్రముఖుల నియామకం

2

టీచర్ ఎమ్మెల్సీ.. ఉత్కంఠ పోరు!

బరిలో 19మంది అభ్యర్థులు.. ఐదారుగురి మధ్యే పోటీ

పీఆర్‌టీయూ నేపథ్యం ఉన్న నలుగురు తాజా, మాజీలు
కొరవడిన బీసీ ఐక్యత.. ఎవరిదారి వారిదే అన్నట్లు ఆ నేతల తీరు
బీసీ జేఏసీ అభ్యర్థికి జాజుల.. బీజేపీకి ఆర్ కృష్ణయ్య మద్దతు
అధికారికంగా ఎవరికీ మద్దతు ప్రకటించని కాంగ్రెస్, బీఆర్ఎస్

వరంగల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పీఆర్‌టీయూ నేపథ్యం ఉన్న అభ్యర్థులు-బీసీ వాదానికి మధ్య పోరుగా మారాయి. వరంగల్, ఖమ్మం, నల్లగొండ, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 19 మంది ఉన్నా ప్రధాన పోటీ ఐదారుగురి మధ్యే ఉంది. వీరిలో నలుగురు పీఆర్‌టీయూ నేపథ్యం ఉన్న అభ్యర్థులు ఉంటే.. వారిలో ఒకరు ప్రధానంగా బీసీ వాదాన్నే నమ్ముకున్నారు. ఈనెల 27న పోలింగ్ జరగనుంది. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ కూడా ఏ అభ్యర్థికీ మద్దతు ప్రకటించకపోవడంతో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. 2019 ఎన్నికల్లో పీఆర్‌టీయూ నుంచి ఇద్దరు పోటీ చేయడం.. ఫలితంగా ఓట్లు చీలడంతో యూటీఎఫ్ అభ్యర్థికి ఎమ్మెల్సీ స్థానం దక్కింది. దీంతో ఈసారి ఎమ్మెల్సీ ఎన్నిక పీఆర్‌టీయూకు సవాలుగా మారింది. ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తంగా 25,797 మంది ఓటర్లు ఉండగా, 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు

మిగతా 12వ పేజీలో...



20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

తెలంగాణలో 5, ఏపీలో 5 స్థానాలకు పోలింగ్
3న నోటిఫికేషన్.. 10 నుంచి నామినేషన్లు
షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు దక్కే అవకాశం
జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, కుసుమ్, అంజన్, బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, బండ్ల గణేశ్, సంపత్, షబ్బీర్ పేర్లు ప్రచారంలో..
రెండు స్థానాల్లో పోటీ పడాలని బీఆర్ఎస్ యోచన
ఒక స్థానంలో సత్యవతి రాథోడ్‌కు మరోసారి అవకాశం
బీసీ అభ్యర్థినైనా నిలబెట్టే చాన్స్ ఉందని ప్రచారం

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. తెలంగాణలోని 5, ఆంధ్రప్రదేశ్‌లోని 5 ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 20న పోలింగ్ నిర్వహించనున్నట్టు సోమవారం వెల్లడించింది. తెలంగాణలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఇందులో బీఆర్ఎస్ నుంచి

మిగతా 12వ పేజీలో...

రిజిస్ట్రేషన్ శాఖతో ఎల్ఆర్ఎస్ పోర్టల్ అనుసంధానం

నేటి నుంచి ఫీజుల చెల్లింపు అందుబాటులోకి సాఫ్ట్‌వేర్
డీడీలకు నో.. ఆన్‌లైన్, యూపీఐలకు ఓకే

13

కుంభమేళా నుంచి తిరిగొస్తూ.. అనంతలోకాలకు

యూపీలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి
మృతుల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన డీఈఈ వెంకట్ రాంరెడ్డి జంట, డ్రైవర్
నల్లగొండ జిల్లాకు చెందిన మరో మహిళ
విచారం వ్యక్తం చేసిన సీఎం రేవంత్

14

ప్రాణాలు తీసిన రుణపాశాలు

రాష్ట్రంలో అప్పులు తీర్చలేక నలుగురు రైతుల బలవన్మరణం

కరువు నేలలో 'ఏఐ' సేద్యం

రైతు వీడియోను పంచుకున్న సత్య నాదెళ్ల
మహారాష్ట్రలోని బారామతిలో ఉష్ణోగ్రతలు, భూసారంపై డేటాను వాడుకుని అధిక ఉత్పాదకత సాధించిన ఓ చెరుకు రైతు
టెక్నాలజీ సత్తా ఇది: మైక్రోసాఫ్ట్ సీఈవో
ఏఐ అన్నింటినీ మెరుగుపరుస్తుంది: మస్క్

2

క్యాన్సర్ కోరల్లో..

దేశంలో ప్రతి ఐదుగురు బాధితుల్లో ముగ్గురి మృతి
మరణాల రేటు 64.8%.. అమెరికా, చైనాలో 25, 50%
స్త్రీలలో రొమ్ము, పురుషుల్లో నోటి క్యాన్సర్ కేసులెక్కువ
భారత్‌లో ఏటా 2% మేర క్యాన్సర్ కేసులు పెరిగే ముప్పు
లాన్సెట్ జర్నల్‌లో ఐసీఎంఆర్ అధ్యయన నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: భారతదేశంలో క్యాన్సర్ చికిత్స పొందుతున్న ప్రతి ఐదుగురిలో సగటున ముగ్గురు (64.8%) చనిపోతున్నారని.. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. అందులోనూ మహిళల మరణాల సంఖ్య అధికంగా ఉందని తేలింది. క్యాన్సర్ కేసుల పరంగా చైనా, అమెరికాల తర్వాత మూడోస్థానంలో ఉన్న భారత్.. క్యాన్సర్ మరణాల సంఖ్య విషయంలో చైనా తర్వాత రెండో స్థానంలో ఉందని



మిగతా 2వ పేజీలో...

ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో నెలకు 1000 కొత్త కేసులు!

18 రాష్ట్రాల నుంచి వస్తున్న క్యాన్సర్ బాధితులు
గత ఐదు నెలల్లో 5257 కొత్త కేసుల నమోదు
నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లే 40 శాతం

14



గువాహటిలో 'జుమోర్ డ్యాన్స్' కార్యక్రమ వేదికపై డోలు వాయిస్తున్న మోదీ

ఆటవిక రాజ్యం తెచ్చినోళ్లు మన నమ్మకాలను గౌరవిస్తారా?

కుంభమేళాపై లాలూవి అసభ్యకరమైన వ్యాఖ్యలు
పశువుల దాణా మెక్కినోళ్లు రైతుల గురించి ఆలోచిస్తారా?
ప్రధాని నరేంద్ర మోదీ విమర్శ
'పీఎం కిసాన్' విడుదల
కుంభమేళాను విమర్శించే వారు రాబందులు, పందులు
యూపీ సీఎం యోగి వ్యాఖ్య

భాగల్పూర్, భోపాల్, ఫిబ్రవరి 24: మహా కుంభమేళాపై ఆర్జేడీ అధినేత లాలూ 'అసభ్యకరమైన' వ్యాఖ్యలు చేశారని ప్రధాని మోదీ మండిపడ్డారు. బిహార్‌లో 'ఆటవిక రాజ్యాన్ని' తెచ్చినోళ్లు కుంభమేళా గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ, లాలూపై తీవ్ర ఆరోపణలు

మిగతా 2వ పేజీలో...

14 నెలల్లోనే 905 కోట్లు!



సీఎంఆర్ఎఫ్ కింద సర్కారు రికార్డు సాయం
గంటల వ్యవధిలోనే ఎల్ఓసీల మంజూరు
పేద, మధ్యతరగతి వారికి వేగంగా సహాయం
పారదర్శకంగా అమలు చేయాలన్న సీఎం
అందుకనుగుణంగా పనిచేస్తున్న అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)' పథకం అమలులో ప్రభుత్వం రికార్డు నెలకొల్పింది. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన 14 నెలల్లోనే రూ.905 కోట్ల మేర నిధులు విడుదల చేసింది. సీఎంఆర్ఎఫ్ కింద 2023 డిసెంబరు 7 నుంచి 2025 ఫిబ్రవరి 23 నాటికి దాదాపు 2,09,500 నిరుపేద, పేద, మధ్యతరగతి కుటుంబాలకు సర్కారు వివిధ రూపాల్లో సాయం అందించింది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న

మిగతా 14వ పేజీలో...

కృష్ణా జలాలపై రాజీమార్గం

వాస్తవ నీటి అవసరాలు తేల్చడానికి ఇద్దరు సీఈలతో కమిటీ వేసిన కృష్ణాబోర్డు
ఆ నివేదిక వచ్చాక.. నీటి విడుదలపై నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని.. వాస్తవిక సాగు, తాగు నీటి అవసరాలను అంచనా వేయాలని, పరస్పర అంగీకారంతో రాజీ మార్గంలో నడవాలని తెలుగు రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్నాయి. జూలై దాకా సాగు, తాగు నీటి అవసరాలపై చర్చించడానికి జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్



మిగతా 13వ పేజీలో...



అసోం రాష్ట్రం గువాహటి పట్టణంలోని సరుసజాయ్ స్టేడియంలో సోమవారం దాదాపు 9వేల మంది ఒకేసారి సంప్రదాయ జుమూర్ నాట్యమాడారు. అసోంలో టీ పరిశ్రమ ప్రారంభమై 200 ఏళ్లు గడిచిన సందర్భంగా ఈ మెగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

యూఎస్‌ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు

» రెండు వేల మంది తొలగింపు

వాషింగ్టన్, ఫిబ్రవరి24: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ ఎయిడ్) సంస్థలో పనిచేసే 2 వేల మంది ఉద్యోగులను తొలగించారు. మిగిలిన వారిలో కొందరిని మినహాయించి మిగతావారందరికీ బలవంతపు సెలవులిచ్చారు. ప్రభుత్వ చర్యలను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్లను అమెరికా జిల్లా న్యాయమూర్తి జార్జ్ నికోలస్ తోసిపుచ్చారు. ఆ వెంటనే ట్రంప్ సర్కారు ఉద్యోగులను తొలగించే చర్యలు చేపట్టింది. ఇప్పటికే సంస్థకు నిధులను నిలిపివేయడంతో పాటు 600 మంది ఉద్యోగులను కార్యాలయ భవనంలోకి వెళ్లకుండా నిలిపివేశారు. దీంతో మిగతా ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. యూఎస్ ఎయిడ్ నిధుల వల్ల అంతర్జాతీయ స్థాయిలో అమెరికాకు ఒరిగిందేమీ లేదని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఎన్నికల కోసం భారత్‌కు రూ.182 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ.251 కోట్లు సాయం చేయడాన్ని ట్రంప్ తప్పుబట్టారు.

తేజస్ ఆలస్యంపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: తేజస్ యుద్ధవిమానాల తయారీలో ఆలస్యానికి కారణాలను గుర్తించి, పరిష్కారాలను సూచించేందుకు రక్షణ శాఖ ఐదుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. తేజస్ యుద్ధ విమానాలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) తయారు చేస్తున్న విషయం తెలిసిందే.! ఇటీవల భారత వాయుసేన చీఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ హాల్ తీరుపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఏరో ఇండియా షో'లో ఆయన మాట్లాడుతూ.. 2009-10లో ఆర్డరిచ్చిన తేజస్ విమానాలను హాల్ ఇంకా డెలివరీ చేయలేదని, ఆ సంస్థపై నమ్మకం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులిచ్చింది.

హిందీ పద్యం చదవలేదని విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

» చెన్నైలోని ప్రముఖ పాఠశాలలో ఘటన

చెన్నై, ఫిబ్రవరి 24: చెన్నైలోని ప్రముఖ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థిని దండించిన ఉపాధ్యాయురాలిని యాజమాన్యం సస్పెండ్ చేసింది. గత వారం విద్యార్థిని హిందీ పద్యం చదవలేదన్న కారణంతో ఉపాధ్యాయురాలు కొట్టారు. దీనిపై విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసినట్టు సోమవారం తెలిపింది. పాఠశాలలో భౌతికంగా, మానసికంగా దండనకు అవకాశం లేదని, ఈ నియమాన్ని అతిక్రమించినందుకు ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకున్నట్టు వెల్లడించింది.

పాక్‌లో విదేశీయుల కిడ్నాప్‌నకు ఉగ్ర యత్నాలు

» చాంపియన్స్ ట్రోఫీ వేళ పాక్ ఇంటెలిజెన్స్ హెచ్చరికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పాకిస్థాన్ వేదికగా జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను వీక్షించేందుకు వచ్చే విదేశీ పర్యాటకులకు ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందని ఆ దేశ ఇంటెలిజెన్స్ విభాగం హెచ్చరించింది. ఇస్లామిక్ స్టేట్ ఖొరాసాన్ ప్రావిన్స్ (ఐఎస్‌కేపీ) సంస్థ విదేశీ అతిథులను కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసే ప్రమాదముందని వెల్లడించింది. ముఖ్యంగా చైనీయులు, అరబ్ జాతీయులను లక్ష్యంగా చేసుకోవచ్చని తెలిపింది. ఐఎస్‌కేపీకి చెందిన వ్యక్తులు నగర శివార్లలో ఇళ్లను అద్దెకు తీసుకుని... సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో రిక్షా, బైకులు మాత్రమే వెళ్లే చోట విదేశీయుల కిడ్నాప్‌లకు ప్లాన్ చేస్తున్నారని పేర్కొంది. ఇటు అఫ్గనిస్థాన్ నిఘా విభాగం (జీడీఐ) కూడా ఐఎస్‌కేపీ దాడులు తెగబడే ప్రమాదముందని అధికారులను అప్రమత్తం చేసింది.

శ్యాం పిట్రోడా అటవీ భూమిని ఆక్రమించారు

» లోకాయుక్తకు బీజేపీ సీనియర్ నేత రమేశ్ ఫిర్యాదు

బెంగళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, రాహుల్‌గాంధీ అప్తుడు శ్యాం పిట్రోడా భూ ఆక్రమణకు పాల్పడినట్టు లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. బీజేపీ సీనియర్ నేత ఎన్ఆర్ రమేష్ సోమవారం సమగ్ర రికార్డులతో లోకాయుక్త అధికారులకు ఈ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ రమేష్ మీడియాతో మాట్లాడారు. బెంగళూరు యలహంక సమీపంలోని జారకబండ అటవీ రిజర్వు ప్రాంతంలో 12.35 ఎకరాల భూమిని శ్యాం పిట్రోడాకు 2001లో లీజు పద్ధతిలో కేటాయించారని తెలిపారు. 2011లో కాంట్రాక్టు ముగిసినా పిట్రోడా ఆ భూమిని తన ఆధీనంలోనే ఉంచుకున్నారని తెలిపారు. ఆ భూమిలో ఔషధ మొక్కలు సాగు ద్వారా ఏటా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆ భూమి విలువ రూ.400 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు.

ఢిల్లీ సీఎం ఆఫీసులో అంబేడ్కర్ ఫొటో తీసేశారు

» ఆప్ ఆరోపణ.. అంతా వట్టిదేనంటూ బీజేపీ మండిపాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశ రాజధాని ఢిల్లీలో విపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), పాలక బీజేపీ మధ్య తాజాగా ఫొటోల యుద్ధం మొదలైంది. సీఎం కార్యాలయంలో అంబేడ్కర్, భగత్‌సింగ్ ఫొటోలు తీసేశారంటూ మాజీ సీఎం, ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆతిశీ సోమవారం ఆరోపించారు. వాటిస్థానంలో మహాత్మాగాంధీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ఫొటోలు పెట్టారని సభలో అనడమే గాక.. 'ఎక్స్'లో ఆ ఫొటోలను పోస్టుచేశారు. బీజేపీ దళిత వ్యతిరేకి, సిక్కు వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్నారు. ఈ ఆరోపణలను సీఎం రేఖా గుప్తా, బీజేపీ నేతలు తిప్పికొట్టారు. సీఎం ఆఫీసులో గాంధీజీ, రాష్ట్రపతి, ప్రధాని ఫొటోలతో పాటు ఉన్న అంబేడ్కర్, భగత్‌సింగ్ చిత్రాలున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆప్ సర్కారు అవినీతిని బహిర్గతం చేసే 'కాగ్' నివేదికలను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోతున్నామని.. వీటి భయంతోనే ఆప్ అగ్ర నేతలు ఫొటోలపై రచ్చచేస్తున్నారని కమలనాథులు మండిపడ్డారు.

మాట వినకుంటే నిర్బంధం.. కరెంట్ షాక్‌లు!

» మయన్మార్‌లో సైబర్ నేరగాళ్ల చెరలో చిక్కిన వారి దుస్థితి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లో తమ చెరకు చిక్కిన భారతీయులను సైబర్ నేరగాళ్లు నానా ఇబ్బందులు పెడుతున్నట్టు తెలుస్తోంది. చీకటి గదుల్లో నిర్బంధించడంతోపాటు కరెంట్ షాక్‌లు పెడుతున్నట్టు ఓ బాధితుడు పేర్కొన్నారు. ఉద్యోగాల పేరుతో భారతీయులను మయన్మార్‌కు రప్పించుకుంటున్న సైబర్ నేరగాళ్లు.. అక్కడ వారితో సైబర్ నేరాలు చేయిస్తున్నారు. ఈ పని చేయడానికి నిరాకరించిన వారిని ముందుగా చీకటి గదుల్లో నిర్బంధిస్తున్నారు. అయినా మాట వినకపోతే కరెంట్ షాక్‌లు పెడుతున్న సందర్భాలు ఉన్నాయని చెర నుంచి విముక్తుడైన బాధితుడు మధుకర్‌రెడ్డి తన కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తెలిపారు. బాధిత యువకుల పాస్‌పోర్టులను ముందే చైనీస్ సైబర్ నేరగాళ్ల ముఠాలు గుంజుకుని తమ వద్ద పెట్టుకుంటున్నాయని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా.. ఈ చెర నుంచి 162 మందిని రక్షించిన పోలీసులు వారిని థాయ్‌లాండ్ సరిహద్దుకు తరలించి భారత ఎంబసీ అధికారులకు అప్పగించారు. ఇక్కడకు వచ్చిన వారిలో తెలంగాణకు చెందిన మధుకర్ రెడ్డి, మరో యువకుడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు యువకులు ఉన్నారు.

ఆటవిక రాజ్యం తెచ్చినోళ్లు

మన నమ్మకాలను గౌరవిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)



భాగల్‌పూర్‌లో పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో మోదీ, నితీశ్

చేశారు. భారత ఐక్యతను కుంభమేళా వేడుక నిదర్శనం అని.. ఐరోపా జనాభాకు మించి ప్రయాగ్‌రాజ్‌లో భక్తులు పుణ్యస్నానాలు చేశారని, బిహార్ నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు కుంభమేళాకు వచ్చారన్నారు. అయితే 'ఆటవిక రాజ్యం వాళ్లు' మన సంస్కృతి, వారసత్వాలు.. నమ్మకాలను ద్వేషిస్తారని లాలూ పేరును ప్రస్తావించకుండా విమర్శలు గుప్పించారు. ఇలాంటి వారు.. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని కూడా వ్యతిరేకించారని, దీన్ని బిహార్ ప్రజలూ మరిచిపోలేరని పేర్కొన్నారు. ఇటీవల న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని లాలూ ప్రసాద్ డిమాండ్ చేస్తూ.. "కుంభమేళాతో ఏం ప్రయోజనం? అదో మూర్ఖపు తంతు' అని విమర్శించారు. రైతులు బాగుపడాలనే ఉద్దేశం ఆర్జేడీకి లేదని.. పశువుల దాణాను భోంచేసిన వారికి రైతుల ప్రయోజనం గురించి ఆలోచించే తీరిక ఎక్కడుంటుంది? అని మోదీ ప్రశ్నించారు. అప్పట్లో ఆర్జేడీ, కాంగ్రెస్ కలిసి బిహార్‌లో అధికారాన్ని వెలగబెట్టడం ద్వారా ఆ రాష్ట్రాన్ని నాశనం చేశాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమం సందర్భంగా పీఎం-కిసాన్ కింద రైతుల ఖాతాల్లో 19వ విడత పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో వేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు ఎన్డీయే ప్రభుత్వం ఎంతో చేసిందని.. కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద దేశవ్యాప్తంగా 9.8కోట్ల మంది రైతుల ఖాతాల్లో 19వ విడత పెట్టుబడి సాయం కోసం రూ.22వేల కోట్లు వేశామని ప్రధాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని 40 నిమిషాలు మాట్లాడారు. ప్రసంగం ప్రారంభించే ముందు ఆయన్ను తామరగింజలతో తయారు చేసిన దండతో సన్మానించారు. తామరగింజలు మంచి ఆహారం అని, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉండటంతో తాను తామరగింజలను దాదాపు రోజూ ఆహారంలో తీసుకుంటానని మోదీ చెప్పారు. బిహార్‌లో తామరగింజల ఉత్పత్తి బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించామని, తామరగింజలకు ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ ఉందన్నారు.

క్షమించండి.. అందుకే ఆలస్యంగా వచ్చా

ప్రధాని మోదీ సోమవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులోనూ పాల్గొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉందని.. ఆర్థికరంగంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం అని ప్రపంచ బ్యాంకు చెప్పిందని ప్రధాని అన్నారు. కాగా ఐరాసలో వాతావరణ మార్పులపై పనిచేసే సంస్థ.. భారత్‌ను సౌరశక్తిలో సూపర్‌పవర్‌గా పేర్కొందని చెప్పారు. కాగా ఈ కార్యక్రమానికి 15-20నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు సదస్సులోని ప్రతినిధులను మోదీ క్షమాపణలు కోరారు. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని.. ఆ పరీక్షలు ప్రారంభమయ్యే సమయం, తాను సదస్సుకు రాజ్‌భవన్ నుంచి బయలుదేరే సమయం ఒకటేకావడంతో తాను ఆలోచించానన్నారు. తాను నిర్ణీత సమయానికే బయలుదేరితే.. భద్రత దృష్ట్యా ఏర్పాటుచేసే గ్రీన్ కారిడార్‌తో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉండేదన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు వెళ్లాక తాను బయలుదేరానన్నారు.

కుంభమేళాను విమర్శించేవారు రాబందులు, పందులు

» యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: మహా కుంభమేళాను విమర్శించేవారిపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాంటివారు రాబందులు, పందులు అని ప్రతి విమర్శ చేశారు. కుంభమేళాలో ఎవరు ఏది కోరుకుంటే అదే దొరుకుతుందన్నారు. 'రాబందులకు శవాలు దొరుకుతాయి. పందులకు బురద దొరుకుతుంది. సున్నితమైన వ్యక్తులకు అద్భుతమైన సంబంధాలు దొరుకుతాయి. వ్యాపారులకు బేరాలు, భక్తులకు స్వచ్ఛమైన ఏర్పాట్లు ఉన్నాయి' అని చెప్పారు. 'నిర్వహణ లోపాల వల్ల హజ్‌లో తొక్కిసలాట జరిగితే లౌకిక మేధావులు ఎవరూ మాట్లాడలేదు. అలాంటివారే కుంభమేళా ఏర్పాట్లపై విమర్శలు చేస్తున్నారు. ఎంతగా దుష్ప్రచారం చేస్తున్నా లక్షలాది మంది భక్తులు పవిత్ర స్నానాలు చేస్తూనే ఉన్నారు' అని చెప్పారు. కుంభమేళాలో దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ భక్తుల విశ్వాసం, ఉత్సాహంలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్‌పై విమర్శలు చేస్తూ వారిలాగా మతవిశ్వాసాలతో ఆడుకోబోమన్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు కుంభమేళా ఏర్పాట్లను సక్రమంగా చేయలేదని ఆరోపించారు.

500 కాదు.. 100 బిలియన్ డాలర్లే!



» యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా సాయంపై జెలెన్‌స్కీ ప్రకటన


» ప్రతిగా ఖనిజ సంపదను ఇచ్చేందుకు సిద్ధం: జెలెన్‌స్కీ

కీవ్, ఫిబ్రవరి 24: రష్యాతో తాము యుద్ధం కొనసాగిస్తున్న ఈ మూడేళ్లలో అమెరికా నుంచి తమకు రూ.8.67 లక్షల కోట్లు (వంద బిలియన్ డాలర్లు) మాత్రమే సాయం అందిందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్టు అది రూ.43 లక్షల కోట్లు(500 బిలియన్ డాలర్లు) కాదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తేల్చి చెప్పారు. ఆ 8.67 లక్షల కోట్లను అప్పుగా పరిగణించేందుకూ తాను సిద్ధంగా లేనన్నారు. తమ దేశం ఇస్తున్నవి గ్రాంట్లు అని, అప్పు కాదని నాటి అధ్యక్షుడు బైడెన్‌తోపాటు అమెరికా కాంగ్రెస్ కూడా స్పష్టంగా చెప్పినట్టు తెలిపారు. సోమవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో విలేకరుల సమావేశంలో జెలెన్‌స్కీ మాట్లాడుతూ 'అమెరికా నుంచి సాయం 100 బిలియన్ డాలర్లు మాత్రమే. 500 బిలియన్ డాలర్లు కాదు. ఉక్రెయిన్‌కు అందింది 100 బిలియన్ డాలర్లు మాత్రమే. అందుకు మేం కృతజ్ఞత తెలుపుతున్నాం. యుద్ధంలో ఇప్పటి వరకు 320 బిలియన్ డాలర్ల వ్యయం అయ్యింది. అందులో 120బిలియన్ డాలర్లు ఉక్రెయిన్ తన ప్రజల నుంచే సమకూర్చుకుంది. 100బిలియన్ డాలర్లు ఐరోపా నుంచి అందింది' అన్నారు. రక్షణ సాయం అందిస్తున్నందుకు ప్రతిగా అమెరికాకు సహజ వనరులను అందించేందుకు ట్రంప్‌తో తాను చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు. అయితే, ఉక్రెయిన్ ప్రజలు పదితరాలపాటు అమెరికాకు తిరిగి చెల్లించేలా ఎలాంటి ఒప్పందంపైనా తాను సంతకం చేయబోనన్నారు. ఒప్పందం ఉక్రెయిన్‌కు భద్రతా పరమైన గ్యారెంటీలు ఉండాలని, ఇరుదేశాలకూ ప్రయోజనకరంగా ఉండాలని పేర్కొన్నారు.

యుద్ధ ఖైదీలందరి విడుదల! రష్యాకు జెలెన్‌స్కీ ప్రతిపాదన

యుద్ధాన్ని ముగించేందుకు పరస్పరం యుద్ధ ఖైదీలందరినీ విడుదల చేద్దామని రష్యాకు జెలెన్‌స్కీ ప్రతిపాదన చేశారు. ఇరుదేశాల మధ్య యుద్ధం ప్రారంభమై మూడేళ్లయిన సందర్భంగా సోమవారం కీవ్‌లో ఓ సదస్సులో జెలెన్‌స్కీ మాట్లాడారు. ఉక్రెనియన్లందరినీ రష్యా విడుదల చేయాలని, బదులుగా తమ వద్ద బందీగా ఉన్న రష్యన్లందరినీ విడుదల చేసేందుకు సిద్ధమన్నారు.

లోకం తీరు



భారత్‌ను ఓడించకపోతే నా పేరు షెహబాజే కాదు!

» మా అన్న మీద ఒట్టేసి చెబుతున్నా

» బహిరంగ సభలో పాక్ ప్రధాని వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: బహిరంగ సభల్లో అత్యుత్సాహంతో ప్రసంగిస్తారన్న పేరున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తాజాగా తన పేరునే మార్చుకుంటానంటూ ప్రతిజ్ఞ చేసే స్థాయిలో ఉపన్యాసం ఇచ్చారు. భారత్‌ను ఆర్థికంగా, అభివృద్ధి పరంగా ఓడించకపోతే తనను షెహబాజ్ షరీఫ్ అన్న పేరుతో పిలవద్దన్నారు. పంజాబ్ ప్రావిన్స్‌లోని డేరా ఘాజీ ఖాన్‌లో ఇటీవల జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పిడికిలి పైకెత్తడం, గాలిలో చేతులు ఊపడం, వేదికమీద గెంతడం, ఛాతీపై కొట్టుకోవడం, పోడియం డెస్కును కొట్టడం వంటి విన్యాసాలు ప్రదర్శించారు. సామాన్యుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కఠోరంగా శ్రమిస్తోందని చెబుతూ "పాకిస్థాన్ పరిస్థితిని మెరుగుపరిచేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం. పరమాత్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ పాకిస్థాన్‌కు ఉన్నాయి" అని చెబుతూ ఆకస్మాత్తుగా తన ప్రసంగాన్ని భారత్‌వైపు మళ్లించారు. "మనందరి కృషి కారణంగా అభివృద్ధి, పురోగతి విషయంలో భారత్ మనకన్నా వెనుకన ఉండకపోతే నా పేరు షెహబాజ్ షరీఫ్ కాదు" అని అన్నారు. తన పెద్దన్న పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌పై ప్రమాణం చేసి ఈ విషయాన్ని చెబుతున్నానని పేర్కొన్నారు. ఈ ప్రసంగం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో విమర్శలు వెల్లువెత్తాయి. క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రగతి లేకున్నా పెద్దపెద్ద వాగ్దానాలు చేస్తున్నారని పలువురు విమర్శించారు.

క్యాన్సర్ కోరల్లో..

(మొదటి పేజీ తరువాయి)



తెలిసింది. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ (గ్లోబోకాన్ 2022)లో, గ్లోబల్ హెల్త్ అబ్జర్వేటరీలో.. 36 రకాల క్యాన్సర్ కేసులకు సంబంధించి అందుబాటులో ఉన్న రెండు దశాబ్దాలకు పైబడిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ఐసీఎంఆర్ ఈ అధ్యయన నివేదికను రూపొందించింది. అది 'లాన్సెట్ రీజనల్ హెల్త్ సౌత్ ఈస్ట్ ఆసియా'లో ప్రచురితమైంది. ఆ నివేదిక ప్రకారం.. అమెరికాలో ప్రతి నలుగురు క్యాన్సర్ బాధితుల్లో ఒకరు చనిపోతుండగా.. చైనాలో ప్రతి ఇద్దరు క్యాన్సర్ పేషెంట్లలో ఒకరు మృత్యువాత పడుతున్నారు. భారత్‌లో అంత కంటే ఎక్కువ చనిపోతున్నారు.

- ప్రపంచవ్యాప్తంగా ఏటా నమోదవుతున్న క్యాన్సర్ సంబంధిత మరణాల్లో 10 శాతం భారతీయులవే.
- రానున్న రెండు దశాబ్దాల్లో క్యాన్సర్ మరణాల సంఖ్యను నిరోధించడం భారత్‌కు పెనుసవాల్‌గా మారబోతోంది. దేశ ప్రజల సగటు వయసు పెరగడం వల్ల ఏటా క్యాన్సర్ మరణాల్లో 2 శాతం పెరుగుదల నమోదు కానుంది.
- దేశంలో నమోదవుతున్న క్యాన్సర్ కేసుల్లో 44 శాతం.. కేవలం ఐదు రకాల క్యాన్సర్లకు చెందినవే.
- మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు (మొత్తం కేసుల్లో 40%.. మరణాల్లో 24%), గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ కేసులు (మొత్తం కేసుల్లో 19%.. మరణాల్లో 20%) ఎక్కువ ఉండగా.. పురుషుల్లో నోటి క్యాన్సర్ కేసులు (16%), శ్వాసకోశ క్యాన్సర్లు (8.6%), ఆహారనాళ క్యాన్సర్లు (6.7%) ఎక్కువ ఉంటున్నాయి.
- దేశంలో అత్యధికంగా నమోదవుతున్న క్యాన్సర్లలో 13.8 శాతం రొమ్ము క్యాన్సర్ కేసులే. 9.2 శాతంతో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు రెండో స్థానంలో ఉన్నాయి.
- వయసుల వారీగా చూస్తే 70ఏళ్లు దాటిన వారిలో క్యాన్సర్ కేసుల శాతం ఎక్కువగా ఉంది. తర్వాత, 15-49ఏళ్ల వారిలో క్యాన్సర్ ఎక్కువగా వస్తోంది. 20 శాతం క్యాన్సర్ మరణాలు కూడా ఈ వయసువారిలోనే ఎక్కువగా నమోదవుతున్నాయి.

ఊబకాయంపై 'దశ'దిశగా పోరు

» విస్తృత ప్రచారానికి ప్రధాని శ్రీకారం

» ఒమర్ అబ్దుల్లా, ఆనంద్ మహీంద్రా, మోహన్‌లాల్ సహా 10 మంది ప్రముఖుల నియామకం

» తాము కూడా పది మంది చొప్పున నామినేట్ చేసిన ప్రముఖులు



ఆనంద్ మహీంద్రా



సుధామూర్తి



ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న ఊబకాయంపై మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన మరుసటి రోజే.. ప్రధాని మోదీ ఆ సమస్య నియంత్రణకు శ్రీకారం చుట్టారు. ఊబకాయంపై యుద్ధం చేయడంలో సహాయపడటానికి, విస్తృత ప్రచారానికి వివిధ రంగాలకు చెందిన 10 మంది ప్రముఖులను నియమించారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ఊబకాయంపై పోరాటానికి మరింత శక్తిని సమకూర్చేందుకు, ఆహారంలో వంట నూనెల వినియోగాన్ని తగ్గించడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీరిని నియమిస్తున్నాను. వారిని మరో 10 మందిని నామినేట్ చేయమని కోరుతున్నారు. తద్వారా ఈ ఉద్యమం మరింత పెద్దది అవుతుంది" అని పోస్టులో ఆ జాబితాను మోదీ ప్రకటించారు. వారిలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర, నటులు మోహన్‌లాల్, ఆర్ మాధవన్, గాయని శ్రేయా ఘోషాల్, భోజ్‌పురి గాయకుడు, నటుడు నిరాహువ, షూటింగ్ చాంపియన్ మను భాకర్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయ్ చాను, ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఎంపీ సుధామూర్తి ఉన్నారు. మోదీ ప్రకటనపై వీరు వెంటనే ప్రతిస్పందించారు. తమను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఊబకాయంపై ప్రచారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ తరఫున వారు కూడా 10 మంది చొప్పున నామినేట్ చేశారు. ప్రచారానికి కొనసాగింపుగా తాము ప్రతిపాదించిన ఆ 10 మంది మరో పది మందిని నామినేట్ చేయాలని కోరారు. ఆదివారం మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ఊబకాయం సమస్యపై మాట్లాడిన విషయం తెలిసిందే. వంట నూనెల వినియోగం పది శాతం తగ్గించాలని, ఆ విషయం చెప్పి మరో పది మందికి సవాల్ విసరాలని ఆయన కోరారు.

ఊబకాయం.. పెరిగిపోతోంది

ఊబకాయంతో ఆరోగ్యానికి ప్రమాదమని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 25 కంటే ఎక్కువ ఉంటే దానిని అధిక బరువుగానూ, 30 కంటే ఎక్కువ ఉంటే దానిని ఊబకాయంగానూ పరిగణిస్తారు. అయితే భారత్‌లో ఊబకాయానికి సంబంధించి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని గతేడాది లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించిన ఓ అధ్యయనం తెలిపింది. ఇది యువతలో ఎక్కువ అవుతోందని హెచ్చరించింది. ఇప్పటికే అసాంక్రమిక వ్యాధులైన గుండె జబ్బులు, స్ట్రోక్స్, మధుమేహంతో భారతీయులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఊబకాయం కూడా ఉంటే ఆ జబ్బుల తీవ్రత యువతలో మరింత పెరుగుతుంది. యుక్తవయసులోనే టైప్2 మధుమేహం బారిన పడే ప్రమాదం ఉంటుంది. దేశంలో ఇప్పటికే 10 కోట్ల మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. కొన్ని రకాల కేన్సర్ల రిస్క్ కూడా ఊబకాయంతో పెరుగుతుంది. గుండెలో మంట, గాల్ బ్లాడర్ వ్యాధులు, లివర్ సమస్యలు తలెత్తుతాయి. నిద్రలో కొంచెం సేపు ఊపిరి ఆగిపోయి మళ్లీ మొదలయ్యే స్లీప్ అప్నియా ప్రమాదం ఊబకాయుల్లో చాలా ఎక్కువ.

ఇవీ లెక్కలు..

- *2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 24% మహిళలు, 22.9% పురుషులు ఊబకాయులుగా ఉన్నారు.*
- *ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయులు ఎక్కువగా ఉన్న దేశాల్లో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.*
- *2035కి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 330 కోట్ల మంది ఊబకాయ బాధితులు ఉంటారని అంచనా. వీరిలో 77 కోట్ల మంది 5-19 ఏళ్ల మధ్య వారే ఉంటారు.*
- *గతేడాది లాన్సెట్ జర్నల్ అధ్యయనంలో పేర్కొన్న ప్రకారం.. 2022 నాటికి భారత్‌లో 1.25 కోట్ల మంది 5 నుంచి 19 ఏళ్ల మధ్య బాలలు అధిక బరువు ఉన్నారు.*
- *2030 కల్లా ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయ బాధిత పిల్లల్లోని ప్రతి 10 మందిలో ఒకరు భారత్‌లో ఉంటారని యూనిసెఫ్ ఒబేసిటి అట్లాస్-22 పేర్కొంది. ఆ సమయానికి భారత్‌లో 2.7 కోట్ల మందికి మించి ఊబకాయ పిల్లలు ఉంటారని అంచనా వేసింది.*

కరువు నేలలో ఏఐ సేద్యం

ఓ రైతు వీడియోను పంచుకున్న సత్య నాదెళ్ల

» మహారాష్ట్రలోని బారామతిలో సాగుకు ఏఐ జోడింపు

» ఉష్ణోగ్రతలు, భూసారంపై డేటాను వాడుకుని అధిక ఉత్పాదకత సాధించిన ఓ చెరకు రైతు

వాషింగ్టన్, ఫిబ్రవరి 24: వ్యవసాయానికి కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను జోడించి అద్భుతాలు సృష్టించిన ఓ రైతు వీడియోను మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల పంచుకున్నారు. కరువు, నీటి ఎద్దడిని తీవ్రంగా ఎదుర్కొంటున్న మహారాష్ట్రలోని బారామతిలోని బట్టీస్ షిరాలా ప్రాంతంలో సన్నకారు రైతులు ఏఐ సాయంతో మంచి దిగుబడిని సాధించినట్టు 'ఎక్స్'లో ఆయన తెలిపారు. దీనిపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ స్పందించారు. "ఏఐ ప్రతిదానినీ మెరుగుపరుస్తుంది" అంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. నిజానికి, బారామతిలో గత రెండేళ్లుగా మైక్రోసాఫ్ట్ వ్యవసాయ ప్రయోగాలు చేస్తోంది. కరువు, అప్పులు, విపరీతంగా పురుగుమందుల వినియోగంతో పెరిగిన పెట్టుబడి వ్యయాలు, ఆత్మహత్యలతో ఈ ప్రాంత రైతులు దీనస్థితిలో ఉండేవారు. వారి పంటలను తెగుళ్లు ఆశించేవి. ఈ పరిస్థితుల్లో ఇక్కడి సాగులోకి ఏఐ పరికరాలను మైక్రోసాఫ్ట్ ప్రవేశపెట్టింది. ఇందులోభాగంగా ప్రాంత ఉష్ణోగ్రతలు, భూసారంపై ఏఐ అందించిన సమాచారం ఆధారంగా చెరకు పంట వేసి ఓ రైతు మంచి ఫలితాలు సాధించారు. తక్కువగా దొరికే నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, పురుగుమందుల వాడకం బాగా తగ్గించి ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తిని ఆయన తీయగలిగారని సత్య నాదెళ్ల తెలిపారు. భారత వ్యవసాయ రంగంలో ఏఐ సమర్థ వర్తింపునకు ఇది మంచి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "వ్యవసాయ రంగంపై కూడా ఏఐ వేయగల ప్రభావానికి ఇదొక అద్భుత ఉదాహరణ. బారామతి సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులకు ఏఐపై అవగాహన కల్పించాం. శక్తివంతమైన ఈ సాంకేతికను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశాం. డ్రోన్లు, శాటిలైట్లు అందించిన భౌగోళిక ప్రాదేశిక సమాచారాన్ని వారు వాడుకున్నారు. తమ సేద్యాన్ని మెరుగుపరుచుకున్నారు" అని సత్య నాదెళ్ల వివరించారు. అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఏడీటీ) సాయంతో బారామతిలో మైక్రోసాఫ్ట్ ఈ ప్రయోగాలు చేపడుతోంది.



రైతు సురేశ్ జగ్‌తప్

బారామతిలో ఏఐ వినియోగం ఇలా..

మైక్రోసాఫ్ట్‌కు చెందిన అజూర్ డేటా మేనేజర్ ఫర్ అగ్రికల్చర్ (ఏడీఎంఏ) సహకారంతో డేటా ఆధారిత పరిష్కారాలకు మార్గం సుగమమైంది. శాటిలైట్లు, వాతావరణ కేంద్రాలు, సాయిల్ సెన్సర్ల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా రైతులకు వారి భూమి గురించి సమగ్రమైన అవగాహన కల్పించారు. నేలలోని తేమ, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ, పోషకస్థాయిలు ఇలా అన్ని రకాల వివరాలనూ అగ్రిపైలట్.ఏఐ అనే మొబైల్ యాప్ ద్వారా రైతులకు అందించారు. ఈ సమాచారమంతా స్థానిక భాషలోనే ఉండడంతో రైతులకు దాన్ని అర్థం చేసుకోవడం తేలికైంది. ఏఐ లాగరిథమ్స్ ఈ డేటాను విశ్లేషించి విత్తనాలు ఎప్పుడు నాటాలి, ఏ సమయంలో ఎంత నీరందించాలి, తెగుళ్ల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాలను రియల్‌టైమ్‌లో విశ్లేషించి రైతులకు తెలియజేసింది.

పెరిగిన దిగుబడి.. తగ్గిన ఖర్చులు..

బారామతి వ్యవసాయంలో కృత్రిమ మేధ అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. సక్రమమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల పంట దిగుబడులు 20 శాతం పెరిగాయి. ఎరువుల ఖర్చులు 25 శాతం తగ్గాయి. నీటి వినియోగం 8 శాతం తగ్గింది. మెరుగైన పర్యవేక్షణ, నిర్వహణ ఫలితంగా కోత అనంతర నష్టాలు 12 శాతం తగ్గాయి. ఇవన్నీ రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా వనరుల వృథాను, రసాయనాల వాడకాన్ని తగ్గించాయి. తద్వారా పర్యావరణ సుస్థిరతకు ప్రోత్సాహం అందించినట్టయింది.

భద్రత లేదు.. భరోసా లేదు

- వెట్టి చాకిరి, భయం గుప్పిట్లో పని
- మూడు నెలలకు అరకొర జీతం
- ఓ కంపెనీలో వలస కార్మికుల వేదన

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మనిషి బతకడానికి అత్యవసరమైన ఆక్సిజన్ సరిగా ఉండని ప్రదేశంలో పని. అనుక్షణం ప్రమాదం అంచునే పని చేయాలి. అయినా సరే వారికి భద్రత ఉండదు. భరోసా ఉండదు. చివరికి ఇచ్చే కొద్దిపాటి జీతాలు కూడా సమయానికి ఇవ్వరు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి ప్రైవేటు కంపెనీల్లో మైనింగ్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల వెతలివి. ఇటీవల ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో పని జరుగుతుండగా పైకప్పు కూలి 8 మంది అందులో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. వారిని రక్షించడానికి సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఓ కంపెనీ ఈ టన్నెల్ నిర్మాణ పనులను చేపడుతోంది. ఇందులో కార్మికులు, హెల్పర్లు, ఆపరేటర్లు ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, జమ్మూ- కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల నుంచి వచ్చారు. ఈ కంపెనీలో కార్మికులు ఎలాంటి పరిస్థితుల్లో పనిచేస్తున్నారో తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' సోమవారం వారిని పలకరించింది. సొంత ఊరిలో ఉపాధి లేక కట్టుకున్న వాళ్లని, కన్న పిల్లలను వదిలి ఇంత దూరం వస్తే కంపెనీలు తమతో వెట్టిచాకిరి చేయిస్తూ సరిగా వేతనాలు కూడా ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నెలకు రూ. 15 వేలు, కొంత టెక్నికల్ వర్క్ తెలిసిన ఆపరేటర్లు, హెల్పర్లకు మరో రూ. 2 వేల నుంచి రూ. 2500 వరకు అదనంగా జీతం ఇస్తున్నారు. అయితే మూడు నెలలకు ఒకసారి ఒక నెల జీతం ఇవ్వడమో లేదా ఆరు నెలలకు ఒకసారి రెండు నెలల జీతం ఇవ్వడమో చేస్తున్నారని చెబుతున్నారు. దీంతో కుటుంబసభ్యులకు డబ్బు పంపించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఉండేందుకు క్యాంపు వద్ద ఒక రేకుల షెడ్డు నిర్మించి ఇచ్చారు తప్ప వంట చేసుకునేందుకు కనీస సామగ్రి కూడా సమకూర్చలేదని వారు వాపోయారు. వంట సామగ్రి కోసం అడ్వాన్సులు ఇవ్వమని అడిగినా కంపెనీ చిల్లిగవ్వ కూడా ఇవ్వడంలేదని ఆవేదన చెందుతున్నారు. అటవీ ప్రాంతంలో ఉండటంతో పాములు, ఇతర జంతువులు తరచూ ఇబ్బందులు పెడుతున్నాయని, కనీస వసతులు లేవని పేర్కొంటున్నారు. నిత్యం సవాళ్లతో కూడిన పనిచేయడానికి వెళ్తున్నప్పటికీ సరైన రక్షణ చర్యలు కంపెనీ కల్పించడం లేదంటున్నారు. ప్రస్తుతం జరిగిన ప్రమాదం నుంచి తప్పించుకుని భయం(ట్రామా)లో ఉన్నామని అయినా సరే పనిచేయాలని కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నట్లు చెబుతున్నారు. వచ్చి ఇక్కడ ఎవరికీ చెప్పుకోలేక అవస్థలు పడుతున్నామన్నారు. ఇన్ని నెలలు పనిచేసి జీతం వదిలి వెళ్లలేక అలాగే పని చేస్తున్నామని ఆంధ్రజ్యోతికి తెలిపారు.


క్యాంపు వద్ద దీనంగా కూర్చున్న కార్మికులు

ప్రమాదం నుంచి తప్పించుకున్న బాధితుల అభిప్రాయాలు

ప్రాణాలు పోతున్నా పని చేయాలని ఒత్తిడి



మాతో పనిచేసే తోటి కార్మికులు సొరంగంలో చిక్కుకున్నారు. వారిని ఎప్పుడు బయటకు తీసుకొస్తారో చూడాలని ఉన్నప్పటికీ కంపెనీ వారు మమ్మల్ని సొరంగంలోకి వెళ్లి పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. మా పక్కన ఉండేవారు.. కళ్ల ముందే సొరంగంలో ఇరుక్కుపోయిన దృశ్యాలు మా కళ్ల ముందు కదలాడుతుంటే భయంతో ఏ పనులు చేయలేకపోతున్నాం.

- దిలీప్‌కుమార్, కార్మికుడు

ప్రాణం పోతదని తెలిసినా మరొకరిని కాపాడాం..



ఆ రోజు మాతో సొరంగంలోకి వచ్చిన ఇంజనీర్ ఇనుప చువ్వలు, రాళ్లు, మట్టి దిబ్బల మధ్యలో ఇరుక్కోవడంతో నాతో పాటు మరికొందరం కలిసి మా ప్రాణాలు పోతాయని తెలిసినా ఆయన్ను బయటకు లాగి కాపాడాం. భుజాలపైన వేసుకొని ఆయన్ను బయటికి తీసుకొచ్చాం. మరికొంత మందిని కాపాడాలనుకున్నా నీళ్లు, మట్టి ఒక్కసారిగా రావడంతో మాతో కాలేదు.

- జవారి సాహు, కార్మికుడు

సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారుల అనుభవాలు

రాళ్లు, మట్టిని తొలగించడమే ప్రధాన సవాల్



టన్నెల్ లోపలి పరిస్థితిని ఆదివారం నుంచి అధ్యయనం చేస్తున్నాం. మళ్లీ పైకప్పు కూలే ప్రమాదం లేకుండా రాళ్లు, మట్టి, ఇనుప చువ్వలు, ఐరన్ షీట్లు ఎలా తొలగించాలో ప్లాన్ చేస్తున్నాం. మొదట విద్యుత్తు శక్తిని పునరుద్ధరించాం. తర్వాత ఆక్సిజన్ లోపలి వరకు వచ్చే విధంగా చేశాం. ట్రైన్ 12 కిలోమీటర్ల వరకు వెళ్తోంది. అక్కడి నుంచి కన్వేయర్ బెల్టును పట్టుకొని ముందుకెళ్తున్నాం. అందులో ఇరుక్కున్న వారిని బయటకు తేవాలంటే మట్టిని, రాళ్లను తొలగించడం ప్రధాన సవాల్.. పెద్దమొత్తంలో బురద పేరుకుపోయి నడవడానికే ఇబ్బందిగా ఉంది. లోపల ఉన్నవారిని కాపాడేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటున్నాం.

- పవన్, అసిస్టెంట్ కమాండెంట్, ఎన్డీఆర్ఎఫ్

రెండు మీటర్ల మేర బురద ఉంది



లోపల బురద దాదాపు 2 మీటర్ల మేర పేరుకుంది. ప్రమాదంతో కన్వేయర్ బెల్టు 2 కిలోమీటర్ల మేర పాడైపోయింది. లోపల నుంచి మట్టి, బురద, రాళ్లు బయటకు తీసుకురావడానికి అవకాశం లేకుండా పోయింది. కన్వేయర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది. లేకపోతే లోపల మట్టి బయటకు రాదు. ప్రొక్లెయినర్‌ను కూడా లోపలకు పంపుతున్నాం. ముందుగా వాటర్ లీకేజీని అరికట్టాల్సి ఉంటుంది. డీ వాటరింగ్ కూడా అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ఇవి పూర్తికాకుండా ఏదైనా చేయడానికి ప్రయత్నిస్తే సహాయక చర్యలకు మరింత ప్రమాదంగా మారుతుంది. శనివారం రెండు సార్లు స్లైడింగ్ జరిగింది. దాంతోనే తీవ్రత ఎక్కువగా ఉంది.

- రాజీబ్ దరిప, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎన్డీఆర్ఎఫ్

చిక్కుకున్న వారిని గుర్తించేందుకు
స్నిఫర్ డాగ్‌ల సేవలు

- శ్రమిస్తున్న 584 మంది నిపుణులు
- ఓ అధికారి ఫోన్ రింగ్ కావడంతో
- ఆచూకీ గుర్తింపు: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్/అచ్చంపేట/దోమలపెంట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు స్నిఫర్ డాగ్స్‌ను వినియోగిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఏడు పర్యాయాలు టన్నెల్ లోపల తనిఖీలు నిర్వహించామని, ఆయా బృందాల్లో 584 మంది నిపుణులు సేవలందిస్తున్నారని చెప్పారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులలో ఈ బృందాలు రెస్క్యూ ఆపరేషన్లను సమర్థంగా నిర్వహించాయన్నారు. సోమవారం కేంద్ర, రాష్ట్ర విపత్తు బృందాలతో పాటు ఆర్మీ, నేవీ, సింగరేణి, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం, జేపీ, నవయుగ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'టన్నెల్ లోపల ఉండే వారి ఆచూకీ తెలుసుకునేందుకు స్నిఫర్ డాగ్స్‌ను తెచ్చారు. అయితే నీరు ఎక్కువ ఉన్నందున స్నిఫర్ డాగ్స్ లోపలకు వెళ్లలేకపోయాయి. అలాగే పై నుంచి రంధ్రం చేసి లోపలికి వెళ్లాలనే ప్రతిపాదనలను విరమించుకున్నారు. 14 ర్యాట్ హోల్ బృందాల సేవలను కూడా వినియోగిస్తున్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఓ అధికారి ఫోన్ రింగ్ అయింది. దాని ప్రకారం వారి ఆచూకీ గుర్తించారు' అని వెల్లడించారు. నిరంతరం ఆక్సిజన్ పంపిణీ కొనసాగుతుందని చెప్పారు.అంతకుముందు సంఘటనా స్థలంలో పరిస్థితులను మంత్రి స్వయంగా పరిశీలించారు.

8 మంది టన్నెల్‌లో.. సీఎం ప్రచారంలో!

- రేవంత్‌ది దిగజారుడు రాజకీయం: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది ఆచూకీ తెలియని విపత్కర పరిస్థితుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం.. దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రికే బాధ్యత లేకపోతే, అధికార యంత్రాంగానికి ఎక్కడ ఉంటుందని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఓట్ల వేటలో జిల్లాలు చుట్టి వచ్చేందుకు సమయం ఉంది కానీ.. ఒక్క సారి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌కు వెళ్లే తీరిక లేదా? అని ధ్వజమెత్తారు. ప్రజాపాలన అంటే నోట్లు, ఓట్ల వేట మాత్రమేనా? ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకిచ్చే విలువ ఇదేనా? అని నిలదీశారు. సహాయక చర్యలు కొలిక్కి రాకముందే, ఇరుక్కున్న వారు బతికుండే అవకాశం లేదని సర్కారు చేతులెత్తేస్తున్న తీరు.. ఆందోళన కలిగిస్తోందన్నారు.

అడుగడుగునా అవాంతరాలు!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి దాదాపు ఐదు దశలుగా డీ వాటరింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. సోమవారం మరో 100 హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఉత్తరాఖండ్‌లోని సహాయక చర్యల్లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఈ రెస్క్యూ ఆపరేషన్ కోసం రప్పించారు. అయితే శనివారం రాత్రే రెస్క్యూ ఆపరేషన్ పనులు ప్రారంభమైనా.. ఇప్పటివరకు యాక్షన్ ప్లాన్ కొలిక్కి వచ్చినట్లు కనిపించడంలేదు. లోపల ఉన్న పరిస్థితులపై పూర్తి అవగాహన రాకుండా చర్యలు చేపడితే మళ్లీ టన్నెల్ కూలిపోయే ప్రమాదం ఉందని ఎన్డీఆర్ఎఫ్ బలగాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగానే పక్కాగా ప్రణాళికలు చేసుకొని సహాయక చర్యల్లో వేగం పెంచే యోచనలో ఉన్నాయి. పూర్తిస్థాయి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టేందుకు సహాయక బృందాలు సోమవారం మధ్యాహ్నం 3.40 గంటలకు పూర్తి ప్రణాళికతో టన్నెల్ లోపలికి వెళ్లాయి. ఉదయం కొంతమంది, మధ్యాహ్నం మరికొంత మంది చొప్పున దాదాపు 35 మంది కార్మికులు లోపల గ్యాస్ కట్టర్లతో ఐరన్ షీట్లు, పైపులు, చువ్వలను తొలగిస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రత్యేకంగా తయారుచేసిన వ్యాగన్ ట్రాలీలో ప్రొక్లెయిన్‌ను లోపలికి పంపించారు.

ప్రధాన సమస్యగా కన్వేయర్ బెల్టు..

సొరంగంలో టీబీఎం పనిచేస్తున్నప్పుడు వచ్చే మట్టి, రాళ్లను బయటకు తరలించేందుకు టన్నెల్ పొడవునా కన్వేయర్ బెల్టు ఉంది. అయితే రెండు సార్లు సొరంగంలో మట్టి దిబ్బలు కూలడంతో 2 కి.మీ. మేర కన్వేయర్ బెల్టు పూర్తిగా దెబ్బతిన్నది. అయినా.. ప్రస్తుతం అక్కడ పేరుకుపోయిన మట్టి, రాళ్లు, బురద, ఇనుప చువ్వలు, ఐరన్‌షీట్లు, పైపులను బయటకు తరలించడానికి ఉన్న ఏకైక మార్గం కన్వేయర్ బెల్టు మాత్రమే. ట్రెయిన్ కూడా 12 కి.మీ. వద్దకే వెళుతోంది. అక్కడి నుంచి బురద పేరుకుపోయింది. ప్రొక్లెయినర్ వెళ్లినా బురద క్లియర్ కాకుండా పనులు చేపట్టే అవకాశం లేదని ఎన్డీఆర్ఎఫ్ నిపుణులు చెబుతున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మట్టి, రాళ్లు, బురద తొలగింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. కానీ, కచ్చితంగా కన్వేయర్ బెల్టు పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుందని తెలుస్తోం ది. కాగా, చిన్న చిన్న సందుల్లో కూడా దూరిపోయి ఎలుకల్లాగా రెస్క్యూ ఆపరేషన్లు చేయగలిగి, ఉత్తరాఖండ్ ప్రమాదంలో విజయవంతంగా ప్రాణాలు కాపాడటంలో సహాయపడిన ర్యాట్ హోల్ మైనర్స్‌ను ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దింపింది. అయితే ఇందుకోసం కూడా మట్టి దిబ్బల మధ్య గ్యాప్‌లను గుర్తించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లో ఉపయోగించిన పుష్ క్యామ్, ప్రొబోస్కోప్ టెక్నాలజీని ఇందులో ఉపయోగించనున్నారు. దాదాపు ఉన్నచోటు నుంచి 100-150 మీటర్ల వరకు గ్యాప్‌లను గుర్తించి 360 డిగ్రీల వ్యూతో అటువైపు గ్యాప్‌ల పరిస్థితిని తెలుసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడనుంది. ఉత్తరాఖండ్ ప్రమాదంలోనూ ఈ టెక్నాలజీ విజయవంతంకావడంతో పిలిపించారు. ఎల్అండ్‌టీ కంపెనీకి చెందిన నలుగురు, సొలినాస్ కంపెనీకి చెందిన ఇద్దరు సాయంత్రం 3.40 గంటలకు టన్నెల్ లోపలికి వెళ్లారు. వారు పరిస్థితిని అధ్యయనం చేసిన తర్వాతే ప్రణాళికను రచించనున్నారు.


సొరంగంలోకి మినీ జేసీబీని తీసుకెళ్తున్న కార్మికులు

ఆ 10 మీటర్లు ఇప్పటికీ ప్రమాదమే..

ప్రస్తుతం టన్నెల్ లోపల 12 కి.మీ. వరకు ట్రెయిన్ వెళ్తోంది. ఆ తర్వాత మొత్తం తడకలు, థర్మకోల్ తెప్పల సాయంతో ముందుకు వెళ్లాల్సివస్తోంది. అలా వెళ్లిన కార్మికులు కటింగ్ పనులు చేస్తున్నారు. అయితే కంపెనీ ఇచ్చిన జియోలాజికల్ సర్వే ప్రకారం 13.622 కి.మీ. నుంచి 13.633 కి.మీ. వరకు.. మధ్యలో 10 మీటర్లు ఇప్పటికీ సున్నితంగానే ఉన్నట్లుగా, దీనిని వీక్ జోన్‌గా గుర్తించారు. అదే ఇప్పుడు తొలగింపు ప్రక్రియ వేగంగా జరగకుండా అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది. లోపలి నుంచి కమ్యూనికేషన్ కోసం ట్రెయిన్‌కు ప్రత్యేకంగా యాంటినా సెట్‌ను అమర్చి తీసుకెళ్లారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా ఇబ్బంది కాకుండా ఉండేందుకు జనరేటర్‌ను కూడా తీసుకెళ్లారు.

రెస్క్యూ ఆపరేషన్ ఇలా..

- ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు లోపలికి వెళ్లిన సహాయక బృందాలు రాత్రి 7:30 గంటలకు తిరిగి వచ్చాయి. ఆదివారం రాత్రి 12 గంటలకు లోపలికి వెళ్లిన మరో బృందం సోమవారం ఉదయం 7:30 గంటలకు తిరిగి వచ్చింది. సహాయక చర్యలు ప్రారంభమైనప్పటి నుంచి ఏడు మార్లు బృందాలు లోపలికి వెళ్లి బయటకు వచ్చాయి.
- సోమవారం ఉదయం 7:30 గంటలకు 16 మంది కార్మికులను లోపలికి తరలించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1:15 గంటలకు మరో 15 మంది కార్మికుల బృందాన్ని తీసుకెళ్లారు.
- ఉదయం 10 గంటలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బాలునాయక్ వచ్చారు. పరిస్థితిని అధికారులతో సమీక్షించారు. రెస్క్యూ ఆపరేషన్‌లో వేగం పెంచడానికి రాబిన్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి అమెరికా నుంచి నిపుణులను పంపించాలని సూచించారు.
- మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రొక్లెయినర్‌ను లోపలకు తీసుకెళ్లడానికి వీలుగా ట్రాలీ వ్యాగన్ చుట్టూ మరికొన్ని అమరికలు బిగించారు.
- సాయంత్రం 3.40 గంటలకు 26 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, జియోలాజిస్టు, ఎల్అండ్‌టీ, సొలినాస్ కంపెనీ ప్రతినిధుల బృందం లోపలికి వెళ్లింది.
- సాయంత్రం 4.20 గంటలకు ట్రెయిన్ ట్రాలీపై ప్రొక్లెయినర్, జనరేటర్‌ను లోపలికి పంపించారు.

భూ ఆక్రమణ కేసులో ఆశన్నగారి జీవన్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ భూఆక్రమణ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఉర్లపల్లి గ్రామంలోని సర్వే 32,35,36,38 నెంబర్లలో సోము దామోదర్‌రెడ్డికి చెందిన 20.20 ఎకరాల భూమిని ఆక్రమించారని పేర్కొంటూ జీవన్‌రెడ్డి, ఆయన భార్య రజిత, తల్లి, వాచ్‌మెన్ సురేశ్‌లపై చేవెళ్ల, మోకిల పోలీస్‌స్టేషన్‌లలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిని కొట్టేయాలని కోరుతూ జీవన్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లను ఇటీవల హైకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసుల్లో పోలీసులు అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. పోలీసుల వివరణ కోరుతూ విచారణను మార్చి 3కు వాయిదా వేసింది.

మోటర్ ఆన్ చేసి.. నల్లాలు విప్పి

- శబ్దం విని బయటకు వచ్చిన దంపతులపై దొంగల దాడి
- 70 తులాల బంగారం.. రూ. ఏడు లక్షలు చోరీ
- హుజూరాబాద్‌లో ఘటన

హుజూరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దోపిడీ ముఠాలు రోజురోజుకు కొత్త ఎత్తులు వేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాయి. కరీంనగర్ జిల్లాలో ఆదివారం రాత్రి ఓ ఇంటి ప్రహరీ దాటి లోపలికి వెళ్లిన దొంగలు.. కరెంటు మోటర్ ఆన్ చేసి బయట ఉన్న నల్లాలన్నింటిని విప్పారు. శబ్దం విని బయటకు వచ్చిన వారిపై దాడి చేసి ఇంట్లోకి చొచ్చుకెళ్లారు. ఇంట్లో ఉన్న ఏడు లక్షల నగదు, 70 తులాల బంగారం కాజేశారు. హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడలోని ఓ ఇంటిలో ప్రతాప రాఘవరెడ్డి, వినోద నివసిస్తున్నారు. వారి కుమార్తె మానస ఇటీవల అమెరికా నుంచి వచ్చింది. ఆదివారం రాత్రి వారి ఇంటి బయట మోటర్ ఆన్ చేసిన శబ్దం వినిపించడంతో వినోద తలుపులు తీసుకుని బయటకు వచ్చింది. అప్పటికే అక్కడ వేచి చూస్తున్న ముగ్గురు ముసుగులు దొంగలు ఒక్కసారిగా కత్తితో ఆమెపై దాడి చేశారు. ఆమెను ఇంట్లోకి తీసుకెళ్లి చీరతో కట్టివేశారు. రాఘవరెడ్డిపై దాడి చేశారు. మానసపై కత్తిపెట్టి బెదిరించారు. ఇంట్లో ఉన్న ఏడు లక్షల నగదు, 70 తులాల బంగారం దొంగిలించారు. ముగ్గురి ఫోన్లు లాక్కుని ఇంటికి తలుపులకు బయట నుంచి గడియపెట్టి పరారయ్యారు. ఇదంతా అరగంట సమయంలో జరిగింది. వాళ్లు వెళ్లిపోగానే బాధితులు కేకలు వేయడంతో పక్కన ఇంట్లో ఉండే కొడుకు వచ్చి తలుపు తీశాడు. గాయపడ్డ వినోద, రాఘవరెడ్డిని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా ఎస్‌ఎల్‌బీసీ?

- ఇప్పటికే రూ.2,689 కోట్ల వ్యయం
- ప్రాజెక్టు పూర్తికి మరో 1948 కోట్లు అవసరం
- సహాయక చర్యలు పూర్తయితేనే.. నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టన్నెల్ పైకప్పు కూలడంతో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది..! ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరు, వేయికి పైగా గ్రామాలకు తాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన ఎస్ఎల్‌బీసీ పనులు.. ఆది నుంచి నత్తనడకన సాగుతున్నాయి. అమ్రాబాద్ అభయారణ్యంలో వన్యప్రాణులకు ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును 43.930 కిలోమీటర్ల మేర టన్నెల్‌గా చేపట్టారు. తాజా ప్రమాదంతో ఇన్‌లెట్ నుంచి తవ్వే టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం) పరిస్థితి ఎలా ఉందనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ టీబీఎం పూర్తిస్థాయిలో దెబ్బతింటే.. దాని స్థానంలో కొత్తదాన్ని తెప్పించేందుకు రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. మూడేళ్ల క్రితం ఔట్‌లెట్ వైపు బేరింగ్ దెబ్బతినగా.. కొత్తదాన్ని తెప్పించడానికి ఏడాది సమయం పట్టిందని, ప్రస్తుతం ఆ బేరింగ్ చెన్నై పోర్టులో ఉందని ఇంజనీర్లు గుర్తుచేస్తున్నారు. రెండువైపులా టన్నెల్ పనుల్లో ఇంకో 9.56 కిలోమీటర్లు పూర్తయితే.. ప్రాజెక్టు కొలిక్కి వస్తుంది. అయితే.. 2019 నుంచి ఊటనీరు, మట్టి/రాళ్లు కూలడం వంటి సమస్యలు ప్రారంభమయ్యాయి. దాంతో.. సిమెంట్, పాలియేరిథిన్ గ్రౌటింగ్ చేయిస్తూ ముందుకు సాగడంతో పనులు నెమ్మదించాయి. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టుకు రూ.2,259 కోట్లు ఖర్చయ్యాయి. ఎస్ఎల్‌బీసీ పూర్తవ్వడానికి మరో రూ.1,948 కోట్లు అవసరం అని అంచనా. అయితే.. తాజా ప్రమాదంతో జరిగిన నష్టాన్ని ఇంకా అంచనా వేయాల్సి ఉంది. సహాయక చర్యలు పూర్తయితేనే ఇది సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టీబీఎం తప్ప మరో మార్గం లేదు

టన్నెల్‌ను పూర్తి చేయడానికి టీబీఎంను వినియోగించడం తప్ప మరో మార్గం లేదు. ఇంత పెద్ద టన్నెల్‌కు బయటికి వెళ్లే ద్వారం(యాడిట్) లేకపోవడం ప్రధాన సమస్య. యాడిట్ ఉంటే సహాయక చర్యలకు ఇబ్బందులుండేవి కాదు. టన్నెల్ పూర్తయితే 4 వేల క్యూసెక్కుల నీటిని గ్రావిటీతో తరలించడానికి అవకాశం ఉంటుంది. ఇన్‌లెట్ వైపు టీబీఎం పూర్తిస్థాయిలో దెబ్బతింటే.. దాని స్థానంలో డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ ప్రక్రియను చేపట్టాలి. అభయారణ్యంలో ఉండటం వల్ల.. యాడిట్ తప్పనిసరి.

- అశోక్‌కుమార్, మాజీ ఎస్ఈ

టన్నెల్‌కు ఆడిట్ పెట్టాలి: ఇంజనీరింగ్ నిపుణులు

ఈ ప్రమాదంతోనైనా సహాయక చర్యల్లో భాగంగా కేంద్ర అటవీశాఖ అత్యవసర అనుమతి తీసుకొని ఒక టన్నెల్ యాడిట్‌ను ఏర్పాటు చేయాలి. ఈ విధానంతో నిరంతరం టన్నెల్‌ను పరిశీలించడం.. మరమ్మతులు చేయడానికి అవకాశం ఉంటుంది. తాజా ప్రమాదంలో టన్నెల్ టీబీఎం దెబ్బతింటే.. ప్రాజెక్టు పూర్తవ్వడానికి మరింత సమయం పట్టవచ్చు.

ప్రపంచానికి తెలియాల్సిన యోధురాలు ఈశ్వరీబాయి
ప్రొఫెసర్ లారెన్స్ సైమన్

సైమన్‌కు ఈశ్వరీబాయి పురస్కార ప్రదానం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికోసం పోరాడిన ఈశ్వరీబాయి పేరు చిరస్థాయిగా నిలుస్తుందని అంతర్జాతీయ అభివృద్ధి, సుస్థిరాభివృద్ధి కేంద్రం సంచాలకుడు ప్రొఫెసర్ లారెన్స్ సైమెన్ కొనియాడారు. ఆమె సామాజిక, రాజకీయ పోరాట జీవితం ప్రపంచానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో ఈశ్వరీబాయి 34వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లారెన్స్ సైమన్‌కు ఈశ్వరీబాయి స్మారక పురస్కారాన్ని మాజీ మంత్రి గీతారెడ్డి ప్రదానం చేశారు. ఈశ్వరీబాయి కుమార్తె గీతారెడ్డి, అల్లుడు డాక్టర్ రామచంద్రారెడ్డి, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి వినోద్ కుమార్, అంబేడ్కర్ వాది వీబీరాజు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సంగీత, నాటక అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల, సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ పాల్గొన్నారు.

28న గచ్చిబౌలి స్టేడియంలో
రక్షణ, అంతరిక్ష వ్యవస్థల ప్రదర్శన

- డీఆర్‌డీవో ఎంఎస్ఎస్ డీజీ రాజబాబు, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

అల్వాల్/చంపాపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీవో, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సంయుక్తంగా ఈనెల 28న గచ్చిబౌలి స్టేడియంలో అత్యాధునిక సాంకేతికతలు, రక్షణ, అంతరిక్ష వ్యవస్థల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల(ఎంఎస్ఎస్) డైరెక్టర్ జనరల్, విశిష్ట శాస్త్రవేత్త రాజబాబు, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని పలు సంస్థలకు చెందిన ప్రతినిధులతో పాటు శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. డీఆర్‌డీఎల్, ఆర్‌సీఐ, సీసీఎంబీ, ఐఐసీటీ, మిథాని, బీడీఎల్, బీఈఎల్, హెచ్ఏఎల్, ఈసీఐఎల్, ఐఐటీ హైదరాబాద్, ఐఐఐటీ హైదరాబాద్ వంటి విద్యాసంస్థలు, పరిశ్రమలు పాల్గొంటాయన్నారు. మొదటి రోజు ఇంజనీరింగ్, పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు 30 వేలమంది వరకు హాజరవుతున్నట్లు చెప్పారు. 200 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రెండవ, మూడవ రోజుల్లో సాధారణ ప్రజలు ఈ ప్రదర్శన తిలకించవచ్చని డీజీ తెలిపారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలుస్తోంది.


మీడియాతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో ఎంఎస్ఎస్ డీజీ రాజబాబు, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సరిదిద్దుకోవాల్సిన తప్పు

భారత్, నేపాల్ సంబంధాలు సవ్యంగా లేని కాలంలో, ఒడిశా-లోని కళింగ వర్సిటీలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన రెండు దేశాల మధ్యా దూరాన్ని మరింత పెంచింది. నేపాలీ విద్యార్థిని ప్రకృతి లామ్సాల్ ఆత్మహత్య, న్యాయంకోసం పోరాడిన నేపాలీ విద్యార్థులపై దాడులు, క్యాంపస్ నుంచి గెంటివేత ఇత్యాది వరుస పరిణామాల-మీద లోతైన దర్యాప్తు చేపట్టవలసిందిగా ఆ దేశ మానవహక్కుల సంఘం మనదేశంలోని సంస్థను అభ్యర్థించింది. నేపాలీ విద్యార్థులను మాటలతోనూ, చేతలతోనూ భయభ్రాంతులకు గురిచేసి, వారు తమ చదువు కొనసాగించలేని పరిస్థితులను యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు సృష్టించారని, వారిమీద కఠినమైన చర్యలు తీసుకుంటే తప్ప ఆ భయం తొలగిపోదని ఆ సంస్థ సోమవారం విడుదల చేసిన తన లేఖలో వ్యాఖ్యానించింది. శనివారం నాడు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేపాల్ విదేశాంగమంత్రితో ఫోన్‌లో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, బాధితులకు అండగా ఉంటామని చాలా హామీలు ఇచ్చారు. వాళ్ళు కూడా మా పిల్లలే, భద్రమైన-వాతావరణంలో చక్కగా చదువుకొనేట్టు చేసే బాధ్యత నాది అంటూ భరోసా ఇచ్చారు. తనను కలిసిన నేపాల్ రాయబార కార్యాలయం అధికారుల్లో కూడా నమ్మకం పెంచే ప్రయత్నాలు చేశారు ఆయన. ఇదంతా బాగానే ఉన్నది కానీ, రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్‌లోని ఒక పెద్ద యూనివర్సిటీలో వెయ్యిమంది విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని, వారిని యాజమాన్యం పక్షాన రంగంలోకి దిగిన ఓ నలభైయాభైమంది చావగొట్టారని, అంతా కలిసి ఈ నేపాలీ విద్యార్థులను క్యాంపస్‌నుంచి బయటకు గెంటేశారని ముఖ్యమంత్రికి ఎప్పటి-కప్పుడు సమాచారం తెలియకుండా ఉంటుందా?

నేపాలీ విద్యార్థిని ఆత్మహత్యకు మరో విద్యార్థి కారకుడు కానీ, అనంతర పరిణామాలకు ఆ యూనివర్సిటీ యాజమాన్యం, ప్రొఫెసర్లు కారకులు. వారి బాధ్యతారహితమైన వ్యవహారశైలి, సామరస్యపూర్వకమైన పరిష్కారం మీద గౌరవం లేకపోవడం, పొరుగుదేశం పిల్లల-మీద చిన్నచూపు ఇత్యాదివి ఈ చిచ్చురాజుకోవడానికి కారణం. తోటి నేపాలీ ఆత్మహత్య చేసుకున్నందున విద్యార్థులను ఆగ్రహావేశాలు కమ్ముకోవడం సహజం. కారకుడైన విద్యార్థిని అరెస్టుచేయాలనో, శిక్షించాలనో డిమాండ్ చేయడమూ సరైనదే. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు, విద్యార్థుల ప్రతిస్పందన, ప్రవర్తన అనూహ్యంగానే ఉంటాయి. నేపాలీ విద్యార్థులు యూనివర్సిటీ ఆస్తులనేమీ ధ్వంసం చేయలేదు, ఎవరిమీదా దాడులూ చేయలేదు. బాధితురాలికి మరణానంతర న్యాయం జరగాలని నిలదీస్తున్న మన పొరుగుదేశ విద్యార్థుల మీద అంత తీవ్రంగా విరుచుకుపడటం అన్యాయం. యువతి మృతి ఒక సమస్య అయితే, విద్యార్థులను ఉన్నపళంగా స్వదేశానికి తరిమేయడం దౌత్యపరంగా మరింత తీవ్రసమస్యను సృష్టించింది. నేపాల్ ప్రధాని పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశం మనమే అందించాం.

ఈ కమిటీలు, అరెస్టులు, సస్పెన్షన్లు ఇత్యాదివన్నీ జరిగిన నష్టాన్ని కొద్దిమేరకు భర్తీచేయడానికి ఉపకరిస్తాయేమో కానీ, నేపాల్ విద్యార్థులకు భారత్‌లో జరిగిన అన్యాయం, ఈ సందర్భంగా నేపాల్‌ను అవమానిస్తూ కొందరు ప్రొఫెసర్లు చేసిన వ్యాఖ్యలు ఆ దేశ ప్రజల మనస్సుల్లోంచి త్వరగా చెరిగిపోవు. పరిణామాలను పూర్తిగా యూనివర్సిటీ దయాదాక్షిణ్యాలకు వదిలేయకుండా అలజడి ఆరంభం కాగానే రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగకపోవడం పెద్ద తప్పు. ఇప్పుడది దౌత్యసమస్యగా పరిణమించడంతో నేపాల్‌ను అవమానించడం తమ ఉద్దేశం కాదనీ, విద్యార్థులంతా వెనక్కురావాలని యూనివర్సిటీ కోరుతోంది. సీనియర్ విద్యార్థిపై ప్రకృతి లమ్సాల్ చేసిన ఫిర్యాదులను పెడచెవినపెట్టి, ఆమె మరణానికి కారకులైనవారే ఆమె పేరిట ఒక అవార్డును కూడా ప్రకటించారు. కానీ, వందలాది మందిని సస్పెండ్ చేసి, దాడులతో వారిని భయభ్రాంతులను చేసిన నేపథ్యంలో, విద్యార్థుల విశ్వాసాన్ని చూరగొనడం అంత సులభం కాదు. నేపాల్ మీడియాలో మాస్కులు పెట్టుకొని ఈ సంఘటనపై విద్యార్థులు మాట్లాడుతున్న విడియోలు ప్రచారంలో ఉన్నాయి. విద్యార్థుల్లో భరోసా కల్పించే ప్రకటనలు, చర్యలతో కేంద్ర ప్రభుత్వం జరిగిన తప్పిదాన్ని సరిదిద్దాలి. డబుల్ ఇంజన్ సర్కార్ అయినంత మాత్రాన దానికే వదిలేయకూడదు.

రాష్ట్రాలన్నీ తమిళనాడు వైపేనా?



ఒక రాష్ట్రం మరో రాష్ట్రానికి ఆదర్శం అవ్వటం ఇప్పుడున్న పోటీ రాజకీయాల్లో అంత సులువు కాదు. దేశవిదేశీ పెట్టుబడులను ఆకర్షించటంలో రాష్ట్రాల మధ్య పోటీ ఇంతా అంతా అని చెప్పలేం. గతం తాలూకు ఘనతల గురించి చెప్పుకునేటప్పుడు కూడా ఒకమెట్టు పైనే ఉండేట్లుగా ప్రతి రాష్ట్రమూ ప్రయత్నిస్తుంది. ఇక తమ గడ్డ మీద వ్యాపార అనుకూలతల గురించి, వాటిని అద్భుతంగా ప్రోత్సహించే తమ ప్రభుత్వ విధానాల గురించి ఏ రాష్ట్రమైనా సొంత గొప్పలు చెప్పుకుంటుందే తప్ప మరో రాష్ట్రంపై ప్రశంసా ప్రవచనాలు పలకదు. ఇదంతా ఆరోగ్యకరమైన పోటీనే అనుకుందాం! ప్రచారంలో ముందుండి పెట్టుబడులను ఆకర్షించటం సహజమే అనుకుందాం! కానీ దీనికి భిన్నంగా ఒక రాష్ట్రం ఇప్పుడు అందరికీ ఆదర్శప్రాయమైపోయింది. ఇటీవల అందరూ ఆ రాష్ట్రం వైపే చూస్తున్నారు. దాన్నే అనుకరించాలని ప్రయత్నిస్తున్నారు.

విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల విషయంపై 100 ఏళ్ల క్రితమే ఒక చరిత్ర సృష్టించిన తమిళనాడు ఇప్పటికీ ఏదోరకంగా ఆ ఒరవడిని కొనసాగిస్తూనే ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి 69 శాతం రిజర్వేషన్లను (బీసీ–30 శాతం, ఎంబీసీ–20 శాతం, ఎస్సీ–18శాతం, ఎస్టీ–1శాతం) అమలుపరుస్తూ ఉండటమే దీనికి నిదర్శం. ఆ అంకెలకు దగ్గరగా ఉండాలనే రాష్ట్రాలకు ఇప్పుడు తమిళనాడు ఆదర్శంగా మారింది. ఎక్కువ శాతం రిజర్వేషన్లను అమలుపరచటమే కాకుండా వాటిని సర్వోన్నత న్యాయస్థానం సమీక్షకు దూరంగా.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టించటంలో కూడా తమిళనాడు సఫలమైంది. మరాఠాలకు రిజర్వేషన్లను (విద్య–12 శాతం, ఉద్యోగాలు–13శాతం) కల్పించటానికి మహారాష్ట్ర చేసిన ప్రయత్నాలకూ, 2023లో కులగణన జరిపి బిహార్ చేపట్టిన చర్యలకూ తమిళ రిజర్వేషన్లే ప్రేరణ. కులగణనకు అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి, వందల కోట్లు ఖర్చుపెట్టి, కులాల జనాభాతో పాటు విద్య ఉద్యోగాలు, ఆర్థిక వివరాలు సేకరించిన అనంతరం రిజర్వేషన్లను (65శాతం) పెంచుతూ బిహార్‌లో చట్టం చేసినా హైకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టుకు ఎక్కినా ఊరట దక్కలేదు. ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కేంద్ర ప్రభుత్వం కల్పించిన 10శాతం రిజర్వేషన్లతో.. సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన 50శాతం రిజర్వేషన్ల పరిమితికి అడ్డంకి తొలగిపోయిందనే వాదనకూ ఆమోదం లభించలేదు. రిజర్వేషన్లు 50 శాతానికి మించి పెంచటానికి చాలా రాష్ట్రాల్లో చేసిన ప్రయత్నాలకు ఏదో ఒక స్థాయిలో న్యాయస్థానాలు నిలువరించాయి. మహారాష్ట్ర, బిహార్‌తో పాటు రాజస్థాన్, హర్యాణ, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నాయి. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు కల్పించిన రక్షణతో ఈశాన్య రాష్ట్రాలు మాత్రం 50 శాతానికి మించి రిజర్వేషన్లను పెంచుకోగలిగాయి.

1992లో ఇచ్చిన మండల్ తీర్పును సుప్రీంకోర్టు పునఃసమీక్షించనంత వరకూ రిజర్వేషన్లను 50 శాతాన్ని దాటించటం సాధ్యం కాదు. 69 శాతం రిజర్వేషన్ల పరిరక్షణకు తమిళనాడు ప్రభుత్వం 1994లో తీసుకువచ్చిన చట్టాన్ని రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్లో పెట్టటం ఆనాటి రాజకీయ పరిస్థితుల్లో మాత్రమే సాధ్యమైంది. పీవీ నరసింహారావు నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నాడీఎంకే మద్దతుపై ఆధారపడి ఉంది. 1991 ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీచేసి 39 లోక్‌సభ స్థానాల్లోనూ గెలిచాయి. అదొక అసాధారణ రాజకీయ సన్నివేశం. అందుకే తమిళనాడు ఒత్తిడి ఫలించింది. ఆ తర్వాత అలాంటి ఒత్తిడి కేంద్రానికి ఎదురుకాలేదు. బిహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం కూడా 65 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ తీసుకొచ్చిన చట్టాలను తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టించలేకపోయింది. ఇక 9వ షెడ్యూల్‌లో పెట్టినంత మాత్రాన సుప్రీంకోర్టు నుంచి రక్షణ ఉంటుందని చెప్పటానికి వీల్లేదు. 2007లో ఇచ్చిన తీర్పులోనే సుప్రీంకోర్టు ఆ విషయాన్ని స్పష్టంచేసింది. రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి విరుద్ధంగా ఉన్న చట్టాలను 9వ షెడ్యూల్‌లో పెట్టినప్పటికీ న్యాయసమీక్ష నుంచి మినహాయింపు లభించదని తేల్చి చెప్పింది. ఆ తీర్పు తర్వాత తమిళనాడు రిజర్వేషన్లకు సంబంధించి దాఖలైన పిటిషన్ ఇంకా సుప్రీంకోర్టులో పెండింగులోనే ఉంది. అందుకే తమిళనాడు రిజర్వేషన్లపై వివాదాన్ని ముగిసిన అధ్యాయంగానూ భావించలేం.

ఇప్పటివరకూ జరిగిన పరిణామాలను సమగ్ర దృక్పథం నుంచి చూస్తే రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచటానికి మామూలు స్థాయి కసరత్తు సరిపోదు. అసాధారణరీతిలో రాజకీయంగా ఏకాభిప్రాయం అందుకు అవసరం. ఇప్పుడున్న పరిస్థితుల్లో అది సాధ్యమవుతుందనీ చెప్పలేం. దేశవ్యాప్త కులగణన కోసం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని ఆమోదించి కిందటి లోక్‌సభ ఎన్నికల్లో దాన్నే ప్రధాన అంశంగా చేసుకుని పోరాడినా అనుకున్న ఫలితాలను సాధించలేదు. బీజేపీ నేతృత్వంలోని పాలకకూటమి నుంచి కులగణనపై ఇంతవరకూ సానుకూల ప్రకటన వెలువవడలేదు. అసలు ఆ కూటమి అత్యున్నత స్థాయి సమావేశాల్లో దాన్నొక ముఖ్య అంశంగా పరిగణించి చర్చించిన దాఖలాల్లేవు.



■ రాహుల్ కుమార్

రిజర్వేషన్లను రాజకీయ లాభనష్టాల ఎత్తుగడల్లో భాగంగా మార్చటంలో పార్టీలన్నిటి పాత్రా ఉంది. బీసీలను వర్గీకరించటానికి నియమించిన జస్టిస్ రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదిక గురించి కేంద్రం ఇప్పటివరకూ ఒక్కమాట మాట్లాడలేదు. ఏళ్లు గడుస్తున్నా అందులో ఏముందో బహిరంగం చేయటానికి బీజేపీకి రాజకీయ అనుకూలత కనపడటం లేదు. అర్థికంగా తీవ్రమార్పులకు లోనవుతున్న సమాజంలో కులాల వెనుకబాటుతనం, కులాలమధ్య అసమానతల గురించి ఎప్పుడో ఏర్పరుచుకున్న కొన్ని భావాలను మార్చుకోవాల్సి ఉంటుంది. బీసీ వర్గంలో ఉన్న కొన్ని కులాలే అధిక లబ్ధిని పొందాయి. మొన్నటి బిహార్ కులగణనలో అదే తేలింది. తమిళనాడు మొదటి బీసీ కమిషన్ కూడా ఈ విషయాన్ని 1971లోనే చాలా స్పష్టంగా వెల్లడించింది. బీసీల్లోని 11 శాతం కులాలు 37శాతం నాన్‌గజిటెడ్, 48శాతం గజిటెడ్ పోస్టులనూ 47శాతం ఇంజనీరింగ్, 34శాతం మెడికల్ సీట్లనూ, 34శాతం స్కాలర్‌షిప్‌లనూ దక్కించుకున్నట్లు కమిషన్ ఛైర్మన్ సత్తనాథన్ స్పష్టంచేశారు. ఇటువంటి గుత్తాధిపత్యాన్ని నిరోధించటానికి ఏడాదికి రూ.9000 ఆదాయం దాటని వారికే బీసీ రిజర్వేషన్లు ఉండాలని ప్రతిపాదించారు. ఆనాటి కరుణానిధి ప్రభుత్వం ఆ సిఫార్సును పట్టించుకోలేదు. కానీ ఆ తర్వాత వచ్చిన ఎంజీ రామచంద్రన్ ప్రభుత్వం 1979లో ఆ సిఫార్సుని అమల్లోకి తెచ్చింది. డీఎంకే ప్రభుత్వం దీన్నొక రాజకీయ అంశంగా మార్చి అప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేను ఓడించింది. దీంతో ఎంజీఆర్ ఆదాయ పరిమితి జీవోను ఉపసంహరించుకుని డీఎంకేని రాజకీయంగా దెబ్బతీయటంలో భాగంగా రిజర్వేషన్లను ఒక్కసారిగా 49శాతం నుంచి 69శాతం పెంచేశారు. సత్తనాథన్ కమిషన్ 33శాతం రిజర్వేషన్లను బీసీలకు ప్రతిపాదిస్తే డీఎంకే ప్రభుత్వం 31 శాతానికే పరిమితం చేసింది. మొత్తంగా రిజర్వేషన్లను 49 శాతానికి దాటకుండా చూసింది. కానీ 1980 నాటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రిజర్వేషన్ల శాతాన్ని ఎక్కడికో తీసుకెళ్లాయి. కమిషన్ తాజా అధ్యయనం లేకుండా, గణాంకాలతో అవసరాన్ని నిరూపించకుండా రిజర్వేషన్లను తమిళనాడులో అకస్మాత్తుగా పెంచారు. కారణమేదైనా ఒకసారి పెంచిన తర్వాత రిజర్వేషన్లను తగ్గించటం చాలాకష్టం.

యాభై శాతం రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు గీసిన లక్షణరేఖను దాటాలంటే స్వయంగా సుప్రీంకోర్టే దాన్ని చెరపివేయాలి. అది సాధ్యంకానప్పుడు పార్లమెంటే ఆ రేఖ విషయంలో ఒక విధానాన్ని రూపొందించాలి. ఈ రెండిటిలో ఏదో ఒకటి జరగకుండా అడుగుముందుకు పడదు. మండల్ తీర్పును తొమ్మిదిమంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చింది. ఆ తీర్పుని సమీక్షించి మార్పులు చేయాలంటే ఇంకా పెద్ద ధర్మాసనం ఏర్పాటుకావాలి. మరాఠా రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో జరిగిన వాదోపవాదాల సందర్భంగా దానికోసం విజ్ఞప్తులూ చేశారు.

అవేమీ ఫలించలేదు. రిజర్వేషన్లు 50 శాతం దాటితే రాజ్యాంగంలోని సమానత్వ సూత్రానికి విఘాతం కలుగుతుందనీ ఆ సూత్రం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమనీ మండల్ తీర్పు అప్పుడే సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

అన్నివైపులా సమస్యను ఆవరించి ఇలా ఎన్నో చిక్కుముడులు ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం విద్య ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కొత్త చట్టాలు చేస్తామని ప్రకటించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా 2017లో మొత్తం రిజర్వేషన్లను 62 శాతానికి పెంచుతూ చట్టం చేసి దాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలనీ కేంద్రాన్ని కోరింది. ఫలితం దక్కలేదు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన ఆధారంగా బిల్లులను రూపొందించి మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి పెంచటానికి ప్రయత్నిస్తోంది. ఇక్కడొక విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. బిహార్‌లో రిజర్వేషన్లను పెంచటానికి ముందు ఏ కులానికి ఎన్ని ఉద్యోగాలు దక్కాయో తెలిపే సమాచారాన్ని ఎంతో-కొంత బహిరంగపరచారు. తెలంగాణ ప్రభుత్వం ఆపాటి సమాచారాన్ని కూడా వెల్లడించలేదు. మార్చి మొదట్లోనే బిల్లులు ప్రవేశపెడతామని చెప్పినా ఇంతవరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల స్థూల జనాభా శాతాలను మాత్రమే ప్రకటించారు. వివిధస్థాయి ప్రభుత్వ ఉద్యోగాల్లో, చదువుల్లో కులాల వారీగా బీసీలు ఎంతెంతమంది ఉన్నారో తెలపటానికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. రిజర్వేషన్ల పెంపుపై సానుకూలత రావటానికి సైతం ఖచ్చితమైన సమాచారం చాలా అవసరం. రిజర్వేషన్లను పెద్ద ఎత్తున పెంచుతున్నప్పుడు వివిధ వర్గాల విద్య ఉద్యోగ పరిస్థితులపై తాజా గణాంకాలను తెలుసుకోవాలని పౌరులు కోరుకోవటం సహజం. మండల్ కమిషన్ కూడా అప్పటికి వివిధ శాఖలు అందించిన ఓబీసీ ఉద్యోగుల వివరాలను వెల్లడించింది. ఆ వివరాలతోనే సుప్రీంకోర్టు మండల్ సిఫార్సులతో ఏకీభవించింది.

> విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల విషయంపై 100 ఏళ్ల క్రితమే ఒక చరిత్ర సృష్టించిన తమిళనాడు ఇప్పటికీ ఏదోరకంగా ఆ ఒరవడిని కొనసాగిస్తూనే ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి 69 శాతం రిజర్వేషన్లను (బీసీ–30శాతం, ఎంబీసీ–20శాతం, ఎస్సీ–18శాతం, ఎస్టీ–1శాతం) అమలుపరుస్తూ ఉండటమే దీనికి నిదర్శం.

ఆశించిన రాజకీయ ఫలితాలు ఎలా ఉంటాయో తెలియకపోయినా కులగణనలతో నిజమైన సామాజిక, ఆర్థిక చిత్రం ఎంతో కొంత తెలుస్తుంది. నిశితంగా చూస్తే ఆర్థిక అంతరాలు ఇతర అంశాలపై క్రమేపీ పైచేయి సాధిస్తున్న దృశ్యమూ కనపడుతుంది! ఆ దృశ్యం ఒక్కటే చివరికి అన్ని అన్యాయాలను సరిదిద్దటానికి గీటురాయిగా మారినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు! ఫలితంగా ఆర్థిక హెచ్చుతగ్గుల దృష్టి బలపడి కులదృష్టిని పలచనచేసే కాలాన్నీ తీసుకురావొచ్చు!

> ఆశించిన రాజకీయ ఫలితాలు ఎలా ఉంటాయో తెలియకపోయినా కులగణనలతో నిజమైన సామాజిక, ఆర్థిక చిత్రం ఎంతో కొంత తెలుస్తుంది. నిశితంగా చూస్తే ఆర్థిక అంతరాలు ఇతర అంశాలపై క్రమేపీ పైచేయి సాధిస్తున్న దృశ్యమూ కనపడుతుంది! ఆ దృశ్యం ఒక్కటే చివరికి అన్ని అన్యాయాలను సరిదిద్దటానికి గీటురాయిగా మారినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు! ఫలితంగా ఆర్థిక హెచ్చుతగ్గుల దృష్టి బలపడి కులదృష్టిని పలచనచేసే కాలాన్నీ తీసుకురావొచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

నీడ కోల్పోతున్న నల్లమల చెంచులు

ప్రపంచం మొత్తంమీద మన దేశంలో అడవి తెగల జనాభా అధికం. అందుకే భారతదేశం అడవిబిడ్డల మానవశాస్త్ర పరిశోధనశాల. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డు తెగలు 35. ఇందులో చెంచులు అతి వెనుకబడ్డ గుంపులో ఉన్నారు. ప్రత్యేకంగా నల్లమల అడవుల్లో చెంచుల జనాభా 64,227. వీరు షెడ్యూల్డ్ తెగల జాబితాలో మూడవ స్థానంలో ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ తెగల జనాభా 59,18,000 కాగా చెంచులు 5.6 శాతం ఉన్నారు.

అడవి లోపలి భాగాన కొండ వరసలలో చెంచు గుడిసెలు గుంపులుగా పెంట లేక గ్రామంగా ఉంటాయి. వీరి ముఖ్యమైన వృత్తి వేట. వేటాడిన జంతుజాలంతో పాటు అడవి చెట్ల నుండి లభించే వివిధ తినుబండారాలు వారి ఆహారం. కొంతమంది నల్లమల అడవులలో వ్యవసాయాన్ని కూడా వృత్తిగా అనుసరిస్తున్నారు. వీరికి విద్య అవగాహన లేవు. వీరిని ఆదిమ గిరిజన సమూహాలు అంటారు. ఇంత వెనుకబడ్డ జీవనాన్ని సాగిస్తున్న చెంచుల పట్ల ప్రస్తుత భారత ప్రభుత్వం 'అడవుల వైవిధ్యాల పరిరక్షణ–1980' చట్టాన్ని అమలు చేసింది. దీనితో చెంచులకు అందవలసిన రక్షణ నిర్లక్ష్యానికి గురయింది.

'అడవుల వైవిధ్య పరిరక్షణ' అన్న ఆచరణ భారతదేశానికి కొత్త కాదు. కౌటిల్యుని రాజకీయ వ్యూహాల్లోను, అశోక చక్రవర్తి కాలంలోను ఈ ఆచరణలు ఉన్నాయి. బ్రిటిష్-వారు తమ పాలనలో అడవులలో నివసిస్తున్న అడవి బిడ్డలతో పాటు వారి పరిరక్షణలో ఉన్న విలువైన అటవీ సహజ వనరులపై ఆధిపత్యాన్ని పొందడానికి చిరుతపులులను పెంచి పోషించారు. ఈ ఆచరణతో పాటు అడవుల పరిరక్షణను బలపరిచిన సంఘటనలకు సాంస్కృతిక సందేశాలు తోడయ్యాయి. అవి– 1969లో మన దేశంలో జరిగిన 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్' సంస్థ 10వ జనరల్ అసెంబ్లీ ప్రకటించిన సందేశం "ఆసియా అంతటా పులుల సంఖ్య ప్రమాదకర స్థాయికి చేరుకుంది" అని. ఈ ప్రకటన మద్దతుతోనే 1973 నాటికి పులిని జాతీయ జంతువుగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని భారతదేశంలో మతపర ఆచార సాంస్కృతిక పరంగా పులికి ఉన్న విశిష్ట స్థానాన్ని ఆధారంగా తీసుకుని పరిరక్షణ నిర్ణయాన్ని బలపరిచింది.



> చెంచులు వంటి వెనుకబడిన ఆదివాసీలకు సంక్షేమం సమకూరితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుంది. అభివృద్ధి దిశను మార్చాలి. ఆదివాసీలను స్నేహితులుగా చూడాలి. చెంచులను రక్షించడమంటే సహజ వనరులను కాపాడడం. ఈ సంపదలో అగ్రభాగం రాబోయే తరాలదే.

1963 నుంచి 1/70 చట్టం అమలులో ఉంది. దీని ప్రకారం గిరిజనుల భూమి గిరిజనేతరులకు బదిలీ చేయడం నిషిద్ధం. 1980 నాటికి భారత ప్రభుత్వం 'అడవి వైవిధ్య పరిరక్షణ'తో పాటు చెంచుల అభివృద్ధిని ప్రకటించి, అమలుపరిచింది. దీనివల్ల చెంచులు స్థానభ్రంశం చెంది పట్టణ అంచుల్లోకి నెట్టబడ్డారు. చెంచులు పోరాడి సాధించుకున్న 1/70 చట్టం నిరర్థకమైంది. దీనికి కొనసాగింపుగా షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (పెసా) చట్టం 1996లో వచ్చింది. ఈ చట్టాన్ని చెంచులు తిరిగి పోరాడి సంపాదించుకున్నారు. ఈ చట్టం ప్రధాన లక్ష్యాలు– 1) గ్రామసభల ద్వారా స్వయంపాలనను ప్రోత్సహించడం. 2) సహజవనరుల నిర్వహణకు గ్రామసభలకు ప్రత్యేక అధికారాలను ఇవ్వడం. 3) గిరిజన సంఘాల హక్కులను చట్టబద్ధంగా గుర్తించడం. 4) గిరిజన జీవనోపాధులు, వర్గాల మొత్తం ఉన్నతికి దోహదపడడం. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ పెసా చట్టం వర్తిస్తుంది. కాని, ఈ లక్ష్యాలకు వ్యతిరేకంగా దేశంలో అతిపెద్ద రిజర్వాయర్లు, అభయారణ్యాలు ప్రభుత్వం ఏర్పరచింది. పర్యవసానంగా చెంచులు భూమిపై, అడవిపై, ఉపాధి హక్కులన్నీ పోగొట్టుకున్నారు. పోషకాహార లోపాలు, రక్తహీనతలు, టీబీ, మలేరియా వంటి రుగ్మతలకు లోనయి, ఆ జాతి క్షీణించసాగింది. అత్యంత భయాందోళనలకు లోనుచేసే విషయం యురేనియం తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం. చెంచులు నివసించే నల్లమల అభయారణ్యంలోనే 83 చ.కి.మీ. విస్తీర్ణంలో యురేనియం సర్వే, తవ్వకాలకు కేంద్ర పర్యావరణ, వాతావరణ మంత్రిత్వ శాఖ, అణుశక్తి శాఖ ఆమోదం తెలిపాయి. యురేనియం విద్యుత్ ఉత్పత్తికి, వైద్య అనువర్తనాల కోసం రేడియో ఐసోటోపుల తయారీ, అణుశాస్త్ర పరిశోధనలకు ఉపయోగపడుతుంది. అయితే యురేనియం తవ్వకాల పర్యవసానాలు దుర్భరంగా ఉంటాయి.

జాతీయ నీటివనరుల సంరక్షణ సమన్వయకర్త బి. సత్యనారాయణ వైజాగ్ జర్నలిస్టు ఫోరంలో మాట్లాడుతూ 'కృష్ణనది పరివాహక ప్రదేశానికి 0.5 కి.మీ. దూరంలో ఉన్న నల్లమల అడవిలో యురేనియం తవ్వకాల వల్ల, ఆ ప్రభావం నదీ జలాలపై ఉంటుంది. ఇవి కాలుష్యానికి గురవుతాయి. ఇది విపత్కర పరిస్థితులను సృష్టిస్తుంది. దీంతో కాలుష్యరహిత వాతావరణంలో జీవించే చెంచులు, చెట్లు, జీవజాలం విపత్తుల పాలవుతాయి. యురేనియం తవ్వకాలకు అనుమతుల వల్ల కాలుష్య నియంత్రణ యాక్టు 1986, అడవుల పరిరక్షణ యాక్టు 1980, వనజీవన రక్షణ యాక్టు 1972, అణుశక్తి నియంత్రణ యాక్టు 2011లను ఉల్లంఘిస్తూ రాజ్యాంగం ప్రజలకిచ్చిన జీవించే హక్కు, జీవనోపాధి హక్కులను ప్రభుత్వం కాలరాసింది. వికిరణ (అణుశక్తి ప్రతిచర్య నుంచి వచ్చే శక్తి రూపం) నుంచి ప్రజలను కాపాడడాన్ని ఆలోచించకుండా ఏ లక్ష్యసాధనకై ఇన్ని చట్టాలను ఉల్లంఘించారు? ఇందుకు కార్పొరేట్ శక్తులు బాధ్యత వహిస్తాయా? 1984లో భోపాల్ జరిగిన దుర్ఘటన వంటివి యురేనియం తవ్వకాలతో పునరావృతం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వం వహించాలి. లేనిపక్షంలో ప్రజలు ఈ బాధ్యతను చేపట్టాలి' అని అన్నారు.

ఈ చర్య వల్ల, చెంచుల ఉద్యమాల వల్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ తీర్మానించింది. దీనికి కొనసాగింపుగా రాజకీయ పార్టీలు, పర్యావరణ కార్యకర్తలు, ప్రజా సంస్థలు కలిసి యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. ఇంత పెద్దయెత్తున వ్యతిరేకత రావడం వల్ల ప్రభుత్వం యురేనియం తవ్వకాలను నిలిపివేసింది. అయితే గత ఏడాది పార్లమెంటు ఎన్నికల తర్వాత తిరిగి కొనసాగిస్తున్న దాఖలాలు కనబడుతున్నాయి. అడవుల్లోకి అధికారులు రావడం, ఆకాశంలో ఛాపర్లు కనిపించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విద్య అవగాహనకు ఆమడదూరంలో ఉన్న చెంచు వర్గాల ఓట్లతో రాజకీయ లబ్ధిపొందదలచిన ప్రభుత్వం ప్రపంచ దేశాలలో భారతదేశం మూడవ స్థానానికి చేరుకున్నట్లు ఎండమావులను చూపిస్తున్నది. ఇక చెంచుల అభివృద్ధి మాటేమిటి? చెంచులు వంటి వెనుకబడిన ఆదివాసీలకు సంక్షేమం సమకూరితేనే భారతదేశం అభివృద్ధి చెందుతుంది. అభివృద్ధి దిశను మార్చాలి. ఆదివాసీలను స్నేహితులుగా చూడాలి. చెంచులను రక్షించడమంటే సహజ వనరులను కాపాడడం. ఈ సంపదలో అగ్రభాగం రాబోయే తరాలదే.

● డా. వనమాల
పాలమూరు అధ్యయన వేదిక

ఫాస్టాగ్ పేరుతో మరో నిలువుదోపిడీ!

ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం లేని ఫాస్టాగ్ విధానం వల్ల కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందుతోంది. 2024లో కేంద్ర ప్రభుత్వానికి టోల్‌టాక్స్‌ల ద్వారా రూ.68,037.60కోట్ల ఆదాయం లభించింది. 2023వ సంవత్సరంతో పోల్చుకొంటే ఇది 9.2 శాతం ఎక్కువ. ప్రస్తుతం రోజుకి సగటున రూ.191.14కోట్ల ఆదాయం లభిస్తోంది. ఈ దోపిడీ చాలదన్నట్టుగా ఫాస్టాగ్ అకౌంట్‌లో తగినంత డిపాజిట్ లేకపోతే వాహనాలకు రెట్టింపు రుసుము వసూలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిస్థితి చూస్తే క్రమంగా టోల్‌గేట్లు దోపిడీ కేంద్రాలుగా మారుతున్నట్టు అర్థమవుతోంది.

ఫాస్టాగ్ అకౌంట్‌లో కనీసం 100 రూపాయలు ఉండాలన్న నిబంధన వల్ల ప్రస్తుతం ఫాస్టాగ్‌లను నిర్వహిస్తున్న ఎయిర్‌టెల్, జియోలతో పాటు వివిధ ప్రైవేటు బ్యాంక్‌లకు ఉచితంగా వందల కోట్ల రూపాయలు లభిస్తాయి. 2023–24 లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 50 కోట్లకుపైగా నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఈ వాహన యజమానులు ఒక్కొక్కరు తమ అకౌంట్లో కనీసం రూ.100 డిపాజిట్ చేసినా ఆయా బ్యాంక్‌లు, ఎయిర్‌టెల్ వంటి సంస్థల వద్ద ఎవరికీ ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేని రూ.5000 కోట్ల ప్రజల డబ్బు నిలువ ఉండిపోతోంది. ఇక తగిన డిపాజిట్ లేకపోతే టోల్ రుసుము రెట్టింపు వసూలు చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. ఇవిగాక దేశవ్యాప్తంగా 2022 నాటికి దాదాపు 50 లక్షల లారీలు/గూడ్స్ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా లభించే ఆదాయం అదనం.

ఇంతఖర్చు చేసినా వాహనదారులకు మాత్రం టోల్‌గేట్‌ల వద్ద వేచి వుండే పరిస్థితి మెరుగుపడలేదు. టోల్‌గేట్ నిర్వాహకులు నాసిరకం సెన్సార్‌లు వినియోగించడం వల్ల, అవి తరచూ పనిచేయకపోవడంతో, పెద్దఎత్తున వేచివుండాల్సి వస్తోంది. పండుగల సమయంలో అయితే వాహనాలు గంటల కొద్దీ వరుసలో నిలిచిపోతున్నాయి. టోల్‌గేట్ల వద్ద వాహనాలు మూడు నిమిషాలకు మించి నిలిచి వుండే పక్షంలో టోల్ ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతారు. కానీ ఆచరణలో అమలుకావడం లేదు. పండుగల సమయంలో టోల్‌గేట్ల వద్ద గంట సేపు వేచివున్నప్పటికీ టాక్స్ వసూలు చేస్తూనే వున్నారు.

టోల్ టాక్స్ విధానం అమల్లోకి వచ్చిన సందర్భంలో దేశవ్యాప్తంగా లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేయగా, కొత్తగా నిర్మించిన రహదారులలో రహదారుల నిర్మాణం కోసం చేసిన అప్పు తీరేంత వరకు అంటే 10–15 ఏళ్ల మాత్రమే వసూలు చేస్తామని, ఆ తర్వాత టోల్ టాక్స్ వుండదని కేంద్ర ప్రభుత్వం నచ్చచెప్పింది. కాని, వాస్తవంలో 15 ఏళ్లు దాటిన తర్వాత కూడా వసూలు చేస్తూనే వున్నారు. టోల్ టాక్స్ కేంద్ర ప్రభుత్వానికి మంచి ఆదాయ వనరుగా మారడంతో టోల్ ఆదాయంపై మరింత ఆశపెరిగింది. ఇదే సమయంలో రెండేళ్ల క్రితం వరకు నాలుగు లేన్లు అంతకుమించి లేన్లు ఉన్న రహదారులకు మాత్రమే టోల్‌గేట్‌లు ఏర్పాటు చేసి రుసుము వసూలు చేసేవారు. కాని తాజాగా కేవలం రెండు లేన్ల రహదారులకు కూడా టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తున్నారు.

> ఫాస్టాగ్ అకౌంట్‌లో కనీసం వంద రూపాయలు ఉండాలన్న నిబంధన వల్ల ప్రస్తుతం ఫాస్టాగ్‌లను నిర్వహిస్తున్న వివిధ ప్రైవేట్ బ్యాంక్‌లకు ఉచితంగా వందల కోట్ల రూపాయలు లభిస్తాయి. భారతదేశంలో దాదాపు 50 కోట్లకు పైగా నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఈ వాహన యజమానులు ఒక్కొక్కరు తమ అకౌంట్లో కనీసం రూ.100 డిపాజిట్ చేసినా ఆయా బ్యాంక్‌లు, సంస్థల వద్ద రూ.5000 కోట్ల ప్రజల డబ్బు నిలువ ఉండిపోతుంది.



యూరోపియన్ దేశాలలో టోల్ రహదారులు, సాధారణ రహదారులు కూడా వుంటాయి. వాహనదారులు సాధారణ రహదారులపై ప్రయాణం చేస్తే టోల్ టాక్స్ చెల్లించాల్సిన పనిలేదు. మన దేశంలో మనకు ఇష్టం వున్నా లేకపోయినా టోల్ టాక్స్ రహదారులపై మాత్రమే ప్రయాణం చేయాలి.

నిజానికి వాహనాలు కొనుగోలు చేసే సమయంలో 28 శాతం జీఎస్‌టీతో పాటు రోడ్ టాక్స్ కూడా వసూలు చేస్తారు. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి వాహనం ఖరీదులో 12 నుంచి 17 శాతం వరకు వసూలు చేస్తున్నారు. అంటే 20 లక్షల రూపాయల వాహనం కొంటే 2.40 నుంచి 3.40 లక్షల వరకు రోడ్డు టాక్స్ వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ఒక వాహనం వుండగా మరో వాహనం కొనుగోలు చేస్తే అదనంగా రెండు శాతం వసూలు చేస్తారు. అంటే ఇప్పటికే మనకు స్కూటర్ వుండి, కొత్తగా కారు కొనుగోలు చేస్తే లక్షకి 2 శాతం వంతున రూ.20వేలు అదనంగా వసూలు చేస్తారు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే జాతీయ రహదారుల అభివృద్ధికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తులపై రోడ్ డెవలప్‌మెంట్ సెస్‌ను విధిస్తోంది. ప్రస్తుతం ప్రజలు ప్రతి లీటర్ డీసెల్/ పెట్రోల్ ధరలో 7 రూపాయలను జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నాము. ఈ టాక్స్ ద్వారా 2022–23 సంవత్సరంలో దాదాపు రూ.22వేల కోట్లు వసూలు చేసింది. నిబంధనల ప్రకారం ఈ నిధులను రహదారులు అభివృద్ధికి వినియోగించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఈ నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. మొత్తంగా గమనిస్తే ఒక వాహనదారుడి నుంచి తొలుత రోడ్ టాక్స్, ఆ తర్వాత డీసెల్/ పెట్రోల్ ద్వారా రోడ్ సెస్ వసూలు చేయడంతో పాటు మరల జాతీయ రహదారిపైకి వస్తే టోల్ టాక్స్ అంటూ మొత్తం మూడు రకాల పన్నులను ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు.

టోల్‌టాక్స్, జీఎస్‌టీ, రోడ్ టాక్స్ వంటి పన్నుల ప్రస్తావన వచ్చినప్పుడు వాహనాలనేవి ధనవంతులకు సంబంధించిన అంశమని, వీటితో సామాన్యులకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? అంటూ అధికారంలో ఉన్న నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. టోల్‌టాక్స్ ధరలు సింపుల్‌గా కాకుండా వందల రూపాయలలో వుండటమే కాకుండా దూరప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తున్నప్పుడు వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ప్రత్యక్షంగా పన్నులు లారీ యజమానులు చెల్లిస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ పరోక్షంగా ఆ రవాణా ఖర్చుల భారం సరుకుల ధరలపై పడటం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే సమయంలో అఖిల భారత లారీ యజమానుల సంఘం వారు టోల్‌గేట్లు ఎత్తి వేయాలని, టోల్‌టాక్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని డీసెల్/ పెట్రోల్ ధరను పెంచడం ద్వారా పొందాలని కోరుతున్నారు. ఈ కారణంగా సరుకుల చేరవేతలో సమయం చాలా కలసి వస్తుందని వారు అంటున్నారు. లారీ యజమానులు ఎటువంటి రాయితీ కోరడం లేదు, టోల్‌గేట్ల ద్వారా ఎంత ఆదాయం వస్తోందో అంతే మొత్తంలో డీసెల్/ పెట్రోల్ ధరలు పెంచి, టోల్‌గేట్లు తొలగించాలని కోరుతున్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం టోల్‌గేట్లను యథావిధిగా కొనసాగించడంలో మర్మమేమిటో అర్థం కావడం లేదు.

ప్రపంచంలో మరే దేశంలో లేనివిధంగా భారతదేశంలో పెట్రోల్/ డీసెల్ లీటరు ధర మండిపోతోంది. వంట గ్యాస్ ధర నాలుగు రూపాయలు, పెట్రోల్ ధర 90 పైసలు పెరిగినప్పుడు ఖాళీ సిలెండర్లు, ఎడ్ల బండ్లు రోడ్లపైకి తీసుకువచ్చిన నేతలు గతాన్ని మరచి ధరలు పెంచుతున్నారు. దేశంవ్యాప్తంగా ఒకే విధమైన పన్ను అనే నినాదంతో జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పుడు క్రమంగా పెట్రోలియం ఉత్పతులు జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురాలేదు. కాని, ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా పెట్రోలియం ఉత్పత్తులను కూడా క్రమంగా జీఎస్‌టీ పరిధిలోకి తీసుకువస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణకు వచ్చేసరికి అదనంగా పన్నులపై పన్నులు విధిస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తోంది.

■ -అన్నవరపు బ్రహ్మయ్య



రుద్రేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు

- నేడు ప్రత్యేక చండీహోమం
- వివరాలు వెల్లడించిన ప్రధాన అర్చకుడు, ఈవో

7



'ఎమ్మెల్సీ' ప్రచారానికి నేటితో తెర

వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ స్థానానికి 27న పోలింగ్

- బరిలో 19మంది అభ్యర్థులు.. 76 పోలింగ్ బూత్‌లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,355మంది ఓటర్లు
- ఎవరికీ మద్దతివ్వని కాంగ్రెస్, బీఆర్ఎస్

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి మంగళవారం తెరపడబోతోంది. దీంతో 27వ తేదీన జరగబోయే ఊలింగ్‌పై ఉపాధ్యాయ సంఘాల నాయకులు దృష్టిపెట్టనున్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం బరిలో మొత్తం 19మంది అభ్యర్థులు ఉండగా.. పది రోజులుగా వివిధ ఉపాధ్యాయ సంఘాలు, స్వతంత్రులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అలాగే బీజేపీ నేతలు కూడా తమ అభ్యర్థి తరఫున ప్రచార పర్వం కొనసాగించారు. ఎన్నికల పోలింగ్‌కు 48గంటల ముందే ప్రచారాన్ని నిలిపి వేయాల్సి ఉండటంతో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి ప్రచారానికి తెరపడబోతోంది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు.

జోరుగా ప్రచారం

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. బరిలో 19 మంది అభ్యర్థులు ఉన్నప్పటికి ప్రధానంగా ఆరుగురి మధ్యే పోటీ ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవతుఉన్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ యూటీఎఫ్ మద్దతులో బరిలో దిగుతున్న అలుబెల్లి నర్సిరెడ్డి, టీచర్ జేఏసీ బలపరిచిన, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థిగా పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీసీ సంఘాలు బలపరిచిన మాజీ ఎమ్మెల్సీ పూల రవిందర్, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సుందరాజ్‌యాదవ్‌మధ్య ప్రధాన పోటీ ఉంటుందనే చర్చ జరుగుతోంది. వీరితోపాటు మరో 13మంది బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే బీజేపీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి తరుపున కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ జాతీయ నేతలు ఈటల రాజేందర్, డీకే. అరుణ తదితరులు ప్రచారం నిర్వహించారు. 20మందికి ఒక ఇంచార్జీ చొప్పున నియమించి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే టీచర్ జాక్ అభ్యర్థిగా బరిలో నిలిచిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డికి పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందనే ప్రచారం జరుగుతుంది. గత రెండు, మూడు పర్యాయలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మిగతా అభ్యర్థులు ఓటర్లను వ్యక్తిగతంగా కలవటంతో పాటు పలు అంశాలపై హమీలిస్తు ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఒక్క రోజే ప్రచారానికి సమయం ఉండటంతో అభ్యర్థులు ఎక్కువ మంది ఓటర్లను కలిసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ తటస్థ వైఖరి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్‌లు తటస్థత వైఖరిని

మిగతా 6వ పేజీలో...

'డ్వాక్రా'లో ఎన్నికల సందడి

స్వయం సహాయక సంఘాల ఎన్నికలకు కసరత్తు

- మార్చిలో నిర్వహణ.. సిబ్బందికి శిక్షణ
- జూన్‌లో జరగాల్సిన ప్రక్రియ ముందుకు
- మోడల్ బైలా ప్రకారం బైలాల సవరణ
- సంఘాల పాలకవర్గ కాలపరిమితి సైతం పెంపు



హనుమకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహిళా స్వయం సహాయక సంఘాల్లో కొత్త సారథులను ఎన్నుకునేందుకు ఎన్నికల హడావుడి మొదలైంది. ఆయా స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధి సాధించడంలో కీలక పాత్ర పోషించే అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. మొదట సంఘం సభ్యుల నుంచి గ్రామ, జిల్లా సమాఖ్యలకు అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లను ఎన్నుకునే ప్రకియ జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చేపట్టనున్నారు. ఎన్నికల నిర్వహణకు మండల, ఏపీఎం, సీసీలకు ఇతర సిబ్బందికి జిల్లా స్థాయిలో ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారంతా గ్రామస్థాయిలో కొత్త సారుధుల ఎంపికపై గ్రామైక్య సంఘాల సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నారు. మార్చి నెలాఖరులోగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసేలా గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) కార్యాచరణ రూపొందిస్తోంది.

ఆర్థిక స్వావలంబన

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో స్వయం సహాయక సంఘాలు ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా లబివృద్ధి సాధిస్తున్నాయి. మరికొన్ని సంఘాలు బ్యాంకుల లింకేజీల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లింపులు జరగని క్రమంలో సంఘంలోని అధ్యక్ష, ఉపాధ్యక్షులే కీలకంగా వ్యవహరిస్తారు. గ్రామైక్య సంఘంలో పొదుపు, స్త్రీనిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ రుణం, మహిళా శక్తి అభివృద్ధి రుణం, వాటర్‌షెడ్ రుణాలు వంటివి సంఘంలో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు సభ్యులు ప్రత్యేక దృష్టిసారిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా గ్రామ సంఘాలు రూ. కోట్ల లావాదేవీలను కొనసాగిస్తున్నారు. ప్రతీ నెల క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటూ బ్యాంకులు, స్త్రీనిధి రుణాలు పొందుతున్నారు.

ఎన్నికలు ఇలా...

స్వయం సహాయక సంఘంలో కనీసం 10 నుంచి 15 మంది వరకు సభ్యులుంటారు. సంఘాల్లో సభ్యుల్లో కొత్తవారికి అవకాశం కల్పించనున్నారు. నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశం నిర్వహించి ఏకగ్రీవం, చేతులు పైకెత్తి ఎన్నుకోవటం, చీటీలు రాసి సభ్యురాలి ఎన్నికకు మద్దతు తెలియజేయడంలాంటి మూడు పద్ధతుల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. సభ్యులంతా కలిసి తమ సంఘం నుంచి ఆసక్తి ఉన్న ఒక సభ్యురాలిని ఎన్నుకుంటూ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఒక్కో ఎస్‌హెచ్‌జీ నుంచి ఎన్నికైన వారంతా తమలోనే ప్రతీ ముగ్గురిలో మళ్లీ ఒకరిని ప్రతిపాదిస్తారు. ప్రతీ మూడు ఎస్‌హెచ్‌జీలకు ఒకిరి చొప్పున 10 నుంచి 12 మంది వరకు పాలక వర్గ సభ్యుల (డైరెక్టర్ల)ను ఎన్నుకుంటారు. వీరు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకుంటారు. ఇదే విధంగా మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య కార్యవర్గాలను ఎన్నుకుంటారు. మండల స్థాయి ఎన్నికల ప్రక్రియను ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మార్చి, ఏప్రిల్, నెలల్లో జిల్లా సమాఖ్య ఎన్నిక పూర్తి చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు సైతం చేస్తున్నట్లు తెలుస్తోంది.

పాలకవర్గం గడువు పెంపు

అధ్యక్షుల పదవీ కాలాన్ని పొడిగించినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామైక్య సంఘం అధ్యక్షురాలి పదవీకాలం ఐదేళ్ల, మండల, జిల్లా సమాఖ్యలకు మూడేళ్లపాటు నిర్ణయించారు. అదే విధంగా గతంలో కంటే ప్రస్తుతం కవిటీ సభ్యుల సంఖ్యను తగ్గించారు. మండల, జిల్లా సమాఖ్య సంఘానికి అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారితో కమిటీని ఎన్నుకోవాలని ఉత్తర్వులు జారీ అయినట్టు తెలుస్తోంది. స్వయం సహాయక సంఘాలకు సాధారణంగా జూన్‌లో నిర్వహించేవారు. ఈ సారి మార్చిలోగా పూర్తి చేయాలనే ఆలోచనతో ఏర్పాట్లు మొదలు పెట్టారు. కొత్తవారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు ఉన్న నియమావళిని రద్దు చేసి ఈ సంఘాలకు సంబంధించిన బైలాలను ఇటీవలే మార్చారు. ప్రభుత్వం మోడల్ బైలాను రూపొందించింది. దీని ప్రకారం మహిళాల సంఘాలకు ప్రస్తుతం ఉన్న బైలాను సవరించారు. ఇలా మార్పులు చేర్పులు చేసిన బైలాలను సంఘాలు ఆయా జిల్లాల సహకారాధికారులకు పంపి ఆమోదం తీసుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 3,073 గ్రామైక్య సంఘాలు, 58,239 స్వయం సహాయక సంఘాలు, 71 మండల సమాఖ్యలు, 6 జిల్లా సమాఖ్యలు 6,82,564 మంది సభ్యులు ఉన్నారు.



రైతులను పట్టించుకోరా?

- యాసంగి పంటకు సాగునీరు అందించాలి
- వారి కష్టాలు చూడకుండా ఎన్నికల ప్రచారానికెళ్తారా?
- సీఎంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్
- వరికి బోనస్.. ఓ బోగస్ అంటూ వ్యాఖ్యలు
- మానుకోట జిల్లాలో పర్యటన

కేసముద్రం మార్కెట్లో మిర్చి రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు

6



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అధికారులతో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను కోరారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసంపై సోమవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ప్రావీణ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రంజాన్ మాసానికి అధికారులు వారం రోజుల్లోగా ఏర్పాట్లు చేయాలన్నారు. మసీదుల వద్ద సరిపోయే తాగునీటి సౌకర్యాన్ని ఆర్‌డబ్ల్యూఎస్, జీడబ్ల్యూఎంసీ అధికారులు కల్పించాలన్నారు. తాగునీరు అవసరమైన చోట్ల అదనంగా నీటి ట్యాంకర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ జరగాలన్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరపాలన్నారు. ముస్లిం ఉద్యోగులకు ఒక గంట ముందుగా ఆఫీసు నుంచి వెళ్లేందుకు ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని, 24 గంటల పాటు దుకాణాలు తెరిచి ఉంటాయన్నారు. శుక్రవారం ముఖ్యమైన రోజుల్లో మసీదుల వద్ద ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, అవసరమైతే అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉండేటట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పవిత్ర రంజాన్ ఏర్పాట్లను రెవెన్యూ శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్ అధికారులు హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లయితే ఏవైనా సమస్యలు ఏర్పడితే ఆ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

- ఒక్కొక్కరి వద్ద రూ.2.50లక్షలకు శఠగోపం
- 8 మంది వద్ద మొత్తం రూ.20లక్షలు వసూలు
- మోసగాడిని అరెస్టు చేసిన గీసుగొండ పోలీసులు



రాహుల్ అరెస్ట్‌ను చూపుతున్న సీఐ మహేందర్

గీసుగొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 8మంది నిరుద్యోగుల వద్ద రూ.20 లక్షలను వసూలు చేసిన మోసగాడిని గీసుగొండ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ మేరకు గీసుగొండ సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ జిల్లా హనుమాన్ నగర్‌కు చెందిన హరిగొప్పుల రాహుల్ హైదరాబాద్‌లో నాచారం మల్లాపూర్‌లో గ్లోబల్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో హెచ్ఆర్ అడ్మిన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు వల పన్నాడు. ఈ క్రమంలో ప్రైవేటు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గీసుగొండ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన పృథ్వీ, దీపక్‌లు రాహుల్‌కు పరిచయం అయ్యారు. వారికి ఉద్యోగం ఇప్పిస్తానని రాహుల్ నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.2.5 లక్షల చొప్పున రూ.5 లక్షలు వసూలు చేశాడు. వారికి ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూ చేసినట్లు నటించి.. 2024 జనవరి 2వ తేదీన మాగ్నిక్యూ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినట్లు నకిలీ ఉద్యోగ పత్రాన్ని పృథ్వీ, దీపక్‌లకు అందించాడు. కంపెనీలో 6 నెలలు ట్రైనింగ్ ఉంటుందని, ఈ సమయంలో నెలకు రూ.20 వేలు ఇస్తారని, ట్రైనింగ్ అనంతరం రూ.40వేలు ఇస్తారని నమ్మబలికాడు.

రాహుల్ మాయమాటలు నమ్మిన పృథ్వీ.. సమీప బంధువులకు, స్నేహితులకు చెప్పడంతో శాయంపేట మండలం అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన ఎటుకాల పవన్‌కుమార్, కౌడగాని సాయిపవన్, కాంపెల్లి లక్ష్మారెడ్డి, భూపాలపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన గుండగాని రాజు, టకిరే సాయికృష్ణ, మాణికరావు సాయికుమార్‌ల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.2.5 లక్షలను రాహుల్ వసూలు చేశాడు. మొత్తం 8 మంది నిరుద్యోగుల వద్ద రూ.20 లక్షలు వసూలు చేసిన రాహుల్.. 4 నెలల తరువాత ఒక్క నెల రూ.20 వేల జీతం ఇచ్చి మిగిలినవి ఇవ్వలేదు. కంపెనీ మూసివేస్తున్నారని మీ డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి రాహుల్ తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితులు గీసుగొండ, భూపాలపల్లి, ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లలో 2024 అక్టోబరు 10వ తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన ఎస్సై ప్రశాంత్‌బాబు.. టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామంలో రాహుల్‌ను పట్టుకొని కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్‌కు పంపినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

పోటెత్తిన ఎర్ర బంగారం

- వరంగల్ మార్కెట్‌కు 80వేల మిర్చి బస్తాల రాక

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ అయిన వరంగల్ ఏనుమాములకు సోమవారం మిర్చి పోటెత్తింది. సుమారు 80వేలకుపైగా బస్తాలు వచ్చాయి. మార్కెట్‌లో ఎటుచూసినా మిరపబస్తాలే కనిపించాయి. ఈ సీజన్‌లో ఇంత పెద్ద మొత్తంలో మిర్చి రావడం ఇదే మొదటిసారి. అయితే ఇదే అదునుగా భావించిన వ్యాపారులు సిండికేట్ అయి మిర్చి రేటు తగ్గించారు. క్వింటాకు గరిష్టంగా రూ.13 వేలు, కనిష్టంగా రూ.7500 నిర్ణయించారు. కాగా, పెద్ద ఎత్తున మిర్చి బస్తాలు రావడంతో దొంగల బెడద ఎక్కువైంది. కూలీలు సైతం చేతివాటం ప్రదర్శించారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తలలు పట్టుకున్నారు.



వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి బస్తాలు

అక్రమాలపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దేవరుప్పుల మండల కేంద్రంలోని వాగులో అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డుకొని ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. సోమవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పెట్టిస్తే పోలీసులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు యాకయ్య పై కేసు నమోదు చేశారన్నారు. వారిని సోమవారం అరెస్ట్ చేసి 308 సెక్షన్ పెట్టి జైలుకు పంపారన్నారు. అక్రమ అరెస్ట్‌లకు తమ కార్యకర్తలు భయపడరని, నిజానిజాలు తెలుసుకోకుండా పోలీసులు అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. మా ప్రభుత్వంలో కాంగ్రెస్ కార్యకర్తల మీద ఎలాంటి తప్పుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కేసులు పెట్టించలేదన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని రానున్న రోజుల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభు త్వమే నని పోలీసుల వైఖరిపై ఇంతకు రెట్టింపు రుణం తీర్చుకుం టామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు అరిగోస పడుతున్నారని, గోదావరి జలాలతో చెరువులు, కుంటలు, వాగులు వంకలను నింపక పోవటంతో ఇప్పటికే రెండు పంటలు నష్టపో యారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లా సుంద ర్‌రామ్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, నాయకులు మల్లారెడ్డి, కృష్ణమూర్తి, సోమనర్సయ్య, నవీన్ నాయక్, యాదగిరి, తిరుమలేష్, హన్మంతు, ఏల సుందర్, కూతాటి నర్సింహులు, బస్వ వెంకన్న, జేరిపోతుల సాయిలు, వీ అర్జున్, చింత యాదగిరి, సంపత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోరా?

- వారి కష్టాలు చూడకుండా ఎన్నికల ప్రచారానికెళ్తారా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫైర్
- వరికి బోనస్.. ఓ బోగస్ అంటూ వ్యాఖ్యలు
- మానుకోట జిల్లాలో పర్యటన

మహబూబాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి, పసుపు పంటలకు ధరలు పడిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటునే వారిని పట్టించుకోకుండా, కష్టాలను చూడకుండా ముఖ్యమంత్రి రేవంత్ ఎమ్మెల్సీ ప్రచారం కోసం నిజామాబాద్ వెళ్లారని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించిన ఆమె జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో రైతులందరూ కన్నీళ్లు పెడుతున్నారని ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ఒప్పించి మిర్చి పంటకు మద్దతు ధర తెచ్చేందుకు కృషి చేస్తుంటే.. తెలంగాణ సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ ఢిల్లీకి వెళ్లి మద్దతు ధర కోసం పోరాటం చేయాలన్నారు.

మిర్చికి పెట్టుబడి ఎక్కువ అవుతుందని, మిర్చి క్వింటాల్‌కు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరికి రూ.500 బోనస్ అంటూ ప్రకటించారని, అది ఓ బోగస్‌గా మారిందని విమర్శించారు. రైతుభరోసా ఎంత వస్తుందో తెలియడం లేదని, రైతు భరోసాతో పాటు రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో ఏ గ్రామంలో ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క కుటుంబంలో నలుగురికి భూమి ఉంటే అందరికీ రైతుబంధు, రైతు బీమా అమలు చేశారన్నారు. మహబూ బాబాద్ జిల్లా వెనుకబడిన జిల్లా అని, జిల్లాగా మార్చడానికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని, కేసీఆర్ హయాంలోనే మహబూబాబాద్ జిల్లాకు మహర్దశ వచ్చిందని చెప్పారు. నాడు ఎస్డీఎఫ్ ఫండ్ కింద రూ.300 కోట్లు ఇచ్చామని, ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు.

వరద బాధితులకు నష్ట పరిహారం ఏదీ?

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారాంతండాలో వరదలు వచ్చి బాధితులు నష్టపోయి నెలలు గడుస్తున్నా నేటికి వారికి ఎందుకు పరిహారం అందలేదని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సీఎం ఆ గ్రామానికి విహారయాత్రకు వచ్చినట్లు వచ్చి వెళ్లిపోయారే తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన సొంత ఖర్చుతో ఓ లారీ సరుకులు తీసుకువచ్చి సీతారాంతండాలో పంపిణీ చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలకు ఫ్రీ బస్సు అని పెట్టారని, అయితే దివ్యాంగులు, పురుషులు కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల సంఖ్యను పెంచాలన్నారు.

ఫ్రీ బస్సు వల్ల ఆటో కార్మికులు ఆదాయం కోల్పో యారని, వారికి తక్షణమే రూ.12వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఆకే రు వరదతో ఇతర చెరువులు తెగి కొట్టుకుపోయాయని, అనేక పొలాల్లో ఇసుక మేటలు వేసి రైతులు నష్టపోయారని చెప్పారు. తెగిపోయిన చెక్ డ్యాంలకు ఇంత వరకు మరమ్మతులు చేయలేదన్నారు. ప్రస్తుతం యాసం గిలో సాగునీరు రాక రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని, పంట లు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ముఖ్యమంత్రి పక్కనే తిరుగుతున్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లావారేనని సాగునీరు అందించాలన్నారు. మిర్చి ధరలు పడిపోతున్నా ప్రభుత్వానికి సోయిలేకుండా పోయిందని, ఎకరా మిర్చికి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నా నామమాత్రపు ధరలు వస్తున్నా యని, క్వింటా మిర్చికి రూ.25వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో మిర్చి రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, కురవి మండలానికి చెందిన యువ రైతు బాలకిషన్ మృతి చెందితే తాము పరామర్శించామన్నారు. ముఖ్యమంత్రి రాజకీయాలను పక్కనపెట్టి మిర్చితో పాటు పసుపు రైతులను ఆదుకోవాలని కోరారు.

మేడిగడ్డ కుంగిందని చెబుతున్న ముఖ్యమంత్రి స్టేజ్-2కు నీళ్లు ఇవ్వలేకపోయారని, గతేడాది ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడంతో ఎండిపోయాయని చెప్పారు. ఈ వేసవిలో నీరు ఇవ్వకుంటే పంటలకు సాగునీరు లేక ఎండిపోయే పరిస్థితి వస్తుందని, దీంతో పాటు తాగునీటికి కూడా ఇబ్బంది అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్.రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, చంద్రావతి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, మార్కెట్ మాజీ చైర్మన్లు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి రంగారావు, మార్నేని వెంకన్న, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, నాయిని రంజిత్, మహబూబ్ పాషా, ఎండి.ఫరీద్, నీలం దుర్గేష్, యాకూబ్‌రెడ్డి, ముత్యం వెంకన్న, ఎడ్ల వేణు, బూర్ల ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ కాళ్లుపట్టుకొనైనా మిర్చి రైతులను ఆదుకోవాలి

- రైతుల సమస్యలు సీఎంకు విన్నవించే సమయం 'వేం'కు లేదా ?
- కేసముద్రం మార్కెట్ సందర్శనలో ఎమ్మెల్సీ కవిత

కేసముద్రం (ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో మద్దతు ధర లేక మిర్చి రైతులు నష్టపోతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి మోదీ కాళ్లు పట్టుకొనైనా మద్దతు ధర కల్పించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్లో మిర్చి యార్డును సోమవారం సాయంత్రం ఆమె సందర్శించారు. మిర్చి రైతులతో మాట్లాడి ఎంత అయిన పెట్టుబడి, గతేడాది పలికిన, ప్రస్తుతం పంటకు పలుకుతున్న ధర, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ఏడాది రూ.25వేల క్వింటా అమ్మిన మిర్చి ఈసారి రూ.11వేలకు పడిపోయిందని అన్నారు. మిర్చి రైతులు కష్టాలు, నష్టాల గురించి సీఎం కు చెప్పే సమయం స్థానిక నేత వేం నరేందర్ రెడ్డికి లేదా? ఆయన నిత్యం సీఎంతోనే తిరుగుతుంటారని మండిపడ్డారు. కేసీఆర్ అప్పుడు నీళ్లిచ్చినప్పుడే పంటలు బాగా పండి సంతోషంగా ఉన్నారని, ఇక్కడ వాగు ఎండిపోతున్నా నీళ్లిచ్చే తెలివిలేని ప్రభుత్వమని విమర్శించారు. కేసీఆర్ మీద కోపంతో ఆయన కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని చెప్పేందుకు నీళ్లు బంద్ చేశారని ఆరోపించారు. రైతుల తరఫున పోరాటం చేయడానికి కేసీఆర్ సైనికులుగా తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆమె వెంట ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, నీలం దుర్గేష్, మాజీ ఎంపీపీ వోలం చంద్రమోహన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కవిత సందర్శించే సమయంలో మిర్చి కాంటాలు జరుగుతుండటంతో కారంఘాటుకు కవితతోపాటు అక్కడున్నవారంతా ఇబ్బందులు పడ్డారు. కొందరు నేతలు, కార్యకర్తలు మిర్చి ఘాటు కారణంగా యార్డు బయటే ఉన్నారు.

జేబుదొంగల చేతివాటం..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన పర్యటనలో తొలుత అమినాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించుకున్నారు. కవితను చూసేందుకు ఆలయానికి భారీ ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. ఈ క్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పలువురు మాజీ సర్పంచులు, నాయకుల జేబుల్లోంచి నగదు అపహరించగా.. ఓ నాయకుని మొబైల్ ఫోన్‌ను దొంగిలించారు. ఈ విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.



కేసముద్రం మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ డబ్బులు

- విడుదల చేసిన ప్రధాని మోదీ
- 19వ దఫాలో తొలి విడతగా రూ.2 వేల చొప్పున జమ

హనుమకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకంలో భాగంగా 19వ విడత నగదు రూ.2వేల చొప్పున ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారు. సోమవారం బిహార్‌లోని భాగల్‌పూర్‌లో 9.80కోట్ల మంది రైతుల రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలో 55వేల మంది రైతులకు రూ. 11 కోట్లు, వరంగల్ జిల్లాలో 61,031 మంది రైతులకు రూ.12.2 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 42వేల మంది రైతులకు రూ. 8.4 కోట్లు జనగామ జిల్లాలో 53,400 మంది రైతులకు రూ.10.68 కోట్లు, ములుగు జిల్లాలో 29,795 మంది రైతులకు రూ.5.95 కోట్లు విడుదలయ్యాయి. కిందటేడు అక్టోబర్ 3న మహారాష్ట్రలోని వాషిమ్ వేదికగా ప్రధాని మోదీ 18వ విడత నగదును విడుదల చేశారు. అప్పుడు కూడా దాదాపు ఇంతే మొత్తం రైతుల ఖాతాల్లో జమ అయింది. అయితే ఈ సారి మరికొంత మందికి కూడా పీఎం కిసాన్ సమ్మాన్ యోజన వర్తించినట్టు సమాచారం. విరాసత్, తదితర కారణాల వల్ల పట్టాదారు పాస్ పుస్తకాలు పొందని వారికి ఇప్పటివరకు సమ్మాన్ నిధులు అందలేదు. ఈ సారి కొత్తగా పాస్ పుస్తకాలు పొందినవారికి కూడా కిసాన్ డబ్బులు ఇవ్వనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కొత్త పట్టాదారు పాస్ పస్తకాలు పొందిన రైతులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15వేల మంది వరకు ఉండవచ్చునని అంచనా. వారందరికీ 19వ విడత కిసాన్ సమాన్ నిధులు ఖాతాల్లో పడ్డట్టు తెలుస్తోంది. కిసాన్ సమ్మాన్ యోజన కింద యేటా మూడు విడతలుగా రూ.6వేల చొప్పున రైతులకు అందుతాయి. ఇందులో మొదటి విడతగా రూ.2వేలు సోమవారం జమకాగా, రెండో విడత జున్‌లో, మూడో విడత అక్టోబర్‌లో విడుదలవుతాయి. 2019లో పథకం ప్రారంభమైంది.



పది వేలు వేసేది ఎప్పుడు ?

పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద పెట్టుబడి సాయం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచుతున్నట్టు ప్రధాని మోదీ కొత్త సంవత్సరం కానుకగా ప్రకటించారు. ఈ మేరకు పెంచిన మొత్తంతో కలిసి డబ్బులు ఖాతాలో జమవుతాయి ఆశ పడిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. ఈ యేడు 19 విడత సాయం కింద రూ.6వేల చొప్పున మొదటి విడతగా రూ.2వేలనే వేశారు. పెట్టుబడి సాయం పెంచనున్నట్టు చేసిన ప్రకటన ఎప్పుడు అమలులోకి వస్తుందో అని ఎంతగానో ఆశపడుతున్నారు.

ఆన్‌లైన్‌లో ఇలా చూసుకోవచ్చు

ప్రదాన మంత్రి కిసాన్ యోజన కింద తమ ఖాతాల్లో డబ్బులు పడింది లేనిది రైతులు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. రైతులు తమ గ్రామం, జిల్లా, రాష్ట్రం ఆధారంగా పీఎం కిసాన్ యోజన లబ్ధిదారుల జాబితాను రూపొందించింది. దీనిని సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్ https://pmkisan.gov.in/ సందర్శించాల్సి ఉంటుంది. ఆ తర్వాత నో యువర్ స్టేటస్‌పై క్లిక్ చేయాలి. అక్కడ లబ్ధిదారుడి పేరు మీద నమోదు చేసిన రిజిస్ట్రేషన్ నెంబర్, క్యాప్చా ఎంటర్ చేయాలి. ఆ తర్వాత అప్లయ్ చేసుకున్న సమాచారం కనిపిస్తుంది. జాబితాలో లబ్ధిదారుడి పేరు ఉంటే ఈ పథకం కింద ఆర్థిక సహాయం ఖాతాల్లో పడ్డట్టే. పీఎం కిసాన్ నిధి పథకం కింద అర్హత పొందాలంటే రైతు భారతీయ పౌరుడై ఉండాలి. చిన్న, సన్నకారు రైతు అయి ఉండాలి. నెలకు రూ.10వేల పెన్షన్ పొందే ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తి కాకూడదు. ఆదాయపు పన్ను దాఖలు చేయకూడదు.

ఎమ్మెల్సీ ప్రచారానికి నేటితో తెర

(5వ పేజీ తరువాయి)

అవలంబిస్తున్నాయి. ఆ పార్టీ మద్దతు దారులు పోటీలో ఉన్నా అధికారికంగా మద్దతు ప్రకటించటం లేదు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అయిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి టీచర్ జేఏసీ మద్దతుతో ఎమ్మెల్సీ బరిలో ఉన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అభిమానులు పరోక్షంగా గాల్‌రెడ్డికి మద్దతుగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఇక బీఆర్ఎస్ నేత, మాజీ వరంగల్ కూడా చైర్మన్ సుందరాజ్‌యాదవ్ కూడా టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్నప్పటికి గులాబీ పార్టీ ప్రత్యక్షంగానూ.. పరోక్షంగానూ మద్దతు ఇవ్వటం లేదు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్న బీఆర్ఎస్ బీసీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని బీసీ సంఘాల నేతలు కోరుతున్నప్పటికి గులాబీ అధిష్టానం ఏలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఉపాధ్యాయ సంఘాలతో ఒక్క బీజేపీనే ప్రత్యక్షంగా ఎన్నికల్లో పాల్గొంటోంది.

నేటితో ప్రచారం సమాప్తం..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4గంటలకు మూగబోనుంది. ఈ నెల 10వ తేదీ వరకు నావినేషన్లు, 13వ తేదీ వరకు ఉపసంహరణ ఘట్టం పూర్తి కావటంతో 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. 48గంటల ముందే ప్రచారాన్ని బంద్ చేయాల్సి ఉండటంతో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. ఈ సైలెన్స్ పీరియడ్‌లో సభలు, సమావేశాలు నిర్వహించటం నిషేదం. బల్క్ ఎస్ఎంఎస్‌లు, ఊరేగింపులు నిర్వహించకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టం చేసింది. ఎన్నికలు ముగిసే వరకు అన్ని జిల్లాల్లో 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 27వ తేదీన ప్రభుత్వం సెలవు కూడా ప్రకటించింది. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,355మంది ఓటర్లు ఉండగా, 76 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వీరిలో పురుషులు 6,886, మహిళలు 4,469మంది ఓటర్లు ఉన్నారు. అయితే అధ్యధికంగా 5,215ఓట్లు హనుమకొండ జిల్లా, 2,352 ఓట్లు వరంగల్ జిల్లాలో ఉన్నాయి. అలాగే జనగామలో 1002 ఓట్లు, మహబూబాబాద్ జిల్లాలో 1,663మంది ఓటర్లు, ములుగు జిల్లాలో 628మంది, భూపాలపల్లి జిల్లాలో 329మంది, సిద్ధిపేట జిల్లాలో 166మంది ఓటర్లు ఉన్నారు. అయితే అత్యధిక ఓట్లు హనమకొండ, వరంగల్ నగరంలోనే ఉండటంతో అభ్యర్థుల ప్రచారం మొత్తం వరంగల్ కేంద్రంగా జరిగింది. పూర్వ కరీంనగర్ జిల్లా పరిధిలో ఉన్న భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మల్హర్ మండలాల్లో ఉపాధ్యాయ ఓట్లు 83, పట్టభద్రుల ఓట్లు 2,483 ఉన్నాయి. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలోని కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో ఉపాధ్యాయ ఓట్లు 166. పట్టభద్రుల ఓటర్లు 4,585 మంది ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 27వ తేదీన పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తుంది.

మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించారు. బుధవారం మహాశివరాత్రి పండగ, గురువారం శివరాత్రి మరుసటి రోజు, శుక్రవారం అమావాస్య, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు కావడంతో తిరిగి సోమవారం నుంచి మార్కెట్లో యధావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని మార్కెట్ కార్యదర్శి జీ రెడ్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కిషన్‌రెడ్డి సిగ్గుమాలిన మంత్రి!

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నిధుల మంజూరు విషయంలో కిషన్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతూ సిగ్గుమాలిన మంత్రిగా వ్యవహరిస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. సోమవారం జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం జీడికల్‌లో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ తెలంగాణలో అధికారం కోసం పగటి కలలు కంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఫైనాన్స్ కమిషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా చట్టబద్ధంగా రావాల్సిన నిధులు రూ. లక్ష కోట్లను తాము ప్రత్యేకంగా సాయం చేసినట్లు కిషన్‌రెడ్డి సిగ్గులేకుండా అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలనుతప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలోని కేంద్ర మంత్రులకు దమ్ముంటే తమ పలుకుబడిని ఉపయోగించి అదనంగా రూ.వెయ్యి కోట్ల ప్రాజెక్ట్ తీసుకురావాలని సవాల్ విసిరారు. సమగ్ర కులగణన విషయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌లు తమ ఒట్టిమాటలను కట్టిపెట్టాలన్నారు. మార్చిలో జరిగే శాసన సభ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌పై తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు.

బీజేపీ నేతలకు బీసీ రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి ఉంటే చట్టబద్ధతను కల్పించాలన్నారు. మొదటి నుంచి బీజేపీ తెలంగాణకు పూర్తిగా వ్యతిరేకమన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశారన్నారు. సమావేశంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

టీచర్లకు ఓట్ల పండుగ

- ఎమ్మెల్సీ ఎన్నికల తరుణంలో మందు, విందులు
- ఓటుకు రూ.5 వేలు ఇస్తున్నారనే ప్రచారం

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల తరుణంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులంతా పండుగ వాతావరణంలో సేద తీరుతున్నారు. పార్టీలు, విందులు, దావత్ విత్ దార్‌లతో ఎంజాయ్ చేస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తతంగాలు సాధారణ ఎన్నికలను తలదన్నేలా సాగుతున్నాయి. ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘాల వారిగా, సామాజిక వర్గాల వారిగా సుక్క, ముక్కతో అలరారుతున్నారు. అయితే కొంత మంది ఉపాధ్యాయులు గ్రూపులుగా చేరి నేరుగా అభ్యర్థుల అంతరంగీలకులను సంప్రదిస్తూ ఓటుకు ఎంత ఇస్తారో అడుగుతున్నట్లు తెలుస్తోంది. టీచర్ ఎమ్మెల్సీ ఓటుకు రూ.5వేలు ఇస్తున్నట్లు ప్రచారం సైతం జోరుగానే సాగుతోంది. అయితే సమాజానికి మార్గదర్శనంగా ఉండాల్సిన పంతుళ్లు.. ఈ విధంగా వ్యవహరిస్తుండటం పట్ల అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.



సుక్క.. ముక్క..



టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జిల్లా కేంద్రాల్లో ఆదివారం పంతుళ్లకు సెలవు దినం కావడంతో పార్టీలు బాగానే జరిగినట్లు సమాచారం. నలుగురు ప్రధాన అభ్యర్థులు పార్టీలు నిర్వహించినట్లు తెలిసింది. ఎన్నికల ప్రచార కార్యక్రమాల పేరుతో సుక్క, ముక్క పార్టీలు నిర్వహిస్తున్నారు. వరంగల్, హనుమకొండ తదితర ప్రాంతాల్లోని ఫంక్షన్‌హాళ్లను వేదికలుగా చేసుకొని సుక్క, ముక్క తెగలాగించేసినట్లు ఉపాధ్యాయ వర్గాలే చర్చించుకుంటున్నారు. ఓటింగ్‌కు మరో నాలుగు రోజులు మాత్రమే ఉండటం, ఉపాధ్యాయులకు సెలవు రోజు కావడంతో అభ్యర్థులు వారి అనుయాయులను పురమాయించి పంతుళ్లకు పార్టీలు ఇచ్చినట్లు సమాచారం. సంఘాల వారిగా, గ్రూపుల వారిగా, సామాజికవర్గాల వారిగా ఉపాధ్యాయులకు అదిరిపోయేలా పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీలకు వెళ్లివచ్చిన పంతుళ్లే చర్చించుకోవడం విశేషం. సాయంత్రందాకా ప్రచారంలో మునిగితేలుతున్న అభ్యర్థుల అనుయాయులు సాయంత్రం పూట ఖరీదైన హోటళ్లు, శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌజ్‌లు, రిసార్టుల్లో సేదతీరుతున్నట్లు కొంత మంది ఉపాధ్యాయులే చెబుతున్నారు.

ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు..



ఎన్నికల్లో గెలిచి శాసనమండలిలో కాలు పెట్టాలనే ఆశతో అభ్యర్థులు ఓటర్లకు నోట్ల ఎర వేస్తున్నట్లు ప్రచారం జోరందు కుంది. ఓటర్లు పరిమిత సంఖ్యలో ఉండటంతో, అభ్యర్థుల అనుయాయులు ఓటర్లను నేరుగా కలిసి బేరాలు కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. పంతుళ్లలో ప్రభావంతమైన వ్యక్తులను గుర్తించి వారిని మచ్చిక చేసుకొని వారి ద్వారా డబ్బులు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఓ ప్రధాన పోటీదారు తమ సంఘ నాయకులకు డబ్బుల చేరవేసినట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. పరిస్థితిని బట్టి ఓటుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ఇచ్చేందుకు ప్రణాళిలు రూపొందించుకుంటున్నట్లు ఓ ఉపాధ్యాయ సంఘం నేత చెప్పారు. మొదటిసారిగా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఓటు హక్కు కల్పించడంతో అభ్యర్థులు నేరుగా ఆయా యాజమాన్యాలను సంప్రదిస్తూ వారికి తాయిళాలు అందజేస్తూ గంపగుత్తగా ఓట్లు వేయించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తుంది. మొత్తంగా ఈసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ మద్యం, మనీ ప్రముఖ పాత్ర పోషిస్తుందనే అభిప్రాయాలను ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



ఉదయం భూపాలపల్లిలో కురుస్తున్న మంచు

ఉదయం రండా.. మధ్యాహ్నం ఎండ

వాతావరణ పరిస్థితి విచిత్రంగా ఉంటోంది. పలు ప్రాంతాల్లో ఉదయం సమయంలో మంచు కమ్మేస్తూ చల్లగా ఉంటుండగా.. మధ్యాహ్నం మాత్రం ఎండ తీవ్రతకు మాడు పగులుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భిన్న వాతావరణ పరిస్థితులతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదయం మంచు కారణంగా రహదారులు సక్రమంగా కనిపించక వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణిస్తుంటే.. మధ్యాహ్నం ఎండ తీవ్రతకు ప్రజలు వస్త్రాలు కప్పుకొంటున్నారు. గొడుగులను ఆశ్రయిస్తున్నారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి



మధ్యాహ్నం సమయంలో జన సంచారం తక్కువగా ఉన్న రోడ్డు



పంచ లింగాల క్షేత్రం ఓరుగల్లు

- చారిత్రక శివాలయాలు నెలకొన్న నగరం
- కాకతీయుల పూజలందుకున్న మహాదేవుడు

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సృష్టి స్థితి లయకారకుడైన పరమేశ్వరుడి పలు విభూదులలో పంచలింగ క్షేత్రాలు స్వయంభూగా వెలిశాయి. అందులో తమిళనాడు రాష్ట్రంలో పంచభూత లింగాల క్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచరామ క్షేత్రాలు, తెలంగాణలోని ఓరుగల్లు నగరంలో పంచముఖ లింగ క్షేత్రాలు స్వయంభూగా వెలిశాయి. దీంతో ఓరుగల్లు నగరం ఆధ్యాత్మిక క్షేత్రంగా పరిఢవిల్లు తోంది. పంచ లింగాల్లో ఒకటి ఖిలా వరంగల్ శంభులింగేశ్వర దేవాలయంలో వెలసిన పృథ్వీ లింగం కాగా, రెండోది మట్టెవాడలోని భోగేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న జలలింగం. మూడోది భద్రకాళి దేవస్థానంలో ఉన్న భద్రేశ్వరుడు అగ్ని లింగం (తేజో లింగం). నాలుగోది హనుమకొండలోని సిద్ధేశ్వరాలయంలో ఉన్న వాయు లిం గం. ఇక ఐదోది కాజీపేట సమీపంలోని మెట్టుగుట్టపై వెలసిన ఆకాశ లింగం.



భద్రకాళి దేవాలయంలోని భద్రేశ్వరుడు

చారిత్రక శివాలయాలకు నిలయం

చారిత్రక శివాలయాలు వెలిసిన ఓరుగల్లు నగరంగా వరంగల్ చరిత్ర పుటల్లో నిలిచింది. శివ పూజలకు నిలయంగా నిలిచింది. బ్రాహ్మీ భూత సద్గురు కందుకూరి శివానందమూర్తి తన భక్తులతో శిష్య పరివారంతో ఈ ఐదు పంచలింగ క్షేత్రాలలో యజ్ఞ యాగ పూజాధికాలు నిర్వహించి తద్వారా వాటి మహాత్మ్యాన్ని భక్తులకు లభించే విధంగా తీర్చి దిద్దారు. కాశీ గంగ నుంచి కాశీబుగ్గకు నీటి బుడగ కంచి జగద్గురు పరమాచార్యులు కాశీబుగ్గలోని సహస్ర లింగాన్ని దర్శించి ఈ క్షేత్ర మహిమల గురించి వివరించారు. కాశీ నుంచి రామేశ్వరం మధ్య రేఖపై ఓరుగల్లు నగరం ఉందని.. కాశీ, రామేశ్వరం తర్వాత వరంగల్ నగరం కూడా గొప్ప క్షేత్రమని వెల్లడించారు. కాశీ నుంచి వరంగల్ నగరంలోని కాశిబుగ్గకు గంగా నది అంతర్వాహినిగా వచ్చి ఒక ప్రదేశంలో బుగ్గగా వెలసి బుడగలు బుడగలుగా గంగా జలం బయటకు వచ్చిందని, అందుకే ఆ ప్రాంతానికి కాశిబుగ్గ అనే పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. శైవ ఆరాధనకు పెట్టింది పేరు ఓరుగల్లు అని, కాకతీయ రాజులు నిత్యం మహాదేవుడికి పూజలు చేసేవారని పూర్వీకులు చెబుతారు.

తిరువన్నామలై అనుసంధానంగా మాఢ వీధులు

శేషు, భద్రకాళి దేవస్థానం అర్చకుడు

తమిళనాడులోని అరుణాచలం (తిరువన్నామలై)లో అగ్ని లింగంగా ఉన్న పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తారు. గిరిప్రదక్షణ చేసి స్వామి అనుగ్రహా న్ని పొందుతారు. అంతటి మహిమాన్వితమైన పంచముఖ లింగ క్షేత్రాల్లో ఒకటైన వరంగల్ భద్రకాళి క్షేత్రంలోని భద్రేశ్వరుడు అగ్ని లింగంగా భక్తులను అనుగ్రహిస్తాడు. అందుకే భద్రకాళి ఆల యం చుట్టూ మాఢ వీధులను ఏర్పాటు చేసి గిరిప్రదక్షణ జరిగే విధంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దీంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

రుద్రేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు



వేయి స్తంభాల ఆలయం (ఫైల్)




మీడియాతో మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్‌కుమార్

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల పర్వం మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 1వ తేదీ వరకు కొనసాగే వేయిస్తంభాల ఆలయ బ్రహ్మోత్సవ వివరాలను సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, ఈవో అనిల్‌కుమార్‌లు మీడియా సమావేశంలో వెల్లడించారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే వేడుకల్లో గణపతి పూజ, అంకురార్పణ, రక్షబంధనం లాంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించి గణపతి నవగ్రహ మహాచండీ హవానాన్ని ప్రముఖ అధ్మాతిక వేత్త వద్దిరాజ వెంకటేశ్వర్ల దంపతుల సౌజన్యంతో నిర్వహిస్తామని ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా బుధవారం మహాశివరాత్రి పర్వదన వేళ తెల్లవారు జామున 4గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహింపచేస్తామని చెప్పారు. అదేరోజు శివరాత్రి వేళ ఉదయం 11 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు నగరంలోని ప్రముఖ కూచిపూడి, భారతనాట్య కళాకారులతో ప్రత్యేక నృత్యాలు, అభినయ రుద్రనాట్యాలయం ఖమ్మం వారిచే నాట్యాచార్యుల ప్రణీల్ కణతాల ఆధ్వర్యంలో శిష్యబృందంతో భారతనాట్య ప్రదర్శనలు, బోడిగే లక్ష్మీనారాయణ బాగవత్‌చే శివపార్వతుల కల్యాణం, హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశామని చెప్పారు. శివరాత్రి వేళ సాయంత్రం 6.30 గంటలకు రుద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం, అర్ధరాత్రి 12 గంవటలకు లింగోద్భవ సమయంతో 11మంది వేద పండితులతో 50 లీటర్ల అవుపాలు, ఇతర సుగంధ ద్రవ్యాలతో రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తామని చెప్పారు.

ఈవో అనిల్ కుమార్ మాట్లాడుతూ.. మహాశివరాత్రికి భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీఐపీలు, పాత్రికేయుల కోసం క్యూలైన్, అభిషేకాలు చేయించుకునే భక్తులకు మరొకటి, సర్వదర్శనం భక్తులకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు స్వామి వారి కల్యాణంలో నిర్ణీత రుసుము చెల్లించి పాల్గొనవచ్చునని తెలిపారు ప్రత్యేక పోలీసు బందోబస్తు, జిల్లా యంత్రాంగం, మున్సిపల్ శాఖ సహకారం మంచినీటి సౌకర్యం, చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారంతో పండ్ల పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, రుద్రేశ్వర సేవా సమతి నిర్వాహకులు రావులు సుదర్శన్, చొల్లేటి కృష్ణమాచార్య, సీనియర్ అసిస్టెంట్ మధుకర్‌లు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో జాతరకు సర్వం సిద్ధం

నేటి నుంచి శివరాత్రి మహోత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో కాళేశ్వరాలయం

మహదేవపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో వేంచేసిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దు, మూడు నదుల కలయిక, త్రిలింగాల్లో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వరుడికి పూజలు చేసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఈ క్షేత్రంలో 25, 26, 27 మూడు రోజుల పాటు కనుల పండువగా శివరాత్రివేడుకలు జరుగనుండగా మన రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, భక్తులు వేల సంఖ్యలో తరలొచ్చి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇక సరస్వతి అమ్మవారి దేవాలయాలు దేశంలోనే మూడు ఉండగా అందులో కాళేశ్వరం ఒకటి. ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో మహేష్ తెలిపారు. భక్తులకు క్యూలైన్లలో తాగునీరు, మజ్జిగ, పండ్లు, అందిస్తున్నామని, వైద్య శిబిరాలు, మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఈసారి మహాశివరాత్రి రోజున గోదావరి మాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇక కాళేశ్వరంలో జరిగే మహా శివరాత్రి జాతరకు ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు 250 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. వీఐపీ ఘాట్, గోదావరి ఘాట్, బస్టాండ్ తదితర ఏరియాల్లో ఈ బృందాలు విధులు నిర్వర్తిస్తాయని తెలిపారు.

అందుబాటులోకి ఆర్టీసీ సేవలు

కాళేశ్వరంలో జరిగే శివరాత్రి జాతరకు మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్టు భూపాలపల్లి డీఎం తెలిపారు. భూపాలపల్లి, వరంగల్, పరకాల, జనగామ, మంథని, మంచిర్యాల, కరీంగనగర్, ఆసిఫాబాద్, హుజురాబాద్‌తో పాటు పలు డిపోల నుంచి భక్తుల కోసం స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామన్నారు.

ముస్తాబైన కోటగుళ్లు, రెడ్డిగుడి



గణపేశ్వరాలయం



రెడ్డి గుడి

గణపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ కట్టడాలైన శ్రీ భవానీ సమేత గణపేశ్వరాలయం(కోటగుళ్లు), రెడ్డిగుడిలు శివరాత్రి శివ పార్వతుల కల్యాణ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పరిరక్షణ కమిటీల ఆధ్వర్యంలో ఈ కల్యాణం జరుగుతుంది. ఈ నెల 26న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అంతేకాకుండా కోటగుళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ముక్కంటి ఉత్సవాలకు రామప్ప ముస్తాబు

26 నుంచి 28 వరకు శివరాత్రి వేడుకలు



వెంకటాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'ముక్కంటి' ఉత్సవాలకు.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామ శివారులో గల యునెస్కో గుర్తింపు పొందిన సుప్రసిద్ధ కళాక్షేత్రం రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం ముస్తాబవుతోంది. 26, 27, 28 తేదీల్లో జరిగే వేడుకలకు పలురంగాల ప్రముఖులతో పాటు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో చలువ పందిళ్లు, తాగునీటి వసతి, క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే విద్యుత్, ఆర్టీసీ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎండోమెంట్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

నయనానందకరంగా నవరాత్రోత్సవాలు


ముస్తాబైన మెట్టురామలింగేశ్వరస్వామి క్షేత్రం



మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయం

మడికొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న స్వయంభూ శ్రీమెట్టురామలింగేశ్వరస్వామి క్షేత్రం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. తొమ్మిది రోజుల పాటు కనులపండువగా జరుగనున్న వేడుకలకు ఆలయ గోపురాన్ని, దొంతులమ్మ గుండ్లను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. దొంతులమ్మ గుండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలకు మడికొండ, నగరంలోని వివిధ డివిజన్లతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చి శివపార్వతుల కల్యాణ మహోత్సవ ఘట్టాన్ని కనులారా వీక్షిస్తారని, జాగరణ చేసే భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

కురవి శివరాత్రి ఉత్సవాలకు నేడు అంకురార్పణ



విద్యుద్దీపాల వెలుగులో కురవి వీరభద్రస్వామి ఆలయం

కురవి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వనదేవతలైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర తర్వాతి స్థానంలో పేరు గడించిన గిరిజనుల ఆరాధ్యదైవమైన కురవి వీరన్న జాతరకు మంగళవారం రాత్రి 7గంటలకు అంకురార్పణ జరగనుంది. శివరాత్రి రోజైన 26నుంచి నెల రోజులపాటు కొనసాగే వీరభద్రస్వామి జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి దాదాపు 5 లక్షల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా కురవి ఆలయం జాతర శోభను సంతరించుకోగా.. అధికారులు భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీరభద్రుని కల్యాణం జరిగే నాగేంద్రస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఆర్డీవో కృష్ణవేణి, తహ సీల్దార్ సునీల్‌రెడ్డి, ఆలయ ఈవో సత్యనారాయణ, ఇతర అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహబుబాబాద్ రూరల్ సీఐ సరవయ్య, కురవి ఎస్ఐ గండ్రాతి సతీష్ సోమవారం క్యూలైన్ల ఏర్పాటు సహా జాతర బందోబస్తు ప్రక్రియను సమీక్షించారు. 25వ తేదీ మంగళవారం రాత్రి 7గంటలకు అంకురార్పణతో కురవి జాతర ప్రారంభంకానుండగా 26వ తేదీ బుధవారం తెల్లవారుజామున 1:00గంటకు జరిగే స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి సుమారు 2లక్షల మంది తరలిరానున్నారు. శివరాత్రి రోజు సాయంత్రం 7గంటలకు గ్రామసేవ, ఎదురుకోలు, రాత్రి 12.30కు భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కల్యాణం జరగనుంది. వరంగల్, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు మహబూబాబాద్ వరకు రైళ్లు, బస్సుల్లో వచ్చి అక్కడి నుంచి 9కిలోమీటర్ల దూరంలో ఉన్న కురవికి చేరుకుంటారు. వారికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్‌వాహనాలు అందుబాటులో ఉంటాయి.

మల్లన్న సన్నిధిలో కల్యాణశోభ

ప్రభుత్వం నుంచి కల్యాణానికి పట్టువస్త్రాలు అందజేత

ఐనవోలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం కల్యాణశోభను సంతరించుకుంది. బుధవారం ఉదయం 4 గంటలకు స్వామివారి మేలుకొలుపు సుప్రభాతసేవ ప్రథమయామ(ప్రాత:కాల) పూజతో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం కానుండగా సింహవాహనసేవ, గవ్యాంతపూజలు, అష్టోత్తర శతకలశార్చన, మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, రుద్రహోమాలు, బలిహరణం, 12 గంటలకు ఆలయం తూర్పు వైపున ఉన్న కాకతీయుల నృత్యమండపంలో ఒగ్గు పూజారులుతో పెద్దపట్నంవేయడం, శివతాండవ నృత్యాలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండుగగా నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తిగీతాల ఆలాపన కార్యక్రమం జరగనుంది. ఆర్కెస్ట్రా బృందంచే రేలారేలారే, జానపద గేయాల కళాబృందంచేత ప్రదర్శనలు నిర్వహించనున్నారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతోపాటు టాకింగ్ డాల్స్ మిమిక్రీ నిర్వహించనున్నారు. కల్యాణానికి ప్రభుత్వం తరఫున ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు పట్టువస్త్రాలను సమర్పిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపున్నారు.



విద్యుత్ కాంతుల నడుమ ఐనవోలు దేవస్థానం, మల్లికార్జునస్వామి

పెద్దపట్నంపై భక్తుల శివతాండవం ప్రత్యేకం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నాన్ని ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. వివిధ రకాల చూర్ణాలతో ముగ్గులు వేసి కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో 12 అడుగుల వెడల్పు పొడువుతో అందంగా పట్నం వేస్తారు. మధ్యలో స్వామి అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాథను పఠిస్తారు. తదుపరి భక్తి పరవశంతో పట్నంపై మైమరిచి శివతాండవం చేస్తారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలుస్తుంది. ఆ సమయంలో తొక్కిసలాట జరుగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహిస్తారు.

నేటి నుంచి సోమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

ఐదు రోజుల వేడుకకు ముస్తాబైన పాలకుర్తి




సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రం

పాలకుర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాలో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి నుంచి ఐదు రోజుల పాలు వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసింది. 25న అంకురార్పన, ధ్వజారోహణ, 26న స్వామి వారల కళ్యాణ మహోత్సవం, 27న రథోత్సవం, బండ్ల తిరుగుట, 28 న డోలారోహణం, వసంతోత్సవం, పుష్పయాగం, మార్చి 1న అగ్ని గుండాలతో ఉత్సవాలు ముగుస్తాయి. సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామని దేవస్థానం ఈవో మోహన్‌బాబు తెలిపారు. గుట్ట సమీపంలో భక్తులకు నిరంతర తాగు నీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాల ఏర్పాట్లు, గుట్ట పైన భక్తులు దర్శనానికి వచ్చే వారికి క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఇక వరంగల్, జనగామ, తొర్రూరు, సూర్యాపేట డిపోల నుంచి పాలకుర్తికి జాతర స్పెషల్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.



గుట్టపైకి వెళ్లే మెట్ల మార్గం, ఇన్‌సెట్‌లో గర్భగుడిలోని శివలింగం



స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు డిమాండ్‌చేశారు. ఈమేరకు సోమవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు వ్యాపార దృక్పథంతోనే పాఠశాలలు నిర్వహిస్తున్నాయన్నారు. అలాంటి వాటిని విద్యా శాఖాధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. తోక పేర్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అలువ నరేష్, నాయకులు కావ్య, వినయ్, అజారుద్దీన్, గణేష్, ప్రదీప్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ప్రెస్‌క్లబ్ వ్యవహారాలపై విచారణ జరిపించాలి

▸▸ కలెక్టర్‌కు జర్నలిస్టుల ఐక్య పోరాట వేదిక నాయకుల వినతి

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్‌లో జరుగుతున్న వ్యవహారాలపై విచారణ జరిపించాలని జర్నలిస్టుల ఐక్య పోరాట వేదిక నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ప్రెస్‌క్లబ్ ప్రస్తుత కార్యవర్గం పదవీకాలం పూర్తయినప్పటికీ పదవుల్లో కొనసాగుతూ ప్రెస్‌క్లబ్ డబ్బులను ఇష్టం వచ్చిన విధంగా ఖర్చు చేస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ప్రెస్‌క్లబ్ వ్యవహారాలపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రెస్‌క్లబ్ కొత్త కార్యవర్గం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో జర్నలిస్టుల పోరాట ఐక్య వేదిక అడహక్ కమిటీ కన్వీనర్ నాంపల్లి నంబూద్రిపాద్, కమిటీ సభ్యులు నూటెంకి ప్రభాకర్, శంశోద్దీన్, మొగిలి శ్రీనవాసరావు, బూజుగుండ్ల శ్రీనివాస్, శ్రావణ్‌లు ఉన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు ప్రమాణాలు పాటించాలి

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు(చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా ఇన్‌స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుతున్న బాలబాలికలకు వసతి, భోజనం, విద్య, వైద్యంతోపాటు సరైన వసతులు కల్పించాలన్నారు. ఈనెల 27 నుంచి మార్చి 5వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్, ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బాలల సంరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల వినతులపై పరిష్కారం చూపండి

▸▸ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

▸▸ ప్రజావాణికి 65 దరఖాస్తులు రాక

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజలు అందించే పిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపించాలని, అప్పుడే అధికారులపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలపై చొరవ చూపాలని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 65 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి వై.రామకృష్ణ, వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	13
హెల్త్, శానిటేషన్	08
ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ	10
టౌన్ ప్లానింగ్	33
తాగునీటి సరఫరా	01
మొత్తం	65

ప్రజల ఫిర్యాదులు ఇలా..

- భద్రకాళి బండ్ చుట్టుపక్కల ఉదయం నుంచి సాయంత్రం వరకు టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తుండడం వల్ల రోడ్డుపైన ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారికి ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజలు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. బల్దియా అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని వెల్లడించారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

- వరంగల్ లక్ష్మిగణపతి కాలనీలో ఓ వ్యక్తి ఇటీవల బేకరీ నిర్వహిస్తుండగా అక్కడికి వచ్చిన వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. కాలనీ వాసులకు అతడిని పిలిచి మందలిస్తే ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అని దబాయిస్తున్నాడు. బల్దియా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 57వ డివిజన్ గోకుల్‌నగర్‌లో 50 ఏళ్లుగా నివసిస్తున్నాం. ఇటీవల ఓ వ్యక్తి కాలనీలో రోడ్డును ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేస్తున్నాడు. అతడి ఇంటి నుంచి వచ్చే మురుగు నీరు తమ ఇండ్ల ముందుకు చేరి ఎక్కడికక్కడే నిలిచి పోతున్నాయి. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కాలనీవాసులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.
- వరంగల్ శివనగర్‌లో 5 ఏళ్లగా ఉంటున్నాం. ఇప్పటి వరకు మాకు ఇంటి పన్ను రావడం లేదని ఇంటి యజమాని రజిత కమిషనర్‌కు విన్నవించారు. గతంలో చాలా సార్లు అధికారులకు తెలిపినా, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపింది.

బార్ అసోసియేషన్‌లో కంప్యూటర్ సెంటర్

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల సౌకర్యార్థం వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించారు. సోమవారం వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ 2వ అంతస్తు హాల్‌లో సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్.రమేష్‌బాబు, వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, మాతంగి రమేష్‌బాబు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి లాడె రమేష్, ఇతర కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రెండు రోజులు మద్యం షాపులు బంద్

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 25వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని మద్యం షాపులు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు బంద్ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యజమానులు సహకరించాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు.

వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికలు

▸▸ అధ్యక్షుడిగా గోనెల రవీందర్ ఎన్నిక

హనుమకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. వరంగల్ హంటర్‌రోడ్డులోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సోమవారం జరిగిన ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా గోనెల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బూరెల సత్యనారాయణ, కోశాధికారిగా ఇరుకు కోటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పోస్టుకు ఎన్నికలు ఏకగ్రీవం కాగా, అధ్యక్ష, కోశాధికారి పోస్టులకు పోటీ తీవ్రంగా జరిగింది. ఈ రెండు పోస్టులకు ముగ్గురేసి అభ్యర్థులు పోటీ పడ్డారు. మొత్తం 149 ఓట్లకుగాను రవీందర్‌కు 85 ఓట్లురాగా ఆయన ప్రత్యర్థులుగా పోటీ చేసిన దేవునూరి అంజయ్యకు 32, దుబ్బ రమేష్‌కు 32 ఓట్లు వచ్చాయి. రవీందర్ విజయం సాధించారు. అలాగే మొత్తం 149 ఓట్లలో కోశాధికారిగా పోటీ చేసిన ఇరుకు కోటేశ్వర్ రావుకు 69 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థులు తక్కళ్లపల్లి యుగంధర్‌కు 60 ఓట్లు, వెంటయ్యకు 20 ఓట్లు పడ్డాయి. ఎన్నికల అధికారులుగా పూర్వ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్, గుజ్జ ప్రభాకర్ రావు వ్యవహరించారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా మోహన్‌రావు, వరుణ్ కుమార్, కల్ల సంపత్ కుమార్ పర్యవేక్షించారు. వరంగల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్‌ను ఈ ఎన్నికల్లో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కొత్త పాలక వర్గాన్ని హనుమకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీన్ గౌడ్, కార్యదర్శి కన్నయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెండ్యాల ప్రసాద్ శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. అభినందనలు తెలిపారు.


వరంగల్ రైస్‌మిల్లర్స్ అసోసియేన్‌కు కొత్తగా ఎన్నికైన పాలకవర్గం

సమగ్ర కుల గణనతోనే బీసీలకు న్యాయం

- తెలంగాణ వడ్డెర సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సమ్మయ్య

వడ్డెపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణనతోనే బీసీలకు సామాజిక న్యాయం లభిస్తుందని తెలంగాణ వడ్డెర సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, రాష్ట్ర రజక సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నూతనకంటి ఆనందం అన్నారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీ కుల గణన చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని, దాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీ కుల గణన చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించి దాన్ని అమలు చేయడంపై బీసీ సమాజం ఆయనకు రుణపడి ఉంటుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం అమలు చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. బీసీలకు ఏ, బీ, సీ, డీ, ఈ ల ప్రకారం రిజర్వేషన్ కల్పించి బీసీ సమాజానికి సముచిత న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న పల్లపు సమ్మయ్య, నూతనకంటి ఆనందం

సమావేశంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బొంత ఐలయ్య, జిల్లా కార్యదర్శి పల్లపు లక్ష్మీనారాయణ, బీసీ యూత్ నాయకులు తాటికొండ ప్రశాంత్, యాట ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు బహుజన రాజ్యాధికారానికి తొలి మెట్టు

బాలసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన గెలుపు బహుజన రాజ్యాధికారానికి తొలి మెట్టు అవుతుందని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, బహుజన వాదంపై తీన్మార్ మల్లన్న, చిరంజీవులు, జాజుల శ్రీనివాస్‌గౌడ్, మంద కృష్ణ మాదిగ పోరాటంపై గొంతెత్తి చెబుతూ ప్రజలను చైతన్యపరుస్తున్నారని అన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు సంఘాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే ఎన్నికలని అన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగాన్ని పటిష్ట పరిచే విధంగా పూనుకుంటానని పూల రవీందర్ హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, స్టేట్ ఫైనాన్స్ సెక్రెటరీ సదయ్య, రిటైర్డ్ జూనియర్ లెక్చరర్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబురావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ -2 డిపో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోలనకొండ వేణు, కార్యదర్శి మాదారపు సాంబయ్య తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణు మాధవ్ ప్రాంగణంలో నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాషబోయిన కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా వైనాల బిక్షపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రావుల రమ, సందుల రాధిక, ఉపాధ్యక్షులుగా ఆర్.సారంగపాణి, గొల్ల స్వామి, డిపో గ్యారేజీ కార్యదర్శిగా ఆర్ఎస్.రావు, సంయుక్త కార్యదర్శిగా కుక్కనూతుల వేణుగోపాల్, గోలి వేణుగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా గుర్రపు వరలక్ష్మిలను ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణు, సాంబయ్యలు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కండక్టర్లు, డ్రైవర్లకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, 2017, 2025 పీఆర్సీలను 30 శాతం ఫిట్‌మెంట్ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాత్రి దుర్గయ్య, జిల్లా కమిటీ చీఫ్ అడ్వయిజర్ ఎంఎస్.రావు పాల్గొన్నారు.


బాషబోయిన కుమారస్వామి


వైనాల భిక్షపతి

డంపింగ్ యార్డ్ పొగ నియంత్రణకు చర్యలు

- మేయర్ గుండు సుధారాణి
- మండికొండ డంపింగ్ యార్డ్ సందర్శన

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మడికొండ డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. సోమవారం మడికొండ డంపింగ్ యార్డును క్షేత్రస్థాయిలో సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని సీఎం రేవంత్‌రెడ్డి హుజూరాబాద్ సమీపంలోని సిర్సపల్లిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 9 మున్సిపాలిటీల చెత్తను ఇక్కడకు తరలించి శుద్ధి చేస్తారని పేర్కొన్నారు. ఇంకా మడికొండ డంపింగ్ యార్డు చుట్టూ 10 ఫీట్ల ఎత్తులో ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. 4 బోర్‌వెల్స్ వేసి పొగ, మంట రాకుండా సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా చల్లార్చను న్నట్లు తెలిపారు. చెత్త తరలించే వాహనాల డ్రైవర్ల సౌకర్యార్థం మరుగుదొడ్లను నిర్మిస్తామన్నారు. రూ.4 కోట్ల వ్యయంలో బయోమైనింగ్ యంత్రాలను బలోపేతంచేసి చెత్త తరలింపు ప్రక్రియ వేగవంతం చేస్తామన్నారు. లక్ష్మీపురం, బాలసముద్రం, కాజీపేట మార్కెట్ ప్రాంతాల్లో ఆహార వ్యర్థాలు బయటకు వెళ్లకుండా మిథనైజేషన్ ప్లాంట్ ద్వారా అక్కడే గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నామని గుర్తు చేశారు. కాలనీల నుంచి సేకరించిన తడిచెత్తను విండ్రో కంపోస్టుగా, పొడి చెత్తను డీఆర్‌సీసీ కేంద్రాలకు తరలిస్తామని మేయర్ వివరించారు.


మడికొండ డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న గుండు సుధారాణి

టెక్నికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలోని టెక్నికల్ అసోసియేషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కేయూ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వర్సిటీలో ల్యాబ్ అసిస్టెంట్ టెక్నికల్-2, టెక్నికల్ ల్యాబ్ అటెండర్, స్టోర్ కీపర్ ఉద్యోగులకు టెక్నికల్ ఉద్యోగులకు ఆఫీస్ సబార్డినేటర్ స్కేల్ వర్తింపచేయాలని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి స్కేల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ వాలే నందయ్య, నలుబోలు రాము, ప్రేమ్‌సాగర్, జహేర్, రణధీర్, శోభన్ పాల్గొన్నారు.

పార్టుటైమ్ అధ్యాపకులకు అవకాశం కల్పించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఫుల్ వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందచేశారు.

బిర్యానీ పాయింట్ ఫర్నీచర్ స్వాధీనం

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాజీపేట కేఆర్ రెడ్డి ఓ బిర్యానీ పాయింట్‌పై సోమవారం బల్దియా అధికారులు దాడులు చేశారు. రెండేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్న యజమానులపై ఆగ్రహం చేస్తూ ఫర్నిచర్ స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో పలుమార్లు నోటీసులు పంపించినా పట్టించుకోలేదని బల్దియా డిప్యూటీ కమిషనర్ (అడ్మిన్) రాజేశ్వర్ తెలిపారు. చివరికి సోమవారం సెంటర్‌లో పర్నీచర్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో యూసుఫుద్దీన్, ఆర్ఐ దేవరాజు, వెలగందుల నవీన్‌కుమార్‌తో పాటు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మడికొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని ప్రసిద్ధ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి మేలుకొలుపు, సుప్రభాతం, ప్రాతఃకాల రుద్రాభిషేకం, గణపతి పూజ, గోపూజ, శైవశుద్ధి, పుణ్యాహవచనం, పంచగవ్యము, అఖండ దీపారాధన, రుత్విక్ వరుణము, దీక్షాధారణ, త్రిశూలపూజ, కలశస్థాపన ఇత్యాది పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. వరంగల్ వాస్తవ్యులు అనంతుల కేదారి నాలుగు లక్షల మోదుగ పూలతో స్వామి వారికి ప్రత్యేక పుష్పార్చన, అలంకరణ చేశారు. డీసీపీ సలీమా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి హోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాదవితరణ గావించారు. కార్యక్రమంలో ఈవో శేషుభారతి, ఛైర్మన్ పైడిపాల రఘుచందర్, రుత్వికులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


మోదుగ పూల అలంకరణలో స్వయంభు మెట్టురామలింగేశ్వరస్వామి

వేడుకలకు ముస్తాబైన భీమశంకర ఆలయం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమారం శ్యామల చెరువు కట్టపై ఉన్న భీమశంకర ఆలయంలో శివరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించిన అతి పురాతనమైన స్వయంభు దేవాలయం అని, శివలింగంతో పాటు వినాయకుడు, నందీశ్వరుడు ఉన్నాడని తెలిపారు. ఇక్కడి శివలింగానికి పాండవులు కూడా పూజ చేసిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. శివరాత్రి రోజున జరిగే వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు.


శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయం

బీసీలనే శాసన మండలికి పంపించాలి

▸▸ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్‌రాజ్ యాదవ్‌కు పట్టం కట్టాలి

▸▸ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రమేష్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికార సాధన కోసం బీసీలనే శాసన మండలికి పంపించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్, తెలంగాణ రాష్ట్ర జేఏసీ చైర్మన్ కోలా జనార్ధన్‌గౌడ్, బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ ప్రజా సంఘాల జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు విజ్ఞతతో ఆలోచించి బీసీ అభ్యర్థుల గెలుపు కోసం అకుంఠిత దీక్షతో కృషి చేయాలని కోరారు. అగ్రవర్ణాలే ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తూ బీసీ సామాజిక వర్గాన్ని అణచివేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా సంఘటితమైబీసీ అభ్యర్థులను శాసన మండలికి పంపించి అగ్రవర్ణాల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బహుజన రాజ్యాధికారం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈనెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హనుమకొండ పట్టణానికి చెందిన ఎమ్మెల్సీ స్వతంత్ర్య అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి పట్టం కట్టాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, బీసీ ప్రజాసంఘాల నాయకులు బుట్టి శ్యామ్‌యాదవ్, పూజారి సత్యనారాయణ, గంగాపురం వేణుమాధవ్, డాక్టర్ చందా మల్లయ్య, డాక్టర్ ప్రవీణ్ కుమార్, చింత రమేష్, అమరవాది సారంగపాణి, దొమ్మాటి ప్రవీణ్, జనగాం శ్రీనివాస్, ఆకుల విజయ, వివేకానంద, వద్నాల నరేందర్, రావుల బాలరాజు, కందికొండ వేణుగోపాల్, కత్తి రమేష్, రమేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కూరపాటి రమేష్, కోలా జనార్ధన్‌గౌడ్, ఏదునూరి రాజమొగిలి

దక్షిణాదిలో రాజనీతిశాస్త్ర అభివృద్ధికి పాటుపడాలి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో రాజనీతిశాస్త్ర అభివృద్ధికి అందరూ పాటుపడాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పిలుపునిచ్చారు. సోమవారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో ద్రవీడియన్ పొలిటికల్ సైన్స్ సంఘం ఆవిర్భావించింది. ఈ సందర్భంగా కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో రూపొందించించిన సంఘానికి సంబంధించిన పోస్టర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. రాజనీతి శాస్త్ర అభివృద్ధికి దక్షిణ భారత దేశంలో రాజనీతివేత్తలతో అసోసియేషన్ ఏర్పాటు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కొంత కాలంగా దీనిపై సుదీర్ఘ సమాలోచనలు జరిపాలని పేర్కొన్నారు. రాజనీతిశాస్త్ర దక్షిణాది అధ్యాపకులు ఎంతో ఉత్సాహంగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అయితే కాకతీయ యూనివర్సిటీలో ఇది పురుడు పోసుకోవడం గర్వకారణమని ప్రకటించారు. ద్రవీడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపల్లి నాగరాజు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.


రాజనీతిశాస్త్ర సంఘం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, తదితరులు

అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

ద్రవీడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ మొదటి కార్యవర్గం ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎన్నుకున్న కార్యవర్గంలో అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ నాగరాజు వాడపల్లి, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్.సోమలింగం, జాయింట్ సెక్రటరీగా నరేశ్‌కుమార్ గుడేటి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ సంకినేని వెంకట్‌చ కోశాధికారిగా కల్లెపల్లి ప్రశాంత్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కందకట్ల శ్రావణ్ కుమార్, గుండు సురేశ్, లీలావతి బొట్లలు ఎంపికైయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

మధుమేహం



చుక్కలు చూపిద్దాం!

ఏళ్ల తరబడి మధుమేహంతో బాధపడుతూ, చక్కెర హెచ్చుతగ్గులకు లోనయ్యే వాళ్లలో మందులు ప్రభావం చూపించని పరిస్థితి తలెత్తుతుంది. అలాగే మూత్రపిండాలు, గుండె దెబ్బతినే సమస్య కూడా వీరిలో ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితిలో పాత మాత్రలే వాడుకోవడం వల్ల ప్రయోజనం లేకపోగా, మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించే క్రమంలో గత ఐదు, పదేళ్ల నుంచి మధుమేహానికి కొత్త మందులు అందుబాటులోకొచ్చాయి. సురక్షితమైన, ప్రభావవంతమైన ఈ మందులతో మూత్రపిండాలు, గుండెకు కూడా అదనపు రక్షణ దక్కుతుంది. దీర్ఘకాలం నుంచి మధుమేహంతో బాధపడుతున్న వాళ్లు కూడా ఈ మందులను నిర్భయంగా వాడుకోవచ్చు. నిజానికి పాత మందులు విఫలయ్యేవరకూ ఆగకుండా, వీలైనంత త్వరగా కొత్త మందులు మొదలుపెట్టుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం.

కొత్త మందులతో గుండెకు, కిడ్నీలకు రక్ష

మధుమేహంలో మూడు రకాల మందులున్నాయి. మొదటి రకం... జీఎల్‌పి-1 అనలాగ్స్. ఇవి ఇంజెక్షన్స్, మాత్రలు... రెండు రకాలుగా అందుబాటులో ఉన్నాయి. ఈ మందులకున్న అతి పెద్ద ప్రయోజనం ఏంటంటే, అధిక బరువు కలిగి ఉన్న వాళ్లు ఈ మందులు తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారు. కానీ ఈ మందులు ఖరీదైనవి. ఇవే కాకుండా డిపిపి-4 ఇన్హిబిటర్స్ అనే రెండో రకం మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇవి కూడా మాత్రల రూపంలో దొరుకుతాయి. పాత మందుల స్థానంలో వీటిని వాడుకోవచ్చు. కొత్తగా మధుమేహం బారిన పడిన వాళ్లు కూడా వీటితోనే చికిత్స మొదలుపెట్టుకోవచ్చు. మూడో రకం మందులు... ఎస్‌జిఎల్‌టి2 ఇన్హిబిటర్స్. ఈ విభాగానికి చెందిన 'డాపాగ్లిఫ్లోజిన్' విస్తృతంగా వాడుకలో ఉంది. పాత మందులు బరువును పెంచే దుష్ప్రభావాన్ని కలిగి ఉంటాయి. కానీ ఈ కొత్త మందులతో ఆ భయం లేకపోగా, బరువు తగ్గే ప్రయోజనాన్ని కూడా పొందే అవకాశం కూడా ఉంది. ఈ మందులు, రక్తంలో ఉన్న చక్కెరను మూత్రపిండాల సహాయంతో మూత్రం ద్వారా బయటకు పంపించేస్తాయి. దాంతో మూత్రం ద్వారా చక్కెర బయటకు వెళ్లిపోతుంది. కాబట్టి ఈ మందులతో చక్కెర వ్యాధి ముప్పు తప్పినా, కొంతమందిలో మూత్రనాళ, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వేధించే అవకాశాలుంటాయి. కానీ ఈ సమస్యకు శారీరక శుభ్రతతో అడ్డుకట్ట వేయవచ్చు.

కొని తెచ్చుకుంటున్నామా?

40 ఏళ్లకు చక్కెర వ్యాధి నిర్థారణ అయితే, 'అయ్యో ఇంత చిన్న వయసులోనే వచ్చేసిందా?' అని కంగారు పడే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇప్పుడు 30 ఏళ్లకే మధుమేహం బారిన పడుతున్నాం. చిన్న వయసు నుంచి ఆహార నియమాలు పాటించకపోవడం, వ్యాయామం చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణాలు. మనం మన పిల్లలకు శుద్ధి చేసిన పదార్థాలు, ప్యాకెట్లలో దొరికే పదార్థాలు, పిజ్జాలు, బర్గర్లు, స్వీట్లు తినిపిస్తున్నాం. మన మేమో, ప్లేటు నిండా తెల్ల అన్నం పెట్టుకుని, ప్రొటీన్లు, పీచు తక్కువగా, పిండిపదార్థాలు ఎక్కువగా తినేస్తున్నాం. అలాగే నూనెలు, చక్కెరతో తయారయ్యే పదార్థాలు కూడా ఎక్కువగా తింటున్నాం. తీపి పెద్దగా తినం అనుకునేవాళ్లు, రోజుకు ఏడెనిమిది సార్లు టీలు, కాఫీలు తాగితే అంతే సమానమైన చక్కెర మన శరీరాల్లోకి చేరిపోతుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఉరుకుల పరుగుల జీవితాలకు అలవాటు పడిపోయి వ్యాయామాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నాం. వీటికి తోడు వృత్తిపరమైన ఒత్తిళ్లు. వెరసి 30 ఏళ్లకే మధుమేహం బారిన పడుతున్నాం. ఈ వ్యాధిలో లక్షణాలు బయల్పడవు కాబట్టి నిర్థారణ, చికిత్స... ఆలస్యమయ్యే ప్రమాదం కూడా ఉంటోంది. కాబట్టి 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి చక్కెర పరీక్ష చేయించుకోవాలి. దాన్లో మధుమేహం లేదని ఫలితం వస్తే, ఇక మధుమేహం రాదనుకోకూడదు. చక్కెర లేదని తెలిస్తే, మళ్లీ రెండు మూడేళ్ల వరకూ ఆ పరీక్ష జోలికి వెళ్లని వాళ్లు కూడా ఉంటారు. కానీ వీళ్లే, ఏదో ఒక సందర్భంలో చేయించుకునే పరీక్షల్లో అత్యధిక చక్కెర కనిపించగానే భయంతో, వైద్యుల దగ్గరకు పరుగులు పెడుతూ ఉంటారు. మొట్టమొదటిసారి చక్కెర వ్యాధి నిర్థారణ అయిన వాళ్లలో అత్యధిక మోతాదుల్లో చక్కెర ఉండడానికి ఇదే ప్రధాన కారణం. కాబట్టి మధుమేహం లేని వాళ్లు ప్రతి ఆరు నెలలకూ, మధుమేహులు ప్రతి నెలా చక్కెరను పరీక్షించుకుంటూ ఉండాలి. మధుమేహ మందులు వాడుకుంటున్న వాళ్లు, ప్రతి మూడు నెలలకోసారి, హెచ్‌బిఎ1సి పరీక్ష కూడా చేయించుకుంటూ, ఫలితం ఏడు లోపు ఉండేలా చూసుకోవాలి. ఇలా ఉంటే, గత మూడు నెలల నుంచి చక్కెర అదుపులోనే ఉందని అర్థం.

> మధుమేహులను దోచుకునే ధోరణి ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. ఒక పొడరు వాడుకుంటే, మధుమేహం ఉన్నప్పటికీ ఎలాంటి ఆహార నియమాలూ పాటించవలసిన అవసరం లేదని ప్రచారం చేసుకుంటున్న వాళ్లున్నారు. సామాజిక మాధ్యమాల్లో, యూట్యూబ్‌లో రకరకాల చిట్కాలు కూడా షికార్లు చేస్తుంటాయి. కానీ ఇవన్నీ వృథా ప్రయాసలే!



మధుమేహం 'రివర్స్' కాదు

చక్కెర వ్యాధికి మందులు వాడడం ఎంత ముఖ్యమో, ఆహార నియమాలు పాటించడం, వ్యాయామం చేయడం అంతే ముఖ్యం. క్రమం తప్పకుండా మందులు వాడుతూ, ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామంతో బరువు తగ్గించుకుంటే, చక్కెర మందులు ఆపేయవచ్చు కూడా! అయితే క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ, మునుపటి జీవనశైలినీ, ఆహార నియమాలనూ తూచ తప్పకుండా కొనసాగించాలి. ఇలా మధుమేహాన్ని తిరోగమించేలా చేయవచ్చు. కానీ తిరిగి రాకుండా చేయలేం! కానీ ఇటీవలి కాలంలో మధుమేహాన్ని రివర్స్ చేయొచ్చనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ఇది పూర్తి అబద్ధపు ప్రచారం.

నివారణ మన చేతుల్లోనే...

సాధారణంగా తెల్ల అన్నం తినేవాళ్లు కూరలు తక్కువగా అన్నం ఎక్కువగా తింటూ ఉంటారు. ఇది అనారోగ్యకరం. తెల్ల అన్నానికి బదులుగా దంపుడు బియ్యం/బ్రౌన్ రైస్ పరిమితంగా, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు ఎక్కువగా తీసుకోవాలి. దుంపలు మానేయడం మంచిది. అలాగే మధుమేహులు పండ్లు నిర్భయంగా తినొచ్చు. ప్రతి రోజూ కొద్దిగా బొప్పాయి, లేదా కమలా పండు, జామ పండు తినొచ్చు. అరటి పండ్లు, మామిడి, పైనాపిల్ చాలా తక్కువగా తినాలి. పండ్లలోని విటమిన్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి కాబట్టి, మధుమేహులు పండ్లు తినడం అవసరం. తీపి తినాలనిపించినప్పుడు పండు తినడం అన్ని విధాలా ఆరోగ్యకరం. ఈ నియమాలతో పాటు....

- బరువును అదుపులో పెట్టుకోవాలి
- ప్రతి రోజూ అరగంట పాటు నచ్చిన వ్యాయామం చేయాలి
- ఒత్తిడిని అదుపులో పెట్టుకోవాలి
- క్రమం తప్పకుండా చక్కెరను పరీక్షించుకుంటూ ఉండాలి
- సమతులాహారం తీసుకోవాలి
- తీపిని వీలైనంత తగ్గించాలి
- దురలవాట్లకు దూరంగా ఉండాలి

జీఎల్‌పి-1 అనలాగ్ మందులు ఇంజెక్షన్లు, మాత్రల రూపంలో ఉంటాయి. ఇంజెక్షన్ రూపంలో ఉన్న జీఎల్‌పి-1 అనలాగ్‌ను బరువు తగ్గడానికి ఉపయోగిస్తూ ఉంటారు. 'ఒజెంపిక్' పేరుతో విదేశాల్లో విస్తృతంగా వాడుకలోకొచ్చిన ఈ ఇంజెక్షన్లు ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో లేవు. మధుమేహాన్ని అదుపులో ఉంచడంతో పాటు మూత్రపిండాలు, గుండెకు రక్షణ కల్పించడం, బరువు తగ్గించే అదనపు ప్రయోజనాన్ని కలిగి ఉండడం వల్ల ఈ ఇంజెక్షన్లకు సర్వత్రా ఆదరణ పెరిగిపోయింది. మధుమేహం లేని వాళ్లు కూడా అధిక బరువును తగ్గించుకోవడం కోసం ఈ ఇంజెక్షన్లను తీసుకోవచ్చని యుఎస్ ఎఫ్‌డిఎ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) ఆమోదించడంతో వీటి వాడకం పెరిగింది. అయితే ఇవే ఇంజెక్షన్లు సెమాగ్లూటైడ్ అనే మాత్రల రూపంలో మనకు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఇన్సులిన్‌తో ప్రమాదం లేదు

సాధారణంగా ఇన్సులిన్ అనగానే మధుమేహులు ఉలిక్కిపడుతూ ఉంటారు. చక్కెర, మాత్రలతో అదుపు కాని పక్షంలో, చివరి ప్రయత్నంలో భాగంగా ఇన్సులిన్ తీసుకోవాలనే అపోహ మధుమేహుల్లో స్థిరపడిపోయింది. కానీ పదేళ్లు, పదిహేనేళ్ల పాటు మధుమేహంతో బాధపడుతున్న వాళ్లకు మందులు పని చేయని పరిస్థితి తలెత్తవచ్చు. అలాంటి సందర్భాల్లో ఇన్సులిన్ తీసుకోవడంలో తప్పు లేదు. దీంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. కాబట్టి వైద్యులు ఇన్సులిన్‌ను సూచించినప్పుడు వద్దని అనకూడదు. ఒకవేళ ఇన్సులిన్ ఇంజెక్షన్‌తో చక్కెర అదుపులోకి వస్తే, కొంతకాలం తర్వాత ఈ ఇంజెక్షన్ ఆపేయవచ్చు కూడా!

డాక్టర్ వసంత్ కుమార్
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్,
ప్రెసిడెంట్ అండ్ ఫౌండర్ ఆఫ్ డయాబెటిస్ అండ్ యూ సొసైటీ,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్.



పౌష్టికాహారం

గుడ్లు తింటున్నారా?

గుడ్లు ప్రకృతిసిద్ధ మల్టీవిటమిన్లు. భిన్నమైన పోషకాలన్నీ దొరికే అతి తక్కువ పదార్థాల్లో గుడ్డ ఒకటి. వీటిలోని పోషకాలతో ఎలాంటి మేళ్లను పొందవచ్చంటే....



- **విటమిన్ బి12:** నాడీ పనితీరు మెరుగుపడుతుంది
- **కోలీన్:** మెదడు సామర్థ్యం పెరుగుతుంది
- **విటమిన్ డి3:** ఆటోఇమ్యూన్ వ్యాధుల ముప్పు తగ్గుతుంది
- **విటమిన్‌కెఎ2:** ఎముకలు, గుండె ఆరోగ్యానికి రక్షణ దక్కుతుంది
- **విటమిన్ ఇ:** ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది
- **ల్యూటీన్:** కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది
- **అయోడిన్:** థైరాయిడ్ గ్రంథి పనితీరు మెరుగవుతుంది

అవగాహన

ప్రయాణాల్లో ఆహారం

ప్రయాణాల్లో బయటి భోజనాలు తినకూడదు అనుకుంటే, తినడానికి సులువుగా ఉండి, శక్తిని అందించే బలవర్ధకమైన పదార్థాలను వెంట తీసుకువెళ్లాలి. అలాంటి పదార్థాలు ఇవే!



- **షియా:** వీటిని వెంట తీసుకువెళ్లడం తేలిక. నీళ్లు కలిపి నేరుగా తినేయవచ్చు. ఓట్స్, పండ్ల రసాల్లో కలుపుకుని తాగేయవచ్చు. తక్కువ సమయంలో బలవర్ధకమైన ఆహారం తినాలనుకునేవారికి ఇదొక ఉత్తమమైన ప్రత్యామ్నాయం.
- **బాదం:** ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఇ, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే బాదం పప్పులు అద్భుతమైన అల్పాహారం. వీటిలో పీచు ఎక్కువ కాబట్టి ఆకలి కూడా అదుపులో ఉంటుంది. వీటిని పచ్చిగా కూడా తినొచ్చు కాబట్టి ఎక్కడికైనా వెంట తీసుకువెళ్లొచ్చు.
- **డార్క్ చాక్లెట్:** యాంటీఆక్సిడెంట్లు, మెగ్నీషియం కలిగి ఉండే డార్క్ చాక్లెట్ మనసును ఉల్లాసంగా ఉంచుతుంది. ప్రయాణాల్లో వీటిని వెంట తీసుకువెళ్లడం కూడా తేలికే!
- **డ్రైడ్ ఫ్రూట్స్:** బరువు తక్కువగా ఎండిన పండ్లు తక్షణ శక్తినిస్తాయి. వీటిలోని పోషకాలు ఆకలిని కూడా అదుపులో ఉంచుతాయి. కాబట్టి అంజీర్, ఎండుద్రాక్ష, అప్రికాట్స్, ఎండు ఖర్జూరం లాంటి ఎండిన పండ్లను వెంట ఉంచుకోవాలి.

తెలుసుకుందాం

మద్యంతో ముప్పులు

మద్యపానం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మద్యంతో ఆరోగ్యానికి పొంచి ఉండే ప్రధాన ముప్పులు ఏవంటే...

- **క్యాన్సర్ ముప్పు:** ఆల్కహాల్‌కు 'కార్సినోజెన్' అనే పేరుంది. అంటే మద్యంతో రొమ్ములు, కాలేయం, తల, మెడ, గొంతు, పెద్దపేగు.. ఇలా పలురకాల క్యాన్సర్ల ముప్పు పొంచి ఉంటుంది
- **కాలేయ జబ్బు:** తీవ్ర మద్యపాన వ్యసనంతో కాలేయానికి కొవ్వు పడుతుంది. మద్యం సంబంధిత కామెర్లు, కాలేయం గట్టిపడే ఫైబ్రోసిస్, సిర్రోసిస్, కాలేయ వైఫల్యం సమస్యలు పొంచి ఉంటాయి
- **గుండె జబ్బులు:** రక్తపోటు పెరుగుతుంది. గుండె లయ క్రమం తప్పుతుంది. గుండెపోటు ముప్పు పెరుగుతుంది
- **ఇన్‌ఫెక్షన్లు:** వ్యాధినిరోధకశక్తి బలహీనపడుతుంది. ఫలితంగా క్షయ లాంటి ఇన్‌ఫెక్షన్లు సులభంగా సోకుతాయి
- **నాడీ నష్టం:** దీర్ఘకాలం పాటు విపరీతంగా మద్యం తాగితే, జ్ఞాపకశక్తి తగ్గుతుంది. మద్యం సంబంధిత బ్రెయిన్ డ్యామేజీ జరుగుతుంది
- **స్వీయ హాని:** మద్యం నిర్ణయ సామర్థ్యాన్ని కుంటు పరుస్తుంది. ఆత్మహత్య, స్వీయ హాని ఆలోచనలను పెంచుతుంది. భావోద్వేగాలు అదుపుతప్పేలా చేస్తుంది
- **మానసిక కుంగుబాటు:** మద్యంతో మానసిక కుంగుబాటు, ఆందోళనలు పెరుగుతాయి



ఆహారం ఆరోగ్యం

అనాస పువ్వుతో...

బిరియానిలో వాడుకునే అనాస పువ్వుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అవేంటంటే....

- **ఇన్‌ఫెక్షన్లు:** అనాస పువ్వులోని షికిమిక్ ఆమ్లం, అనెథోల్, లినలూల్ సమ్మేళనాలు బ్యాక్టీరియాతో పోరాడడంతో పాటు పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. దాంతో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, న్యుమోనియా దరి చేరకుండా ఉంటాయి
- **ఫంగస్‌కు వ్యతిరేకంగా:** అనెథోల్, లినలూల్ అనే ఫ్లేవనాయిడ్లు ఫంగస్ పెరుగుదలను అడ్డుకుంటాయి.
- **వైరస్‌కు వ్యతిరేకంగా:** టామిఫ్లూ లాంటి యాంటీవైరల్ మందుల తయారీలో అనాస పువ్వులోని షికిమిక్ ఆమ్లాన్ని ఉపయోగిస్తారు
- **మధుమేహం:** అనాస పువ్వులోని అనెథోల్, పిండిపదార్థాలు శక్తిగా మారే ప్రక్రియకు దోహదపడుతూ, రక్తంలో చక్కెర మోతాదును సమంగా ఉంచుతుంది.



- **యాంటీఆక్సిడెంట్లు:** అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు కణ నష్టాన్ని నివారిస్తాయి. ఫలితంగా కణుతులు పెరిగే అవకాశాలు తగ్గుతాయిని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.
- **అజీర్తి:** కడుపు ఉబ్బరం, అజీర్తిని తగ్గించే స్వభావం అనాస పువ్వుకు ఉంటుంది.

ఇన్ని సుగుణాలు కలిగిన అనాస పువ్వును తరచూ వంటకాల్లో వాడుకోవడం వాడుకోవడం ఆరోగ్యకరం. సాస్ తయారీలో, సూప్ తయారీలో, మాంసాహార వంటకాల్లో విరివిగా వాడుకోవచ్చు.

సన్‌స్క్రీన్స్

ఎండ నుంచి చర్మానికి రక్ష



సన్‌స్క్రీన్‌ను ఎంచుకునేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దాని లేబుల్ పైన సూచించిన వివరాలను అర్థం చేసుకోవాలి. ప్రత్యేకించి ఆ లేబుల్ మీద ఎస్‌పిఎఫ్ (సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్), పిఎ ఫ్యాక్టర్ (అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ) ఎంత పేర్కొని ఉందో గమనించాలి. వాటితో పాటు...

ఎస్‌పిఎఫ్: కనిష్ఠంగా 30 ఎస్‌పిఎఫ్ నుంచి గరిష్ఠంగా 100 ఎస్‌పిఎఫ్ వరకూ సన్‌స్క్రీన్స్ మార్కెట్లో దొరుకుతూ ఉంటాయి. కొన్ని ఉత్పత్తుల మీద 10 నుంచి 15 ఎస్‌పిఎఫ్ ఉంటూ ఉంటుంది. కానీ ఇవి చర్మానికి ఎటువంటి రక్షణనూ కల్పించలేవు. అలాగే కొన్ని సన్‌స్క్రీన్స్ లేబుళ్ల మీద సన్‌స్క్రీన్‌తో పాటు విటమిన్ సి, మాయిశ్చరైజరు కూడా అదనంగా ఉన్నట్టు పేర్కొంటూ ఉంటారు. ఇలాంటివి కూడా నిరుపయోగమే! కాబట్టి కనిష్ఠంగా 30 ఎస్‌పిఎఫ్‌ను ఎంచుకోవాలి. ఎక్కువగా ఎండకు బహిర్గతమయ్యేవారు 60 అంతకంటే ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి. అలాగే చర్మపు అలర్జీలు ఉన్న వారు, ఎండకు చర్మం కమిలిపోయే సున్నిత చర్మం కలిగిన వారు కూడా ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్స్ ఎంచుకోవాలి. అలాగే చర్మ చికిత్సలు చేయించుకున్న వాళ్లు కూడా ఇలాంటి అత్యధిక ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్స్ మాత్రమే వాడుకోవాల్సి ఉంటుంది.

పిఎ ఫ్యాక్టర్: సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల ప్రభావంతో చర్మం దెబ్బతింటుంది. కాబట్టి ఆ కిరణాల నుంచి రక్షణ కల్పించే అంశం సన్‌స్క్రీన్‌లో ఉందో, లేదో గమనించాలి. ఈ అంశాన్ని సూచించే ప్లస్ గుర్తులు ఎన్ని ఎక్కువగా ఉంటే అతినీలలోహిత కిరణాల నుంచి అంత ఎక్కువ రక్షణ దక్కుతుంది.

నీలి రంగు రక్షణ: ఇళ్లలో లేదా కార్యాలయాల్లో కంప్యూటర్ల ముందు పని చేసేవారు నీలి రంగుకు బహిర్గతం అవుతూ ఉంటారు. దీని నుంచి రక్షణ కల్పించే బ్లూ లైట్ ప్రొటెక్షన్ కూడా సన్‌స్క్రీన్స్‌లో ఉండేలా చూసుకోవాలి.

పరారుణ రేడియేషన్: కొందరు వేడి వాతావరణంలో పని చేస్తూ ఉంటారు. మరీ ముఖ్యంగా గృహిణులు వంటగదిలో ఎక్కువ సమయం గడుపుతూ ఉంటారు. వీళ్లకు ముందు నుంచే పిగ్మెంటేషన్ సమస్య ఉన్నప్పుడు, వేడికి బహిర్గతమవడం వల్ల ఆ సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు, పరారుణ రేడియేషన్ (ఇన్‌ఫ్రారెడ్) కలిగి ఉన్న సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి.

వాటర్ రెసిస్టెంట్: ఈతకొలనుకు వెళ్లేటప్పుడు, సముద్రంలో మునిగేటప్పుడు వాటర్ రెసిస్టెంట్ సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి. ఈ అంశం కూడా లేబుల్ మీద గమనించాలి.

ఎలాంటి సన్‌స్క్రీన్?

చర్మ తత్వాన్ని బట్టి అందుకు నప్పే సన్‌స్క్రీన్స్ ఎంచుకోవాలి.

జెల్: జిడ్డు చర్మం కలిగిన వాళ్లు వాడుకోవాలి

క్రీమ్, ఆయింట్‌మెంట్, లోషన్: పొడి చర్మం కలిగిన వాళ్లు వాడుకోవాలి

పౌడర్: ముఖానికి పూసుకున్న సన్‌స్క్రీన్ జిడ్డుగా ఉందనిపించినప్పుడు, దాని పైన పౌడర్ సన్‌స్క్రీన్ అద్దుకోవచ్చు.

> ఓరల్ సన్‌స్క్రీన్
> పైపూత సన్‌స్క్రీన్స్ సరిపోని సందర్భాల్లో నోటి మాత్రల రూపంలో తీసుకునే సన్‌స్క్రీన్స్ కూడా ఇప్పుడు అందుబాటులో కొచ్చాయి.

టింటెడ్ సన్‌స్క్రీన్స్

ఇవి మేకప్ ఫౌండేషన్ ప్రభావాన్ని కనబరిచే తత్వాన్ని కలిగి ఉంటాయి. మేకప్‌లో మాదిరిగా టింటెడ్ సన్‌స్క్రీన్స్‌లో కూడా అందుకు తగ్గట్టు 'ఐవరీ, బ్రాంజ్' అనే రెండు రంగుల సన్‌స్క్రీన్స్ అందుబాటులోకొచ్చాయి. తెల్లని చర్మం కలిగిన వాళ్లు ఐవరీ, ముదురు రంగు ఉన్నవాళ్లు బ్రాంజ్ వాడుకోవచ్చు. ఈ టింటెడ్ సన్‌స్క్రీన్స్ వాడుకుంటే, అదనంగా ఇతరత్రా ఫౌండేషన్ల అవసరం తగ్గిపోవడంతో పాటు ఎండ నుంచి కూడా రక్షణ దక్కుతుంది.

> కొంతమంది సన్‌స్క్రీన్స్ వాడకంతో చర్మం నల్లబడిందనీ, మొటిమలు మొదలయ్యాయనీ అంటూ ఉంటారు. చర్మ తత్వానికి తగిన సన్‌స్క్రీన్‌ను ఎంచుకోలేకపోవడం వల్లే ఇలా జరుగుతూ ఉంటుంది. కాబట్టి సన్‌స్క్రీన్స్‌తో చర్మం దెబ్బతినకుండా ఉండాలంటే వైద్యులు సూచించే సన్‌స్క్రీన్స్‌నే వాడుకోవాలి.



ఎంత తరచుగా...

ఎండలోకి వెళ్లడానికి 30 నిమిషాల ముందే సన్‌స్క్రీన్ పూసుకోవాలి. అలాగే వేసవి ఎండ తీవ్రత సాయంత్రం నాలుగు గంటల వరకూ ఉంటుంది. కాబట్టి కనిష్ఠంగా ప్రతి రెండు గంటలకూ, గరిష్ఠంగా ప్రతి మూడు గంటలకూ, సన్‌స్క్రీన్ పూసుకుంటూనే ఉండాలి. 30 ఎస్‌పిఎఫ్ సన్‌స్క్రీన్ ఎండ నుంచి 95% మేరకు రక్షణ కల్పిస్తుంది. 50 నుంచి 60 ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్‌తో 98% రక్షణ దక్కుతుంది. అయితే సన్‌స్క్రీన్ ఎస్‌పిఎఫ్ ఎక్కువగా ఉన్నంత మాత్రాన తరచూ పూసుకోవలసిన అవసరం లేదనుకుంటే పొరపాటు. సన్‌స్క్రీన్ వాడుకుంటున్నప్పటికీ సన్‌ట్యాన్ నుంచి పూర్తి రక్షణ పొందడం కోసం స్కార్ఫ్, చలువ కళ్లజోడు, గొడుగు, టోపీలు వాడుకోవాలి. ఒకవేళ ఏదైనా ఒక రోజు ఎక్కువ సమయం పాటు ఎండకు బహిర్గతమైతే, డీట్యాన్ మాస్కులు వాడుకుని, ఎండకు నల్లబడిన చర్మాన్ని సరిచేసుకోవచ్చు.

ఎండకు చర్మం నల్లబడిందా? కాలిందా?

ఎండకు బహిర్గతమై, చర్మం నల్లబడినట్టు అనిపించగానే వెంటనే టమాటా రసం, బంగాళాదుంప రసాలు లాంటివి పూసుకోకూడదు. చర్మ పరిస్థితి సర్దుకునే వరకూ కనీసం వారం రోజుల పాటైనా ఆగి, ఆ తర్వాతే ఇలాంటి చిట్కాలు పాటించాలి. కొన్ని సందర్భాల్లో ఎండకు చర్మం కాలి, పొక్కులు తలెత్తి, తోలు ఊడినట్టు, అట్ట కట్టినట్టు తయారవుతుంది. ఇలాంటప్పుడు ఇంటి చిట్కాలు పాటించకుండా చర్మ వైద్యులను కలిసి, చికిత్స తీసుకోవాలి.

పిల్లలకు, గర్భిణులకు

మార్కెట్లో దొరికే సన్‌స్క్రీన్స్ రసాయనాలతో తయారవుతాయి. వీటితో పిల్లలూ, గర్భిణులూ దుష్ప్రభావాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి పిల్లలకూ, గర్భిణులకూ సురక్షితమైన మినరల్ సన్‌స్క్రీన్స్ అందుబాటులోకొచ్చాయి. జింక్ ఆక్సైడ్, టైటానియం ఆక్సైడ్ ఆధారిత సన్‌స్క్రీన్స్‌తో అన్ని విధాలా సురక్షితమైనవి.

డాక్టర్ స్వప్నప్రియ
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



బీఆర్ఎస్‌తో రేవంత్ కుమ్మక్కు

- అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు నిర్వీర్యం
- సీఎం అసమర్థతను బీజేపీపై రుద్దే యత్నం
- ఈ కేసును రేవంత్ వదిలినా.. మేం వదలం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తీ
- దెయ్యమని తిట్టి.. సోనియా కాళ్లు మొక్కిందెవరు
- రేవంత్‌లా నేను పార్టీలు మారలేదు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తో కుమ్మక్కై.. సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసును నిర్వీర్యం చేశారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్.. కేంద్రాన్ని బద్‌నాం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు తేడా ఏమీ లేదని.. కేసీఆర్ నుంచి పుణికిపుచ్చుకున్నట్లుగా రేవంత్ వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డిమాండ్ చేసిన రేవంత్.. సీఎం అయ్యాక బీఆర్ఎస్‌తో కుమ్మక్కై కేసును నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఈ కేసులో అరెస్టయినవాళ్లు బెయిల్ తీసుకుని దర్జాగా బయటకు వస్తుంటే.. రేవంత్ అసమర్థతను బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలని బీజేపీ హైకోర్టును ఆశ్రయించిందని గుర్తుచేశారు. ఈ కేసును రేవంత్ వదలిపెట్టినా తాము వదలిపెట్టబోమని తేల్చిచెప్పారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని.. దర్యాప్తు ఎలా ముందుకెళ్లదో తాము చూస్తామని ప్రకటించారు. మజ్లిస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీ, దేశ వ్యతిరేక శక్తులతో చీకటి ఒప్పందాలు చేసుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. "మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఒకదాంట్లోనే పోటీచేస్తున్న మీరు.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైందంటున్నారు.. మరి మిగతా రెండింటిలో ఎవరు ఎవరితో కుమ్మక్కైనట్టు..?" అని రేవంత్‌ను నిలదీశారు. రేవంత్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి భయం పట్టుకుందని.. ఆయన ఎవరిని విమర్శించారో, ఎందుకు విమర్శించారో అర్థం కాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆర్ఆర్ఆర్, టెక్స్‌టైల్ పార్క్ తెచ్చింది నేనే..

మూసీ ప్రక్షాళనకు కేంద్రం అనుమతి ఎందుకని సీఎంను ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని కానీ, పేదల ఇళ్లు కూల్చివేయవద్దన్నదే తమ విధానమని తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డును, రేవంత్ సీఎం కాకముందే తాను మంజూరు చేయించానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కానీ, ఆ ప్రాజెక్టును తానే అడ్డుకుంటున్నానని రేవంత్ ఆరోపణలు చేయడం దారుణమని మండిపడ్డారు. టెక్స్‌టైల్ పార్కు, రీజినల్ రింగ్‌రోడ్డును తెచ్చింది తానేనని కిషన్‌రెడ్డి చెప్పారు. ముస్లింలను బీసీల్లో చేర్చేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని.. అది బరాబర్ తప్పేనని అన్నారు. మతాన్ని తీసుకువచ్చి బీసీల్లో కలపడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రేవంత్‌లా తాను పార్టీలు మారలేదని.. కోర్టులు, జైళ్లు, పార్టీలు, నాయకుల చుట్టూ తిరగలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. నమ్మిన సిద్ధాంతం కోసం, పనిచేస్తున్న తనను విమర్శించే హక్కు రేవంత్‌కు లేదన్నారు. సోనియాను దెయ్యమన్న రేవంత్.. ఆ తర్వాత దేవత అంటూ ఆమె కాళ్లు పట్టుకున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి ఎవరో తిడితే, ఆదరబాదరగా ప్రచారానికి వెళ్లి తనపై, బండి సంజయ్‌పై రేవంత్ విరుచుకుపడ్డారని విమర్శించారు. 14 నెలల్లో తెలంగాణ స్వర్గమైనట్లు మాట్లాడుతున్నారని.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా అమలు చేశారా..? అని కిషన్‌రెడ్డి నిలదీశారు.

ఫీజులు, ఉద్యోగుల బకాయిలు చెల్లించండి..

హైదరాబాద్/న్యూఢిల్లీ/నల్లగొండ టౌన్/కామారెడ్డి టౌన్(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7,500 కోట్లకుపైగా పేరుకుపోయాయని.. డీఏలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు సంబంధించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయి ఉన్నాయని చెప్పారు. గత ఏడాది 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయితే నేటికీ ఒక్కరికి కూడా చిల్లిగవ్వ ఇవ్వకపోవడం దారుణమన్నారు.

త్వరలోనే రాష్ట్రంలో ఉప ఎన్నికలు: లక్ష్మణ్



కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీ ఫిరాయింపులు గుదిబండగా మారాయని, త్వరలోనే రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అప్పులను తీర్చడానికి, ప్రభుత్వాన్ని నడపడానికి మరిన్ని అప్పుల కోసం కేంద్ర ప్రభుత్వం చుట్టూ తిరుగుతోందన్నారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులు, పట్టభద్రులకు కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. అలాంటప్పుడు కాంగ్రెస్‌కు వారు ఎందుకు ఓటు వేయాలని ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. సోమవారం కామారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంపై ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన సీఎం.. ఎన్నికల ప్రచారంలో ఉండటం విడ్డూరమన్నారు.

బీఆర్ఎస్ స్కాంలను సీబీఐకిచ్చే దమ్ముందా?


- చీకటి ఒప్పందాలు మీరు చేసుకుని మాపై బురద జల్లుతారా?
- సీఎం రేవంత్‌కు సంజయ్ కౌంటర్




హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ- రేస్, గొర్రెల స్కాం, కాళేశ్వరం, కేటీఆర్ బామ్మర్ది పార్టీలో డ్రగ్స్ దొరికిన కేసులను సీబీఐకి అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలపై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ లేఖ రాస్తే.. ఆయా కేసుల్లో దోషులెవరైనా అరెస్ట్ చేసి జైల్లో వేయించే బాధ్యత కేంద్రం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోరకుండా, న్యాయస్థానాల ఆదేశాలు లేకుండా.. సొంతంగా విచారణ జరిపే అధికారం సీబీఐకి లేదని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసీ.. సీఎం స్థాయి వ్యక్తి కేంద్రంపై బురద జల్లడం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. "ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేస్, గొర్రెల స్కాంలపై రేవంత్ వ్యాఖ్యలు చూస్తే... ముఖ్యమంత్రిగా ఆయనే ఉన్నారా? లేక మేమున్నామా? అనే సందేహం వస్తోంది. అధికారాన్ని చేతిలో పెట్టుకుని ఎందుకు అరెస్ట్ చేయలేదని కేంద్రాన్ని నిందిస్తుంటే నవ్వొస్తుంది. ట్యాపింగ్ కేసులో నిందితులైన ప్రభాకర్‌రావు, శ్రవణ్ విదేశాలకు పారిపోతే... కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సహా సూత్రధారులు తెలంగాణలోనే ఉన్నారు కదా? అన్ని ఆధారాలున్నాయని చెబుతూ రాధాకిషన్‌రావు సహా కొందరు అధికారులను అరెస్ట్ చేసి 10నెలలు జైల్లో ఉంచిన మీరు.. కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయలేదు? పైకి తిడుతున్నట్లుగా నటిస్తూ కేసీఆర్ కుటుంబంతో చీకటి ఒప్పందాలు చేసుకున్నది మీరు కాదా? ఒకవైపు మీరు విచారణ చేస్తూ.. మమ్మల్ని అరెస్టు చేయమంటారా?" అని ప్రశ్నించారు.

ఓటమి భయంతో రేవంత్ అబద్ధాలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోతారని రేవంత్‌కు భయం పట్టుకుందని సంజయ్ అన్నారు. "ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ చేసిన ప్రసంగమంతా అబద్ధాలు, అర్ధ సత్యాలే. కాంగ్రెస్ ఓటమి ఖాయమనే భయం ఆయనలో కనిపిస్తోంది. ఇంటెలిజెన్స్ సహా సర్వే సంస్థలన్నీ బీజేపీ గెలుపు తథ్యమని తేల్చేశాయి. కాంగ్రెస్ 3వ స్థానానికి పడిపోతుందన్న నివేదికలతోనే సీఎం హడావుడిగా ప్రచారం ప్రారంభించారు. చరిత్రలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. రేవంత్ మాత్రం ఒకే రోజు 3 జిల్లాల్లో 3 మీటింగ్‌ల్లో పాల్గొన్నారు. డబ్బు, అధికారాన్ని ఉపయోగించి.. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు.' అని సంజయ్ ఆరోపించారు.





దేశీయ పర్యాటకం..

టాప్-10లో గోల్కొండ, చార్మినార్

వెల్లడించిన భారత పురావస్తు శాఖ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మా, ఐటీ, ఐటీ ఆధారిత సేవలు, పెట్టుబడులు, పరిశ్రమలు, రియల్‌ఎస్టేట్ రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం మరో ఘనతను సాధించింది. పర్యాటకంలోనూ ప్రాంతీయ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలోని టాప్-10 పర్యాటక ప్రదేశాల్లో గోల్కొండ కోట ఆరో స్థానాన్ని.. చార్మినార్ 9వ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ రెండు ప్రాంతాలకు ఏటా పర్యాటకుల సంఖ్య పెరుగుతోందని ఏఎస్ఐ గణాంకాలు చెబుతున్నాయి. టాప్-10 జాబితాలో ఆగ్రాలోని తాజ్‌మహల్ మొదటి స్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో కోణార్క్ సూర్య భగవానుడి ఆలయం, ఢిల్లీలోని ఎర్రకోట, ఔరంగాబాద్‌లోని ఎల్లోరా గుహలు, హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, ఆగ్రాకోట, ఔరంగాబాద్‌లోని బీబీ కా మక్బరా(రేబిస్ దురానీ సమాధులు), చార్మినార్, పుణేలోని శనివార్‌బాడ ఉన్నాయి.

పర్యాటకులు పెరుగుతున్నారిలా..

సంవత్సరం	ప్రదేశం	ప్రాంతీయ పర్యాటకులు	విదేశీ పర్యాటకులు
2021-22	చార్మినార్	8,05,829	3,601
	గోల్కొండ	13,14,614	7,506
2022-23	చార్మినార్	12,80,353	8,008
	గోల్కొండ	13,36,189	12,691
2023-24	చార్మినార్	12,41,916	9,564
	గోల్కొండ	13,47,983	13,487



వరంగల్ వ్యవసాయం, ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లకు ఎర్ర బంగారం పోటెత్తింది. మార్కెట్లలో ఎటు చూసిన మిరప బస్తాలే కనిపించాయి. సోమవారం సుమారు లక్షా 20 వేల మిర్చి బస్తాలు ఖమ్మం మార్కెట్‌కు రాగా, వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు 80 వేల మిర్చి బస్తాలు వచ్చాయి. వానాకాలం(ఖరీఫ్)మిర్చి సీజన్ ప్రారంభమైన తరువాత ఇంత భారీ మొత్తంలో పంట మార్కెట్లకు రావడం ఇదే తొలిసారి. మిర్చి యార్డులకు శని, ఆదివారాలు సెలవులు రావడంతో రైతులు సోమవారం పెద్దమొత్తంలో మిర్చి పంటను మార్కెట్‌లకు తీసుకొచ్చారు. సోమవారం ఉదయం 6 గంటలకే ఖమ్మం మార్కెట్ యార్డులు పూర్తిగా నిండిపోయాయి. ఖమ్మం మార్కెట్లో క్వింటాలు మిర్చిని కనిష్ఠంగా రూ.10,000 నుంచి గరిష్ఠంగా రూ.13,800 వరకు కొనుగోలు చేశారు. వరంగల్ మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర గరిష్ఠంగా రూ.13 వేలు, కనిష్ఠంగా రూ.7500గా నిర్ణయించారు. పెద్దమొత్తంలో మిర్చి రావడంతో వ్యాపారులు సిండికేట్ అయి మిర్చి రేటు తగ్గించారు.

చిత్రజ్యోతి


SINCE 1965

సర్కార్స్ లాఠీ



'హిట్' సిరీస్‌లో మూడో భాగంగా రాబోతున్న 'హిట్.. ద థర్డ్ కేస్' చిత్రం టీజర్‌ను హీరో నాని పుట్టినరోజు సందర్భంగా సోమవారం విడుదల చేశారు. 'సర్కార్స్ లాఠీ' పేరుతో వస్తున్న ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. అర్జున్ సర్కార్‌గా నాని పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో కట్టి పడేశారు. ఆయన నటన సినిమాకు మరింత డెప్త్ యాడ్ చేసింది. దర్శకుడు శైలేష్ కొలను అద్భుతమైన కథనం, విజువల్స్‌తో ఆసక్తికరంగా రూపొందిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం మే ఒకటిన విడుదల కానుంది. సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫీని, మిక్కీ జె మేయర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు.

కొల్లగొట్టినాదిరో...



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. మార్చి 28న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'మాట వినాలి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు 'కొల్లగొట్టినాదిరో' అనే రెండో గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ గీతం సినిమాపై అంచనాలను మరోస్థాయికి తీసుకెళ్లింది. పవన్ కల్యాణ్ స్క్రీన్ ప్రజెన్స్ లిరికల్ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ సరసన జంటగా నటించిన నిధి అగర్వాల్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. అలాగే ఈ పాటలో అనసూయ భరద్వాజ్, పూజిత పొన్నాడ తమ నృత్యాలతో అదనపు ఆకర్షణగా నిలిచారు.

జయ ఇంటికెళ్లి రజనీ నివాళి



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత 77వ జయంతిని పురస్కరించుకుని సోమవారం పోయెస్‌గార్డెన్‌లో వున్న ఆమె నివాసానికి వెళ్లిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్.. ఆమె చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. జయ మేనకోడలు, మేనల్లుడితో కలిసి ఆయన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం రజనీ మీడియాతో మాట్లాడుతూ... సినీ పరిశ్రమలో జయ బిజీగా వున్నప్పుడే ఆమెతో కలిసి నటించే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. తాను జయ ఇంటికి రావడం ఇది నాల్గోసారి అని గుర్తు చేసుకున్నారు. 1977లో జయతో కలిసి నటించే అవకాశం రాగా, దాని గురించి మాట్లాడేందుకు మొదటిసారిగా ఆమె నివాసానికి వచ్చానన్నారు. జయ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె అందించిన సేవల్ని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని, ఆమె కీర్తిప్రతిష్ఠలు కలకాలం వర్ధిల్లాలని రజనీకాంత్ కొనియాడారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

అందుకే ఆంగ్లంలో కూడా..



భారతీయ భాషలతో పాటు ఆంగ్లంలో కూడా సమాంతరంగా షూటింగ్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్.' ఇలా ఆంగ్లంలో చిత్రీకరిస్తున్న తొలి భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. కన్నడ చిత్ర కథానాయకుడు యశ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న భాషా, సాంస్కృతిక నేపథ్యాలతో వస్తున్న మా చిత్రాన్ని అన్ని భాషలు, ప్రాంతాల ప్రేక్షకులు ఆస్వాదించేలా రూపొందిస్తున్నాం. అన్ని సరిహద్దుల్ని 'టాక్సిక్' చెరిపేస్తుందని భావిస్తున్నాం' అన్నారు. 'టాక్సిక్' చిత్రం షూటింగ్ గత ఏడాది ఆగస్టులో మొదలైంది. ఇప్పటివరకూ ఇండియన్ హిస్టరీలోనే అత్యంత భారీ ఖర్చుతో నిర్మించిన చిత్రాల్లో ఇది ఒకటిగా నిలుస్తుంది. హాలీవుడ్ టెక్నీషియన్లు ఈ సినిమాకు పని చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వెంకట్ కె నారాయణ మాట్లాడుతూ 'మా లక్ష్యం చాలా స్పష్టంగా ఉంది. భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనించే చిత్రంగా 'టాక్సిక్'ను రూపొందిస్తున్నాం' అన్నారు.


ఛావా.. రూ. వంద కోట్ల దావా... క్షమాపణ



విక్కీ కౌశల్ నటించిన చారిత్రక చిత్రం 'ఛావా' తిరుగులేని వసూళ్లతో దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 300 కోట్లు కలెక్ట్ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా 'ఛావా'కు ప్రశంసలందించారు. అయితే ఈ సినిమాపై ఇప్పుడు ఓ కొత్త వివాదం మొదలైంది. చిత్రంలో గానోజీ, కన్హోజీ షిర్కే పాత్రల్ని వక్రీకరించారంటూ వారి వంశస్థులు మండి పడుతున్నారు. తమ వంశానికి అపకీర్తి తెచ్చిన సినిమా ఇదంటూ రూ. వంద కోట్ల దావా వెయ్యడానికి సిద్ధమయ్యారు. షిర్కే వంశానికి చెందిన 13వ తరం వారసుడు లక్ష్మీకాంత్ రాజే షిర్కే 'ఛావా' చిత్రం తమ వంశ ప్రతిష్ఠను మంట కలిపిందనీ, అసత్యాలు, అభూత కల్పనలు చోటు చేసుకున్నాయనీ విమర్శిస్తూ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌కు ఓ లేఖ రాశారు. రూ.వంద కోట్లకు పరువు నష్టం దావా కూడా వేస్తున్నట్లు పేర్కొన్నారు. అది తెలియగానే దర్శకుడు ఉటేకర్ షిర్కే కుటుంబానికి క్షమాపణలు చెప్పారు. ఆ వంశస్థుడు భూషణ్ షిర్కేను కలిసి 'మా సినిమాలో గానోజీ, కన్హోజీ పేర్లను మాత్రం పేర్కొన్నాం. వారి ఇంటి పేర్లు, గ్రామాల ప్రస్తావన ఇందులో లేదు. షిర్కే వంశస్థుల మనోభావాలను దెబ్బ తీయడం మా ఉద్దేశం కాదు' అని చెప్పారు.



సప్తగిరి వినోదాల విందు



అల్లరి నరేశ్ హీరోగా 17 ఏళ్ల క్రితం 'పెళ్లి కాని ప్రసాద్' పేరుతో ఓ సినిమా వచ్చి, ప్రేక్షకుల్ని అలరించింది. ఇప్పుడు అదే టైటిల్‌తో మరో సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో హాస్య నటుడు సప్తగిరి హీరో కావడం విశేషం. ప్రియాంక శర్మ హీరోయిన్. వినోదభరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకుడు. టైటిల్, ఫస్ట్ లుక్ సహా కొన్ని ఆసక్తికరమైన అంశాలను సోమవారం విడుదల చేశారు. సినిమాను మార్చి 21న దిల్ రాజు విడుదల చేస్తున్నారు. కేవై బాబు, భానుప్రకాశ్ గౌడ్, వెంకటేశ్వర గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల ఈ సినిమాను నిర్మించారు.

ఇక నుంచి ఇలాంటి సినిమాలే చేస్తా

- నిర్మాత రాజేశ్



"మజాకా' మంచి ఎంటర్‌టైనర్. ఫ్యామిలీ సినిమా. ఇకపై కూడా ఇలాంటి ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న సినిమాలనే చేస్తాను' అని అన్నారు నిర్మాత రాజేశ్ దండా. సందీప్ కిషన్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో త్రినాధ్ రావు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన చిత్రం 'మజాకా'. ఈనెల 26న విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ట్రైలర్ కంటే ముందు 'సొమ్మసిల్లి' అనే పాటను రిలీజ్ చేశాం. అది టాప్ ట్రెండింగ్‌లో ఉంది. ఇది కచ్చితంగా చాలా మంచి సినిమా అవుతుంది. ఇంటర్వెల్‌కి మంచి ట్విస్ట్ ఉంటుంది. సందీప్, రీతూ లవ్ స్టోరీ, అలాగే రావు రమేశ్, అన్షు ట్రాక్ కూడా బావుంటుంది. సందీప్‌కి 'భైరవకోన' కంటే బెటర్ సినిమా అవుతుంది. దీనికి సీక్వెల్ చేయాలనే ఆలోచన ఉంది. అందుకే సినిమా ముగింపులో 'డబుల్ మజాకా' అనే టైటిల్ వేశాం' అని అన్నారు.

బాగుంటే బ్లాక్ బస్టర్ అవుతుంది



అనిల్ బురగాని, ఆర్.జ్వలిత జంటగా శ్రీనివాస్ మల్లం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమకు జై'. ఈశ్వర పరమేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అనసూర్య నిర్మించారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శక నిర్మాత సాయి వెంకట్ మాట్లాడుతూ 'చిన్న బడ్జెట్ సినిమానా? పెద్ద బడ్జెట్ సినిమానా? అని ప్రేక్షకులు చూడరు. బాగుంటే ఏ సినిమానైనా బ్లాక్ బస్టర్ చేస్తారు' అని అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీనివాస్ మల్లం మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో చోటు చేసుకున్న ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని అన్నారు.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా
మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఎకెల్‌స్టోన్ 'సూపర్'

బెంగళూరుపై యూపీ ఉత్కంఠ విజయం



డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x గుజరాత్
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

బెంగళూరు: సోఫీ ఎకెల్‌స్టోన్ (19 బంతుల్లో 33) మాయాజాలంతో.. యూపీ వారియర్స్ 'సూపర్' గెలుపును నమోదు చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ సూపర్ ఓవర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై ఉత్కంఠ విజయం సాధించింది. ఇరుజట్ల స్కోర్లు 180 పరుగుల వద్ద టై కావడంతో.. మ్యాచ్ ఫలితం సూపర్ ఓవర్‌కు మళ్లింది. ఇందులో యూపీ 8/1 స్కోరు చేయగా.. ఎకెల్‌స్టోన్ బౌలింగ్ ధాటికి బెంగళూరు 4 పరుగులు మాత్రమే చేసి ఓడింది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు 20 ఓవర్లలో 180/6 స్కోరు చేసింది. ఎలీస్ పెర్రీ (56 బంతుల్లో 90 నాటౌట్), డానీ వ్యాట్ (57) రెండో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. హెన్రీ, దీప్తి, తాలియా మెక్‌గ్రాత్ తలో వికెట్ తీశారు. ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 180 పరుగులకే ఆలౌటైంది. రాణా మూడు, రేణుక రెండు వికెట్లు పడగొట్టారు. పవర్‌ప్లేలోపే ఓపెనర్లు కిరణ్ నవగిరె (24), వృంద (14)తోపాటు మెక్‌గ్రాత్ (0) వికెట్లను చేజార్చుకొన్న యూపీ 50/3తో ఇబ్బందుల్లో పడింది. ధాటిగా ఆడుతున్న దీప్తి శర్మ (25)ను రాణా.. శ్వేత (31)ను పెర్రీ అవుట్ చేయడంతో వారియర్స్ ఓటమి ఖాయమనిపించింది. కానీ, విజయానికి 36 బంతుల్లో 58 రన్స్ కావాల్సిన సమయంలో క్రీజులోకి వచ్చిన ఎకెల్‌స్టోన్ సిక్సర్లతో విరుచుకుపడడంతో.. లక్ష్యం చివరి ఓవర్‌లో 18 రన్స్‌కు దిగివచ్చింది. ఎకెల్‌స్టోన్ 6,6,4,1తో స్కోరు సమం చేసినా.. ఆఖరి బంతికి ఆమె రనౌట్ కావడంతో మ్యాచ్ టై అయింది. కాగా, డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఇదే తొలి సూపర్ ఓవర్ మ్యాచ్ కావడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు
బెంగళూరు: 20 ఓవర్లలో 180/6 (పెర్రీ 90 నాటౌట్, వ్యాట్ 57; మెక్‌గ్రాత్ 1/30, దీప్తి 1/42).
యూపీ: 20 ఓవర్లలో 180 ఆలౌట్ (ఎకెల్‌స్టోన్ 33, శ్వేత 31; రేణుక 3/27).

కివీస్ గెలుపు బంగ్లా, పాక్ ఇంటికి



రచిన్ సెంచరీ

సెమీస్‌లో న్యూజిలాండ్, భారత్

1 ఐసీసీ టోర్నీల్లో కివీస్ తరఫున ఎక్కువ శతకాలు (4) బాదిన ప్లేయర్‌గా రచిన్ రవీంద్ర.

రావల్పిండి: ఒక్క మ్యాచ్‌తో రెండు ఫలితాలు.. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో గ్రూప్ 'ఎ' నుంచి నాలుగేసి పాయింట్లతో కివీస్‌తో పాటు భారత్ కూడా సెమీఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది. అటు కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఓటమితో బంగ్లా, ఇప్పటికే రెండు ఓటములతో ఉన్న ఆతిథ్య పాక్ ఇంటిముఖం పట్టాయి. ఈ మ్యాచ్‌లో రచిన్ రవీంద్ర (112) క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టును విజయం వైపు నడిపించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 236 పరుగులు చేసింది. కెప్టెన్ షంటో (77), జాకెర్ అలీ (45), రిషాద్ (26) మాత్రమే రాణించారు. బ్రేస్‌వెల్‌కు నాలుగు, ఓరౌర్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 46.1 ఓవర్లలో 5 వికెట్లకు 240 పరుగులు చేసి గెలిచింది. లేథమ్ (55), కాన్వే (30) ఆకట్టుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బ్రేస్‌వెల్ నిలిచాడు.

శతక భాగస్వామ్యంతో..: ఛేదన ఆరంభంలోనే కివీస్‌కు బంగ్లా బౌలర్లు షాకిచ్చారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ విల్ యంగ్‌ను పేసర్ టస్కిన్ డకౌట్ చేయగా.. యువ పేసర్ నహీద్ రాణా వెటరన్ విలియమ్సన్ (5)ను దెబ్బతీశాడు. దీంతో 15/2 స్కోరుతో కివీస్ ఇబ్బందుల్లో పడింది. అదే జోరులో బంగ్లా సంచలన ఫలితం సాధించేనా? అనిపించింది. కానీ గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైన రచిన్ రవీంద్ర అదిరే ఆటతో జట్టును ఆదుకున్నాడు. ఏడో ఓవర్‌లో రచిన్ రెండు, ఎనిమిదో ఓవర్‌లో కాన్వే మూడు ఫోర్లతో బంగ్లా బౌలర్లపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. కానీ 16వ ఓవర్‌లో కాన్వేను ముస్తాఫిజుర్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత లేథమ్‌ను అండగా చేసుకున్న రచిన్ 49 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. సంయమనంతో ఆడిన ఈ జోడీని విడదీసేందుకు బంగ్లా చెమటోడ్చాల్సి వచ్చింది. లేథమ్ కాస్త ఆచితూచి ఆడినా.. రచిన్ మాత్రం బంతులను వృథా చేయలేదు. అడపాదడపా బౌండరీలతో 95 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. అటు 38వ ఓవర్‌లో స్కోరును 200కి చేర్చిన రచిన్‌ను స్పిన్నర్ రిషాద్ అవుట్ చేశాడు. అప్పటికే నాలుగో వికెట్‌కు 128 పరుగుల భారీ భాగస్వామ్యం సమకూరింది. అనంతరం హాఫ్ సెంచరీ అయ్యాక లేథమ్ రనౌట్‌గా వెనుదిరిగాడు. అయితే, విజయానికి 50 బంతుల్లో 23 పరుగులే కావాల్సి ఉండడంతో కివీస్‌కు ఇబ్బంది లేకపోయింది. ఫిలిప్స్ (21 నాటౌట్), బ్రేస్‌వెల్ (11 నాటౌట్) 46.1 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

షంటో పోరాటం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాకు ఓపెనర్లు షంటో, తన్‌జీద్ శుభారంభం అందించారు. కివీస్ బౌలర్లను ఈ జోడీ దీటుగా ఎదుర్కొంది. తన్‌జీద్ బంతికో పరుగు చొప్పున సాధిస్తూ జోరు మీదున్నా.. తొమ్మిదో ఓవర్‌లో బ్రేస్‌వెల్‌కు చిక్కాడు. దీంతో తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత షంటోకు పెద్దగా సహకారం అందలేదు. బ్రేస్‌వెల్ ధాటికి మిడిలార్డర్‌లో తొలి మ్యాచ్ సెంచరీ హీరో తౌహీద్ (7), ముష్ఫికర్ (2), మహ్మదుల్లా (4) చకచకా పెవిలియన్‌కు చేరారు. అయితే షంటోకు ఏడో నెంబర్ బ్యాటర్ జాకెర్ సహకారం అందించాడు. ఈ జోడీ ఆరో వికెట్‌కు 45 పరుగులు జత చేయగలిగింది. షంటో వెనుదిరిగాక టెయిలెండర్లతో కలిసి జాకెర్ విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పడంతో స్కోరు 200 దాటింది.

సంక్షిప్త స్కోర్లు
బంగ్లాదేశ్: 50 ఓవర్లలో 236/9 (షంటో 77, జాకెర్ 45, రిషాద్ 26, తన్‌జీద్ 24; బ్రేస్‌వెల్ 4/26, ఓరౌర్క్ 2/48).
న్యూజిలాండ్: ఓవర్లలో 46.1 ఓవర్లలో 240/5. (రచిన్ 112, లేథమ్ 55, కాన్వే 30; టస్కిన్ 1/28, ముస్తాఫిజుర్ 1/42).

అదే నాబలం బలహీనత



దుబాయ్: ఆఫ్ స్టంప్ ఆవలిగా పడిన బంతులను ఆడడం తన బలహీనతేనని స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంగీకరించాడు. అదే సమయంలో అదే తన బలం కూడా అని స్పష్టం చేశాడు. 'అవుట్ సైడ్ ఆఫ్ స్టంప్ బంతులను ఆడాలా..వద్దా.. అనే సందిగ్ధ పరిస్థితి. అది నా బలహీనత. అలాగే అది బలం కూడా. ఆ షాట్ ద్వారా నేను ఎన్నో పరుగులు సాధించా' అని విరాట్ గుర్తు చేశాడు. ఈమేరకు పాకిస్థాన్‌తో చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ అనంతరం కోహ్లీ చేసిన వ్యాఖ్యల వీడియోను బీసీసీఐ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

సూపర్ ఇన్నింగ్స్: తీవ్ర ఒత్తిడిలో ఉన్న కోహ్లీ పాకిస్థాన్‌పై సెంచరీ చేయడం అద్భుతమని కేంద్ర క్రీడా శాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కొనియాడారు.

మరో మూడేళ్లు ఆడతాడు
కోహ్లీని తరానికొక్క క్రికెటర్‌గా భారత జట్టు మాజీ ఆటగాడు నవజ్యోత్‌సింగ్ సిద్ధూ అభివర్ణించాడు. పాకిస్థాన్‌పై అతడి ఇన్నింగ్స్ గమనిస్తే మరో రెండు లేదా మూడేళ్లు విరాట్ క్రికెట్‌లో కొనసాగుతాడని అభిప్రాయపడ్డాడు.

టిక్కెట్లు పంపించి.. అదే హోటల్లో బస కల్పించి..

చిన్ననాటి కోచ్‌పట్ల కోహ్లీ కృతజ్ఞత

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌తో పోరులో అజేయ సెంచరీతో ఆకట్టుకున్న విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌ను ప్రత్యక్షంగా చూడడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అతని చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ తెలిపాడు. కాగా, మ్యాచ్‌లో శతకం సాధించిన విరాట్.. అనంతరం స్టాండ్స్‌లో ఉన్న ఎవరికో 'చూశావా' అనే సైగ చేసినట్టుగా కనిపించింది. అయితే, అప్పుడు స్టాండ్స్‌లో ఉన్న తనను ఉద్దేశించే కోహ్లీ అలా చేశాడని రాజ్‌కుమార్ వెల్లడించాడు. అంతేకాదు, మ్యాచ్‌కోసం స్వయంగా కోహ్లీనే టిక్కెట్లు పంపించడంతో పాటు అతను బస చేసిన హోటల్లోనే తనకూ ఏర్పాట్లు చేశాడని తెలిపాడు. కోహ్లీ గురువుగా తనకు ఇంతకువించిన ఆనందం ఇంకేం కావాలని రాజ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశాడు.

విరాట్.. ఏం నిర్ణయించుకున్నావ్?

భవిష్యత్ గురించి ప్రశ్నించిన గంభీర్, అగార్కర్



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన సత్తా ఏమిటో చాటుకున్నాడు. జట్టులో చోటు అవసరమా? అంటున్న విమర్శకులకు శతకంతో సమాధానమిచ్చాడు. అయితే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తను అంచనాలను అందుకోలేకపోయిన విషయం తెలిసిందే. వన్డేల్లోనూ చివరి శతకం 2023లో వచ్చింది. అందుకే ఆ సమయంలో పరుగుల కోసం ఇబ్బందిపడిన కోహ్లీని.. కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తన భవిష్యత్ ప్రణాళికలపై ప్రశ్నించారట. ఆసీస్ టూర్‌లో విఫలమయ్యాక టీమిండియాలో కోహ్లీ స్థానంపై ఏదో ఒకటి తేల్చాలని వారు భావించారు. అందుకే కెరీర్ గురించి ఏం నిర్ణయించుకున్నావని అతడినే నేరుగా అడిగినట్టు మీడియాలో కథనం రావడం సంచలనం సృష్టించింది.

పాక్‌లో సంబరాలు



ఇస్లామాబాద్: విరాట్ కోహ్లీ అభిమానులకు సరిహద్దులు లేవని మరోసారి రుజువైంది. పొరుగు దేశం పాకిస్థాన్‌లోనూ విరాట్ వీరాభిమానులు భారీ సంఖ్యలో ఉన్న విషయం తెలిసిందే. చాంపియన్స్ ట్రోఫీలో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా ఇస్లామాబాద్‌లో ఆదివారం పలు చోట్ల ప్రత్యేక స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. విరాట్ ఫోర్‌కొట్టి శతకం సాధించగానే ఇస్లామాబాద్‌లో అతడి అభిమానులు సంబరాలు చేసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. తమ జట్టు ఓడిపోయిందన్న బాధ కంటే కోహ్లీ శతకమే వారిని సంతోషపెట్టింది. ఫామ్‌లో లేక కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న కోహ్లీ ఎట్టకేలకు సెంచరీ సాధించేసరికి అతడి అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

మహిళా క్రికెట్‌కు ఆదరణ రెట్టింపు

న్యూఢిల్లీ: దేశంలో పురుషుల క్రికెట్‌తో పోలిస్తే మహిళల క్రికెట్‌కు ఆదరణ తక్కువే. అయితే, కాంతర్ ఇండియా అనే సంస్థ నివేదిక ప్రకారం దేశంలో మహిళల క్రికెట్‌కు ఊహించని రీతిలో ఆదరణ పెరిగిందట. 2023 నవంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య మహిళా క్రికెట్ గురించి అంతర్జాలంలో శోధించిన వారి సంఖ్య గతంతో పోలిస్తే 103 శాతం పెరిగిందని ఆ సంస్థ పేర్కొంది. మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన వంటి స్టార్ క్రికెటర్లకు అభిమానగణం వృద్ధి కూడా మహిళా క్రికెట్ ఆదరణ పెరగడానికి కారణమని ఈ నివేదికలో తేలింది. మహిళల క్రికెట్‌తో పాటు కబడ్డీకి 75 శాతం, హాకీకి 40 శాతం గతంలో కంటే ఆదరణ పెరిగినట్టు కాంతర్ ఇండియా తెలిపింది.

బాబర్ మోసగాడు

'కింగ్' కోహ్లీయే



పాక్ మాజీలు షోయబ్, హఫీజ్

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీలో వరుస ఓటముల నేపథ్యంలో పాకిస్థాన్ జట్టుపై విమర్శల జడివాన కురుస్తోంది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఆట తీరుపై పాక్ మాజీలు విరుచుకు పడుతున్నారు. మాజీ పేసర్ షోయబ్ అక్తర్ అయితే టీవీ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంలో..బాబర్‌ను మోసగాడని దుయ్యబట్టాడు. 'మనం ఎప్పుడూ బాబర్‌ను విరాట్‌తో పోలుస్తాం. ఇప్పుడు చెప్పండి.. హీరో ఎవరో? అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్ 100 శతకాలు చేశాడు. విరాట్ వాటిని చేరుకొనే దిశగా సాగుతున్నాడు. అసలు బాబర్ ఆజమ్ ఎవరు? అభిమానులూ...మీరు తప్పుడు హీరోను ఎంచుకున్నారు. మీ నిర్ణయమే తప్పు. మొదటి నుంచీ బాబర్ మోసగాడు' అని అక్తర్ నిప్పులు చెరిగాడు. హఫీజ్ కూడా అక్తర్‌ను సమర్థించాడు. 'బాబర్ నిజమైన 'కింగ్' కాదు. విరాట్ అసలైన కింగ్. బాబర్ ఆజమ్ భారత్‌పై ఎప్పుడైనా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాడా? జట్టు నుంచి బాబర్‌ను తప్పించాలి' అని హఫీజ్ సూచించాడు. తెల్లబంతుల ఫార్మాట్‌లో పాకిస్థాన్ జట్టును సమూలంగా ప్రక్షాళన చేయాలని మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత వసీమ్ అక్రమ్ అభిప్రాయపడ్డాడు. ప్రతిభ కలిగిన క్రికెటర్లకు జట్టులో స్థానం కల్పించాల్సిన తరుణం ఆసన్నమైందని మరో మాజీ సారథి వకార్ యూనిస్ వ్యాఖ్యానించాడు.

పీఎస్‌బీల్లో తగ్గనున్న ప్రభుత్వ వాటా

మరిన్ని వాటాల విక్రయానికి సన్నాహాలు

మర్చంట్ బ్యాంకర్ల నుంచి బిడ్స్ ఆహ్వానం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) మరో విడత పెట్టుబడుల ఉపసంహరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈక్విటీలో 25 శాతం కంటే తక్కువ పబ్లిక్ ఫ్లోటింగ్ ఉన్న లిస్టెడ్ ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ), ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల (పీఎ్ఫఐ) నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు అవసరమైన సేవలు అందించే మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సేవల సంస్థలు వచ్చే నెల 27లోగా తమ ప్రతిపాదనలు అందజేయాలని కోరింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ప్రభుత్వ ఆస్తులు, పెట్టుబడుల నిర్వహణ శాఖ (దీపమ్) దీనికి సంబంధించి సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంపిక చేసిన సంస్థలు మూడేళ్ల పాటు ప్రభుత్వానికి ఈ విషయంలో సేవలు అందించాలి. ఒకవేళ అవసరమనుకుంటే ఈ గడువును మరో ఏడాది పొడిగిస్తారు. లిస్టెడ్ పీఎస్‌బీలు, పీఎ్ఫఐలు వచ్చే ఏడాది ఆగస్టు 1లోగా తమ ఈక్విటీలో 25 శాతం పబ్లిక్ ఫ్లోటింగ్ ఉండేలా చూసుకోవాలని సెబీ ఆదేశించింది. దీంతో స్టాక్ మార్కెట్ కోలుకున్న వెంటనే ఈ పని పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

హైదరాబాద్‌లో మిల్టెనీ బయోటెక్ సీఓఈ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో తొలి సెల్, జీన్ థెరపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ప్రారంభించినట్టు మిల్టెనీ బయోటెక్ ప్రకటించింది. జీనోమ్ వ్యాలీలో 1,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మిల్టెనీ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను (ఎంఐటీసీ) ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ఇందులో సెల్, జీన్ థెరపీలపై అధ్యయనం చేస్తారు. క్యాన్సర్ సహా విభిన్న వ్యాధులపై పోరాటంలో అత్యుత్తమ ప్రమాణాలు, అత్యాధునిక టెక్నాలజీలు, నైపుణ్యాలను సమీకృతం చేయడం ద్వారా ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇమ్యునాలజీ, స్టెమ్ సెల్ బయాలజీ, క్యాన్సర్ పరిశోధన వంటి కీలక రంగాలపై వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించే ఒక సహకార హబ్‌గా ఇది పని చేస్తుందని పేర్కొంది. ఈ సహకారం రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సెల్, జీన్ థెరపీలో విప్లవాత్మక పరిశోధనలకు దారి తీయగలదన్న ఆశాభావం తెలంగాణ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేష్ రంజన్ ప్రకటించారు.



ఐటీ పరిశ్రమకీ సుంకాల భయం

- ఆదాయాల వృద్ధికి ఢోకా లేదు
- 2024-25లో రూ.24.5 లక్షల కోట్ల ఆదాయం
- 58 లక్షలకు చేరిన ఐటీ కొలువులు
- 2025-26లో ఆదాయం రూ.26 లక్షల కోట్లు ఉండే చాన్స్

నాస్కామ్ చీఫ్ రాజేశ్ నంబియార్

ముంబై: భారత ఐటీ కంపెనీలకూ ట్రంప్ సుంకాల భయం పట్టుకుంది. ప్రపంచ ఉద్రిక్తతలూ ఇందుకు తోడయ్యాయి. అయినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత ఐటీ కంపెనీల ఆదాయాలు 5.1 శాతం పెరిగి 28,260 కోట్ల డాలర్లకు (సుమారు రూ.24.5 లక్షల కోట్లు) చేరే అవకాశం ఉందని నాస్కామ్ జాతీయ అధ్యక్షుడు రాజేశ్ నంబియార్ చెప్పారు. నాస్కామ్ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. అంతేకాదు.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఐటీ కంపెనీల ఆదాయాలు మరో 6.1 శాతం వృద్ధితో 30,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.26.10 లక్షల కోట్లు) మించి పోయే అవకాశం ఉందన్నారు.

1.26 లక్షల కొత్త కొలువులు

ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరం దేశంలోని ఐటీ సేవల కంపెనీలు, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) కంపెనీలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) ఈ-కామర్స్ కంపెనీలు అన్నీ కలిసి 1.26 లక్షల కొత్త కొలువులు కల్పించినట్టు రాజేశ్ చెప్పారు. దీంతో దేశ ఐటీ రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 58 లక్షలకు చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) కూడా దేశ ఐటీ రంగంలో కొత్త కొలువుల కల్పన ఇదే స్థాయిలో ఉండే అవకాశం ఉందని నంబియార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రపంచ ఐటీ సేవల రంగంలో భారత కంపెనీల వాటా 58 శాతానికి చేరనుందన్నారు.

ఎగుమతులే సింహభాగం

ఈ ఆర్థిక సంవత్సరం భారత ఐటీ కంపెనీలకు వచ్చే 28,260 కోట్ల డాలర్ల ఆదాయంలో మెజారిటీ వాటా 22,440 కోట్ల డాలర్లు ఎగుమతుల ద్వారా రానుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 4.6 శాతం ఎక్కువని నంబియార్ చెప్పారు. ఎగుమతులతో పోలిస్తే ఈ సంవత్సరం దేశీయ మార్కెట్ 7 శాతం పెరిగి 5,820 కోట్ల డాలర్లకు చేరనుంది. అలాగే మొత్తం ఐటీ పరిశ్రమ ఆదాయంలో 3,710 కోట్ల డాలర్లు ఐటీ సేవల కంపెనీల నుంచి, బీపీఎం కంపెనీల నుంచి 5,460 కోట్ల డాలర్లు, ఇంజనీరింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీల నుంచి 5,560 కోట్ల డాలర్ల ఆదాయం లభిస్తుందని నాస్కామ్ అంచనా.

అమెరికాదే అగ్రస్థానం

భారత ఐటీ ఎగుమతుల్లో ఇప్పటికీ అమెరికా వాటా 60 నుంచి 62 శాతం వరకు ఉంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న విధానపరమైన చర్యలు ఎక్కడ తమ ఎగుమతులను దెబ్బతీస్తాయోనని ఐటీ కంపెనీలు భయపడుతున్నాయి. 'ప్రస్తుతం అమెరికా మార్కెట్ అగమ్యగోచరంగా ఉంది. అక్కడి కొత్త ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో తెలియడం లేదు' అని నంబియార్ చెప్పారు. అయితే ఇదే సదస్సులో ప్రసంగించిన ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ మాత్రం మన ఐటీ కంపెనీలపై ట్రంప్ హెచ్చరికల ప్రభావం ఏ మాత్రం ఉండదన్నారు. ట్రంప్ సుంకాలతో అమెరికా కంపెనీలు లాభపడితే.. పరోక్షంగా అది మన ఐటీ కంపెనీలకూ మేలు చేస్తుందన్నారు. అమెరికాలోని తమ కంపెనీలో పనిచేసే ఉద్యోగుల్లో 60 శాతం మంది స్థానికులని పరేఖ్ వెల్లడించారు.

బిజినెస్

డీబీఎస్ గ్రూప్‌లో 4,000 మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంకింగ్ దిగ్గజం డీబీఎస్ గ్రూప్ భారీగా ఉద్యోగులకు ఉద్వాసన చెబుతోంది. వర్ధమాన టెక్నాలజీ కృత్రిమ మేధ (ఏఐ) అమలు ఇందుకు కారణం. రాబోయే మూడేళ్ల కాలంలో తాము 10 శాతం అంటే 4,000 ఉద్యోగాలకు కోత పెట్టాల్సివస్తుందని బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పీయూష్ గుప్తా తెలిపారు. బ్యాంకుకు సారథ్యం వహిస్తున్న 15 సంవత్సరాల కాలంలో తొలిసారిగా కొత్త ఉద్యోగాల సృష్టికి తాను చాలా శ్రమించాల్సి వస్తోందని ఆయన చెప్పారు. తమ బ్యాంకులో గత 10 సంవత్సరాల కాలంలో ఎలాంటి ఉద్యోగాల కోత లేదని ఆయన తెలిపారు. 2016-17 సంవత్సరంలో బ్యాంకు భారీగా డిజిటైజేషన్ చేపట్టినప్పుడు 1,600 ఉద్యోగాలకు కోత విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కాని యూనియన్లు, వారి ప్రతినిధులతో మాట్లాడి వారందరినీ ఇతర శాఖల్లో సర్దుబాటు చేశామని ఆయన అన్నారు. రెండేళ్ల క్రితం డీబీఎస్ జెనరేటివ్ ఏఐ సొల్యూషన్ల అమలును ప్రారంభించిందని, వాటి ఫలితం ఎలా ఉందన్నది ఇంకా వెల్లడి కావలసి ఉన్నదని గుప్తా చెప్పారు.

ఇండియా, యూకే ఎఫ్‌టీఏ చర్చలు పునః ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై (ఎఫ్‌టీఏ) చర్చలు పునఃప్రారంభమైనట్టు భారత్, యూకే ప్రకటించాయి. ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం ఉన్న 2,000 కోట్ల డాలర్ల నుంచి రెండింతలు లేదా మూడింతలు చేయాలన్న లక్ష్యసాధనకు ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్, ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న బ్రిటిష్ వ్యాపార, వాణిజ్య శాఖ మంత్రి జోనాథన్ రేనాల్డ్స్ ఈ విషయం ప్రకటించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	480
వరంగల్	442	గోదావరి	470
చిత్తూరు	493	విశాఖపట్నం	470
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	విజయవాడ	71
వరంగల్	70	గుంటూరు	71
కరీంనగర్	70	ఒంగోలు	71
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	70
కర్నూలు	70	నెల్లూరు	75
విశాఖపట్నం	70	అనంతపురం	75
గోదావరి	71		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,870 ▲	80,550 ▲	1,08,000 ▲
విజయవాడ	89,300 ▲	84,500 ▲	99,000 ▲
విశాఖపట్నం	86,520 ▲	79,310 ▲	96,280 ▼
రాజమండ్రి	87,870 ▲	80,550 ▲	99,900 ▼
ప్రొద్దుటూరు	88,600 ▲	82,090 ▲	98,000 ▼
ముంబై	86,400 ▲	79,142 ▲	96,115 ▼

75,000 దిగువకు సెన్సెక్స్

- ఐదో రోజూ ఆగని పతనం
- రూ.4.22 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: ఈక్విటీ మార్కెట్‌పై బేర్ పట్టును మరింత బిగించింది. అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ నిధుల తరలింపు, పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. వరుసగా ఐదో సెషన్‌లో కూడా ఈక్విటీ సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. దీంతో సోమవారం సెన్సెక్స్ 856.65 పాయింట్ల నష్టంతో 74,454.41 వద్ద ముగిసింది. ఒక దశలో ఇండెక్స్ 923.63 పాయింట్లు నష్టపోయి 74,387.44 వరకు దిగజారింది. నిఫ్టీ 242.55 పాయింట్ల మేరకు దిగజారి 22,553.35 వద్ద ముగిసింది. ప్రధానంగా ఐటీ, టెలికాం, మెటల్ షేర్లలో అమ్మకాలు మార్కెట్‌ను భారీ నష్టాల్లోకి నెట్టాయి. బీఎస్ఈలో 2,810 షేర్లు నష్టపోగా 1,207 షేర్లు మాత్రం లాభపడ్డాయి. 183 షేర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. సెన్సెక్స్ నష్టపోవడం వరుసగా ఇది ఐదో రోజు. ఈ ఐదు రోజుల్లో సూచీ 1,542.45 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 406.15 పాయింట్లు దిగజారింది. మార్కెట్‌పై ఏర్పడిన బేర్ పట్టుతో మార్కెట్ సూచీలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయిలకు దిగజారాయని విశ్లేషకులంటున్నారు. రాబోయే కాలంలో కూడా ప్రపంచ మార్కెట్ల గమనమే మన మార్కెట్‌ను భారీగా ప్రభావితం చేస్తుందని, ఫలితంగా భారీ రిస్క్‌కు ఇష్టపడని రిటైల్ ఇన్వెస్టర్లు అనిశ్చితిని ఎదుర్కొంటారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ అంటున్నారు.

ఇన్వెస్టర్లు లబోదిబో : రెండు వారాలుగా మార్కెట్‌పై బేర్ పట్టు బిగియడం ఇన్వెస్టర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సోమవారం నాటి భారీ పతనం కారణంగా ఒక్క రోజులోనే ఇన్వెస్టర్ల సంపద రూ.4.22 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. నికరంగా రూ.4,22,983.08 కోట్లు (4.59 లక్షల కోట్ల డాలర్లు) నష్టంతో రూ.3,97,97,305.47 కోట్ల వద్ద స్థిరపడింది.

- బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.78 శాతం నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ గరిష్ఠంగా 2.65 శాతం నష్టపోయింది. టెక్ (2.56%), టెలీ కమ్యూనికేషన్ (2.26%), మెటల్ (2.16%), కమోడిటీస్ (1.53%), యుటిలిటీస్ (1.42%) నష్టపోయాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ మాత్రం లాభపడ్డాయి..

ట్రంప్ టారిఫ్‌లతో ముప్పే

ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో ఆసియా, పసిఫిక్ ప్రాంతంలోని కొన్ని దేశాలకు ముప్పు తప్పదని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. ముఖ్యంగా ఆసియా దేశాలైన వియత్నాం, తైవాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్ దేశాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అయితే దేశీయ వినియోగం ఎక్కువగా ఉండే భారత, జపాన్ దేశాలపై ఈ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని అంచనా వేసింది. ఏప్రిల్ నుంచి ఏ దేశం తమ ఎగుమతులపై ఎంత సుంకం విధిస్తే, తామూ ఆ దేశ ఎగుమతులపై అంతే సుంకం విధిస్తామని ట్రంప్ సర్కార్ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రధాని మోదీతో ఎంత దోస్తానా ఉన్నా, ఈ విషయంలో భారత్‌కూ ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు.

దిగొచ్చిన యాపిల్

అమెరికాలో 50,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు

ట్రంప్ సుంకాల హెచ్చరికల దెబ్బకు ఐఫోన్ తయారీ కంపెనీ 'యాపిల్' దిగొచ్చింది. వచ్చే నాలుగేళ్లలో అమెరికాలో 50,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు కంపెనీ సీఈఓ టిమ్ కుక్ సోమవారం ప్రకటించారు. ఇందులో భాగంగా టెక్సా‌స్‌లో కొత్తగా సర్వర్ల తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. ఈ చర్యలతో కొత్తగా 20,000 ఉద్యోగాలు ఏర్పడతాయని తెలిపారు. తమ తయారీ యూనిట్‌ను మెక్సికో నుంచి అమెరికాకు తరలిస్తామని యాపిల్ సీఈఓ హామీ ఇచ్చినట్టు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొద్ది రోజులకే కుక్ ఈ ప్రకటన చేయడం విశేషం.

భారత్ నుంచి ఫోన్ల ఎగుమతులపైనా ప్రభావం: ప్రస్తుతం భారత్.. ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల దిగుమతులపై సగటున 16.5 శాతం సుంకం విధిస్తోంది. అమెరికా మాత్రం ఎలాంటి సుంకాలు లేకుండా ఈ దిగుమతులను అనుమతిస్తోంది. దీంతో యాపిల్ కంపెనీ తన సరికొత్త ఐఫోన్లతో సహా అనేక ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను భారత్‌లో అసెంబుల్ చేసి, జీరో డ్యూటీతో అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ట్రంప్ పరస్పర సుంకాల విధానం అమల్లోకి వస్తే ఈ ఎగుమతులతో పాటు 'భారత్‌లో తయారీ' కార్యక్రమానికి బ్రేక్ పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

లక్ష దాటిన మహిళా కాంగ్రెస్ సభ్యత్వం

- సభ్యత్వ డబ్బుతో మహిళలకు శానిటరీ నాప్‌కిన్ మిషన్లు
- జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సగం మహిళల పాత్ర ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రధమ ప్రాధాన్యత ఇస్తోందని జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా అన్నారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన నారీ న్యాయ్ సమ్మేళన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో లక్షా మూడువందల మంది మహిళలు సభ్యత్వాలు తీసుకోవడం హర్షణీయమని అల్కా లాంబా అన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఐదు లక్షల మంది మహిళలు కాంగ్రెస్ సభ్యత్వాలు తీసుకోగా అందులో తెలంగాణ నుంచే లక్షమందికి పైగా సభ్యత్వ నమోదు జరగడం హర్షదాయకమని, ఇందుకు కృషి చేసిన తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు, ఆమె బృందాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. మహిళా సభ్యత్వాల ద్వారా వచ్చిన డబ్బుతో శానిటరీ నాప్‌కిన్ మిషన్లు కొనుగోలు చేసి వివిధ జిల్లాల్లో మహిళలకు అందజేస్తామని, దీని వల్ల మహిళలకు మరింత ఆదాయం లభిస్తుందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో కృషి చేసిన మహిళలను ప్రియాంకా గాంధీ ఢిల్లీలో సత్కరిస్తారని చెప్పారు.

రాష్ట్రంలో దస్ పర్సంటేజ్ సర్కారు: కవిత

మహబూబాబాద్/ కేసముద్రం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో దస్ పర్సంటేజ్ సర్కార్ నడుస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన లేదని, పర్సంటేజీల పాలన నడుస్తోందని, పర్సంటేజీలు ఇచ్చిన వారికే బిల్లులు మంజూరవుతున్నాయని ఆమె ఆరోపించారు. మహబూబాబాద్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పీపీపీ మోడ్‌లో నడుస్తోందని, మొదటి పీ- ఫోబియా, రెండో పీ- పాలిటిక్స్ అని, మూడో పీ- పర్సంటేజ్ అని వివరించారు. సీఎం సొంత జిల్లాలో టన్నెల్ కూలిపోతే సీఎం అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాల్సింది పోయి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి పోయారని విమర్శించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి పోయి మద్దతు ధరపై కొట్లాడుతుంటే రేవంత్ మాత్రం రైతుల పరిస్థితిని పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం సాయంత్రం వేళ కేసముద్రం మార్కెట్ మిర్చి యార్డును కవిత సందర్శించారు. గతేడాది క్వింటా రూ.25 వేలు అమ్మిన మిర్చి ఈసారి రూ.11 వేలకు పడిపోయిందని, సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి మోదీ కాళ్లు పట్టుకొనైనా మిర్చికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

మార్చి 1 నుంచి 4వ తేదీ వరకు..
ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక మహాసభలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక(ఎన్‌ఏపీఎం) 30వ వార్షిక మహాసభలు మార్చి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మహాసభలకు దేశంలోని 24 రాష్ట్రాల నుంచి ప్రజా ఉద్యమకారులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు తరలి రానున్నారని వారు తెలిపారు. మహాసభల వాల్‌పోస్టర్‌ను ప్రొఫెసర్ జి. హరగోపాల్ సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగం పెను ప్రమాదంలో పడ్డాయని, వాటిని రక్షించుకోవడానికి దేశవ్యాప్తంగా లోతైన చర్చ జరగాలని ఆయన పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త సజయ మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని దెబ్బతీయడానికి హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్నారని, వీటిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు విస్సా కిరణ్‌కుమార్, కన్నెగంటి రవి, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి. సంధ్య, వెంకటస్వామి, ఫరీనాబేగం, పి. శంకర్ మాట్లాడుతూ.. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ మహాసభలు జరగనున్నాయని చెప్పారు.



జగిత్యాలలోని సహకార సంఘంలోకి ఆదివారం రాత్రి 867 యూరియా బస్తాలు వచ్చాయనే సమాచారంతో రైతులు సోమవారం భారీగా తరలివచ్చి ఆధార్‌కార్డులను ఇలా క్యూలైన్‌లో ఉంచారు. సరిపడా యూరియా లేక కొంతమంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

యూరియా కోసం రైతన్నల తంటాలు: హరీశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతన్నలు మండుటెండల్లో తంటాలు పడుతుంటే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా కాంగ్రెస్ సర్కార్ మొద్దునిద్రలో ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలోని రైతుల కన్నీళ్ల కడగండ్లను కాంగ్రెస్ పునరావృతం చేస్తోందని ఎక్స్‌వేదికగా ఆయన ఆరోపించారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీచేస్తే, సోమవారం జగిత్యాలలో రైతులు పాస్‌బుక్కులు, ఆధార్‌కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి కనబడుతోందన్నారు. రైతన్నను నట్టేటముంచి, నడిరోడ్డు మీదకుతెచ్చిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతాంగానికి అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఆధార్ లేకున్నా వైద్యం అందించాలి

- హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధార్ కార్డు ఉంటేనే వైద్యం అందిస్తున్నారని, లేకుంటే రోగులను అడ్మిట్ చేసుకోవడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. భైరెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తి దీనిని దాఖలు చేశారు. ఆధార్ కార్డు లేకపోయినా వైద్యం అందించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాది ఎస్. రాహుల్‌రెడ్డి వాదిస్తూ.. ఆధార్ కార్డు లేకపోయినంత మాత్రాన వైద్యం నిరాకరించడం లేదని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు అందజేస్తామని పేర్కొన్నారు. దీంతో విచారణ ఈనెల 28కి వాయిదా పడింది.

జనం ఛీ కొడుతున్నా...
తీరు మార్చుకోని జగన్

- 11 మంది ఎమ్మెల్యేలతో 11 నిమిషాలు ఉండటానికా సభకు వచ్చింది?: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'జనాలు ఛీ కొడుతున్నా వైసీపీ అధ్యక్షుడు జగన్ తీరు మాత్రం మారలేదు. 11 మంది ఎమ్మెల్యేలతో కలిసి 11 నిమిషాలు ఉండటానికా అసెంబ్లీకి వచ్చింది?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. సోమవారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? సభ్యత్వాలు రద్దు అవుతాయనే భయంతో హాజరు కోసం వచ్చారా? కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికి మీకు ప్రతిపక్ష హోదానే కావాలా? ప్రజల శ్రేయస్సు కంటే మీకు పదవులే ముఖ్యమని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారు. వైసీపీ సభ్యులకు పదవులు ముఖ్యం కాదనుకుంటే... ప్రజా సమస్యల మీద చిత్తశుద్ధి ఉంటే.. మంగళవారం నుంచి అసెంబ్లీకి వెళ్లాలని కోరుతున్నాం. సభకు వెళ్లే దమ్ము లేకపోతే తక్షణం పదవులకు రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేస్తున్నాం' అని షర్మిల అన్నారు.

1న జేఎన్‌టీయూలో మెగా జాబ్ ఫెయిర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మార్చి 1న జేఎన్‌టీయూలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నిపుణ- సేవా ఇంటర్నేషల్ సహకారంతో చేపట్టిన ఈ జాబ్ ఫెయిర్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జాబ్ మేళా ద్వారా విద్యార్థులకు, నిరుద్యోగులకు ఐటీ, ఐటీయేతర ఫార్మా, ఇంజినీరింగ్, బ్యాంకింగ్, రిటైల్, తయారీ, మేనేజ్‌మెంట్ రంగాల్లో 10వేలకు పైగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. త్వరలో ఇదే తరహా జాబ్ మేళాలను వర్సిటీకి అనుబంధంగా ఉన్న మంథని, జగిత్యాల జేఎన్‌టీయూ క్యాంపస్‌లో నిర్వహిస్తామన్నారు.

బరాబర్ ఇల్లు కడతా.. నువ్వు చస్తే గోరి కడతా!

- బీజేపీ ఎంపీ నగేశ్‌పై సోయం బాపురావు తీవ్ర వ్యాఖ్యలు





తలమడుగు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'సొంత ఇల్లు లేనప్పుడు కట్టుకోవడం తప్పా..? బరాబర్ ఇల్లు కట్టుకుంటా.. నువ్వు చస్తే నీకు గోరి కూడా కట్టిస్తాను..!' అంటూ ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ నగేశ్‌పై కాంగ్రెస్ నేత సోయం బాపురావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సాయిలింగిలో మాజీ ఎంపీ విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో 10 ఏళ్లు బీజేపీ, రాష్ట్రంలో 10 ఏళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ.. ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. ఎంపీ నగేశ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాస్‌పోర్టు విషయంలో కోర్టు నిర్దోషిగా తీర్పు ఇచ్చినప్పటికీ.. దానిపై మాట్లాడడం సమంజసం కాదన్నారు. మరోసారి ఆ విషయం ఎత్తితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీ నిధులతో ఇల్లు కట్టారని ఆరోపించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిధులకు ఎంపీ రికార్డులు ఉంటాయని నగేశ్‌కు తెలియదా.. అని నిలదీశారు.

టీచర్ ఎమ్మెల్సీ.. ఉత్కంఠ పోరు!

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11,355 ఓట్లున్నాయి. వీటిలో 5,215ఓట్లు హనుమకొండ జిల్లాలో, 2,352 ఓట్లు వరంగల్ జిల్లాలో ఉన్నాయి. ఫలితంగా ప్రచారం మొత్తం వరంగల్ కేంద్రంగానే జరిగింది. ఈ ఎన్నికల్లో పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇదే సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ బీసీ సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పులి సరోత్తమ్‌రెడ్డి కూడా పూర్వ పీఆర్‌టీయూ అధ్యక్షుడే. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కూడా పీఆర్‌టీయూ నేపథ్యం నుంచి వచ్చిన వారే. నలుగురు అభ్యర్థులకూ పీఆర్‌టీయూ నేపథ్యం ఉండటంతో ఉపాధ్యాయులు మొగ్గు ఏటు? అనేది చర్చనీయాంశంగా మారింది. 2019 ఎన్నికల్లో మొత్తంగా 18,885 ఓట్లు పోలయ్యాయి. వీటిలో చెల్లని ఓట్లు పోగా 18,027 ఓట్లు లెక్కించారు. వీటిలో యూటీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన నర్సిరెడ్డికి 8,976ఓట్లు పోలవ్వగా, పీఆర్‌టీయూ అభ్యర్థిగా పోటీ చేసిన పూల రవీందర్‌కు 6,279 ఓట్లు వచ్చాయి. నర్సిరెడ్డికి మరో 38 ఓట్లు తక్కువ పడటంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో నర్సిరెడ్డి 9,021 ఓట్లు, పూల రవీందర్‌కు 6,292ఓట్లు పోలయ్యాయి. దీంతో 2,729ఓట్ల ఆధిక్యతతో నర్సిరెడ్డి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో పీఆర్‌టీయూ రెబల్ అభ్యర్థిగా బరిలో దిగిన సరోత్తమ్‌రెడ్డికి 1,883 ఓట్లు పోలయ్యాయి. పీఆర్‌టీయూ ఓట్లు భారీగా చీలటంతో యూటీఎఫ్‌కు లబ్ధిచేకూరిందని భావిస్తున్న పీఆర్‌టీయూ ఈసారి ఎమ్మెల్సీ సీటును దక్కించుకోవాలని పట్టుదలగా ఉంది. పీఆర్‌టీయూతో పాటు ఆ సంఘం చీలిక సంఘాల బాధ్యులు కూడా పోటీలో ఉండటంతో ఎన్నికలు ఉత్కంఠగా మారుతున్నాయి. బీజేపీ కూడా టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని సవాలుగా తీసుకుంటోంది. ఆ పార్టీ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు కీలక నేతలు ఈటల రాజేందర్, డీకే.అరుణ తదితరులు టీచర్ ఎమ్మెల్సీ కోసం ప్రచారం చేస్తున్నారు. ఇక రెండోసారి ఎమ్మెల్సీ సీటును దక్కించుకోవాలని యూటీఎఫ్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తుంది. సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని బరిలో దించింది. ప్రైవేటు విద్యాసంస్థల అధిపతి సుందరాజ్‌యాదవ్ కూడా పోటీలో ఉన్నారు.

బీసీల ఐక్యతకు సవాలుగా...

రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నప్పటికీ రాజకీయ వర్గాలను ఆకర్షిస్తోంది మాత్రం వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికనే. ఈనెల 2వ తేదీన వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించిన బీసీ గర్జన సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు మావే.. సీట్లు మావే అనే నినాదంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకుంటామని బీసీ సంఘం నేతలు ప్రకటనలు చేశారు. ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో 25,797 ఓట్లలో 20వేల ఓట్లు బీసీ ఉపాధ్యాయ ఓటర్లవే అని లెక్క కట్టారు. అయితే పోలింగ్ దగ్గర పడుతున్నకొద్దీ సంఘ నేతలు ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. బీసీ గర్జన సభలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రకటన చేయటం చర్చనీయాంశంగా మారింది. బీసీ జాక్ పేరుతో పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌తో పాటు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మద్దతు ఇస్తున్నారు. బీసీ సంఘాల మద్దతులో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వరంగల్‌లో భారీ బీసీ గర్జనకు ఏర్పాట్లు చేసిన సుందర్‌రాజ్‌యాదవ్‌కు మద్దతు కరువైంది. ఎక్కువ మంది బీసీ నేతలే పోటీలో ఉండటంతో ఓట్లు చీలి లక్ష్యం చెదిరిపోతుందనే ఆందోళన బీసీ వర్గాల్లో నెలకొంది. బీసీ నేతలంతా ఒక్కటిగా అభ్యర్థిని నిలిపితే రాజకీయాల్లో బీసీల ఐక్యత బలంగా కనిపించేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

తటస్థ వైఖరిలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్‌లు తటస్థ వైఖరిని అవలంభిస్తున్నాయి. ఆ పార్టీ మద్దతు దారులు పోటీలో ఉన్నా ఎవ్వరికీ మద్దతు ప్రకటించటం లేదు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి, టీచర్ జాక్ మద్దతుతో పోటీ చేస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్సీ బరిలో ఉన్నారు. అయితే కాంగ్రెస్ అభిమానులు మాత్రం పరోక్షంగా గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా పని చేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ నేత, మాజీ వరంగల్ కుడా చైర్మన్ సుందరాజ్‌యాదవ్ టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉండడగా.. గులాబీ పార్టీ పరోక్షంగా కూడా మద్దతు ఇవ్వటం లేదు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తెస్తున్న బీఆర్ఎస్ బీసీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని బీసీ సంఘాల నేతలు కోరుతున్నా గులాబీ అధిష్ఠానం ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో ఉపాధ్యాయ సంఘాలతో ఒక్క బీజేపీనే ప్రత్యక్షంగా ఎన్నికల్లో పాల్గొంటోంది.

20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎగ్గె మల్లేశం గత ఏడాదే కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా రియాజుల్ హాసన్ మజ్లిస్ నేత కాగా, మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్ నేతలు.తెలంగాణలో ఐదు స్థానాలతోపాటు ఏపీలో ఐదు స్థానాలకు కలిపి మార్చి 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు మార్చి 10 చివరి తేదీ. మార్చి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మార్చి 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. మార్చి 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. మార్చి 24వ తేదీలోపు ఎన్నికల ప్రక్రియ ముగించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా, రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్యేల సంఖ్యా బలాన్ని పరిశీలిస్తే.. ఈ ఎన్నికల్లో అధిక సీట్లు అధికార కాంగ్రెస్ దక్కించుకోనుంది. ఒక్క స్థానాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం కనబడుతోంది. తమ స్థానాన్ని తమకే ఇవ్వాలని మజ్లిస్ పట్టుబడితే... ఆ మేరకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందో? లేదో? వేచి చూడాల్సి ఉంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి అధికార పార్టీ అభ్యర్థులుగా పలువురి పేర్లు ఇప్పటికే ప్రచారంలో ఉన్నాయి. ఓసీ కేటగిరీ నుంచి జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, బండ్ల గణేశ్, కుసుమ్ కుమార్, కుమార్‌రావు, బీసీల నుంచి అంజన్ కుమార్ యాదవ్, చరణ్ కౌశిక్‌యాదవ్, ఎస్సీ కోటాలో సంపత్‌కుమార్, మైనార్టీ వర్గం నుంచి ఫిరోజ్‌ఖాన్, షబ్బీర్‌అలీ, అజ్మతుల్లా రేసులో ఉన్నారు. అయితే, 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలను కలుపుకొని బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. మరి పార్టీని వీడిన వారందరూ అధికార పార్టీకి మద్దతు ఇస్తారా? లేక తమ అసంతృప్తిని వెళ్లగక్కుతూ మళ్లీ సొంత పార్టీకి అండగా నిలుస్తారా? అన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఒక్క ఎమ్మెల్సీ స్థానానికే పరిమితం కాకుండా రెండో స్థానానికీ అభ్యర్థిని బరిలో నిలిపాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. ఈ మేరకు త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. పార్టీ నేతలతో సమావేశమై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ప్రాథమికంగా ఒక ఎమ్మెల్సీ స్థానంలో మాత్రం సత్యవతి రాథోడ్‌కు మళ్లీ అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది. బీసీ వాదంపై చర్చోపచర్చలు నడుస్తున్న వేళ బీసీ అభ్యర్థికైనా అవకాశం దక్కవచ్చన్న ప్రచారం జరుగుతోంది.

ముఖ్యమైన తేదీలు

ఎన్నికల నోటిఫికేషన్ జారీ: మార్చి 3
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ: మార్చి 10
నామినేషన్ల పరిశీలన: మార్చి 11 వరకు
నామినేషన్ల ఉపసంహరణ: మార్చి 13 వరకు
పోలింగ్: మార్చి 20.. అదే రోజు సాయంత్రం 5 తర్వాత ఓట్ల లెక్కింపు

తెలంగాణలో సైబర్ కేటుగాళ్ల హల్‌చల్

- 2024లో 62.5 లక్షలకు పైగా మాల్‌వేర్ ఘటనలు..సెక్యూరైట్ నివేదిక



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. తెలంగాణపైనా తమ ప్రతాపం చూపిస్తున్నారు. రాష్ట్రంలోని ఆస్పత్రులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల కంప్యూటర్లలో తమ మాల్‌వేర్‌ను చొప్పించి, కీలక సమాచారాన్ని తస్కరిస్తున్నారు. ఈ కేటుగాళ్ల బారిన పడ్డ వాటిల్లో తెలంగాణ ప్రభుత్వ పోర్టల్ (డేటా.తెలంగాణ.జీవీ.ఇన్), జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, ఉప ముఖ్యమంత్రి వెబ్‌సైట్ ఉండటం గమనార్హం. కొందరు సైబర్ నేరగాళ్లయితే కీలక సంస్థల కంప్యూటర్లలోకి ర్యాన్సమ్‌వేర్‌ను చొప్పించి, అడిగినంత ఇస్తారా? చస్తారా? అని బెదిరించి కంప్యూటర్లను హ్యాక్ చేసి, పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుకుంటున్నారు. ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ క్విక్ హీల్ టెక్నాలజీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ సెక్యూరైట్ గత ఏడాది (2024) జరిగిన సైబర్ నేరాలకు సంబంధించి 'తెలంగాణ సైబర్ థ్రెట్ రిపోర్ట్- 2025' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం గతేడాది తెలంగాణలో 62.5 లక్షల మాల్‌వేర్ ఘటనలు నమోదయ్యాయి. దేశం మొత్తం మీద నమోదైన మాల్‌వేర్ సంఘటనల్లో 23 % రాష్ట్రంలోనే నమోదు కావడం గమనార్హం.

30,000 వరకు కేసులు నమోదు

మన కంప్యూటర్లు లేదా మొబైల్ ఫోన్లలో మనకు తెలియకుండా ఏదో ఒక మాల్‌వేర్‌ను చొప్పించి మన సమాచారాన్ని కొల్లగొట్టడం, ఈ మధ్య సైబర్ నేరగాళ్లకు వెన్నతో పెట్టిన విద్యలా మారింది. ముఖ్యంగా ఆయా వ్యక్తుల ఆధార్, పాన్ నంబర్, మొబైల్ నంబర్లు కాజేసి వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడమూ పెరిగిపోయింది. గత ఏడాది తెలంగాణలో ఇలాంటి కేసులు 30,000 వరకు నమోదయ్యాయి. ఇందులో 11,125 అనధికారిక లావాదేవీల కేసులు. ఇక మీ కేవైసీ వివరాలు అప్‌డేట్ చేయండి అంటూ జరిగే సైబర్ మోసాలూ గత ఏడాది రాష్ట్రంలో 5,369 వరకు నమోదయ్యాయి. డిజిటల్ అరెస్టులు, పోలీసుల్లా బెదరించడం , కొరియర్ మోసాలూ 18,647 వరకు నమోదైనట్టు సెక్యూరైట్ నివేదిక పేర్కొంది.

ర్యాన్‌సమ్ కేసులూ ఎక్కువే

రాష్ట్రంలో ర్యాన్‌సమ్ కేసులూ పెరిగిపోయాయి. గత ఏడాది తెలంగాణలో రోజుకు సగటున 47 కేసుల చొప్పున ఏడాది మొత్తం మీద 17,505 ర్యాన్‌సమ్ సంఘటనలు నమోదయ్యాయి. కొన్ని ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ల ద్వారా కంప్యూటర్లు, లేదా మొబైల్ ఫోన్లను హ్యాక్ చేసి అడిగినంత దండుకోవడం పరిపాటిగా మారింది. ఐటీ, ఐటీ ఆధారిత సేవలు కంపెనీలు, తయారీ కంపెనీలు, అనేక విద్యా సంస్థలు ఇలాంటి సైబర్ నేరాల బారిన పడ్డాయి. ఇందులో నారాయణ గ్రూప్ ఆస్పత్రులు, విద్యా సంస్థలు, శివరాజ్ మెడికల్ కాలేజీ కూడా ఉండడం విశేషం.

రాహుల్ మాటిచ్చాడు కాబట్టే కులగణన

- నాడు రేవంత్‌ను రెడ్లే వ్యతిరేకించారు
- ఇప్పుడు ఆయన దగ్గర భజన చేస్తున్నారు
- నేను కేంద్ర మంత్రి కాకుండా అడ్డు పడ్డారు
- బీసీ మంత్రులకు మంచి శాఖలివ్వరా?
- రెడ్డి నేతల తీరుపైఅంజన్ కుమార్ ఫైర్



యాదవ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్

హైదరాబాద్ సిటీ, రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాటిచ్చాడు కాబట్టే రాష్ట్రంలో కులగణన సాధ్యమైంది. లేకుంటే.. సాధ్యమయ్యేది కాదు. గతంలో రెడ్లే రేవంత్‌రెడ్డిని వ్యతిరేకించారు. ఇప్పుడు వాళ్లే ఆయన చుట్టూ చేరి, భజన చేస్తున్నారు. రేవంత్ కష్టకాలంలో ఉన్నప్పుడు మనం(యాదవులు) అండగా నిలిచాం. అందుకే.. యాదవుల సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించారు" అని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. యాదవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆదర్శ్‌నగర్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన రెడ్డి సామాజిక వర్గంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. "నా ఎదుగుదలకు రెడ్డి సామాజిక వర్గం అడ్డుపడింది. కేంద్ర మంత్రి కావాల్సిన నన్ను.. కొందరు రెడ్డి నాయకులు కాళ్లు పట్టి గుంజారు" అని వ్యాఖ్యానించారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు రెండు రాజ్యసభ స్థానాలు చాలా? అని ప్రశ్నించారు. "వాళ్ల(రెడ్ల) ఎంత మంది ఉన్నరు..? ఎందరు మంత్రుల య్యింద్రు..? మనకు మంత్రి పదవులిస్తే.. గొర్లు, బర్ల శాఖలిస్తరు. రెవెన్యూ, ఫైనాన్స్ వంటి పవర్‌ఫుల్ మినిస్ట్రీలు ఒక్కటీ ఇవ్వలేదు. నేను సికింద్రాబాద్ ఎంపీ సీటు అడిగితే.. ఓడిపోయిన వాళ్లకు ఇవ్వొద్దని పార్టీ నిర్ణయం తీసుకుందన్నరు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోతే ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారు..? చేవేళ్ల, నల్లగొండ, సికింద్రాబాద్ టికెట్లు రెడ్లకు ఇయ్యలేదా..? బయట పార్టీలోకి వెళ్లిన దానం నాగేందర్ ఇంటికి వెళ్లి టికెట్ ఇచ్చారు. నాకు అవకాశమిస్తే రెండు లక్షల మెజార్టీతో గెలిచేవాడిని" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కులగణనను విజయవంతం చేయడానికి కారణమైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ పటాలకు పాలాభిషేకం చేశారు.

ఎవరినీ ఎదగనివ్వలేదు

తాను ఎవరి మెప్పుకోసమో మాట్లాడడం లేదని, ఒక నాయకుడు అనిల్‌యాదవ్‌కు రాజ్యసభ ఇచ్చామని చెబుతున్నాడని, ఉమ్మడి రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ ఎన్నికయ్యాడని గుర్తుచేశారు. "ఈ నాయకులు(రెడ్లు) ఎవరినైనా ఎదగనిచ్చారా? ఆలుమగలు, తండ్రీకొడుకులు 20 ఏళ్లుగా పదవులను అనుభవిస్తున్నారు(రెడ్లనుద్దేశించి). బీసీలను మాత్రం అణగదొక్కుతున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నానని, ఆ పదవి రాకుండా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, ఇతర భజనపరులైన రెడ్లు అడ్డుకున్నారని ఆరోపించారు. లాలూప్రసాద్ యాదవ్ సోనియాగాంధీకి విషయం చెప్పి, తనకు ఈ పదవినిప్పించారన్నారు.

రాముడిని మీకు రాసిచ్చారా..?

బీసీ నాయకులను బీజేపీ కూడా ఎదగనివ్వదని, బిహార్‌లో తేజస్వియాదవ్, యూపీలో అఖిలేశ్‌యాదవ్‌ను సీఎం కాకుండా చేశారని అంజన్ ఆరోపించారు. "హైదరాబాద్ విషయం రాగానే హిందూ-ముస్లిం కొట్లాటలు పెడ్తరు. భారత్‌మాత అంటరు. మేం పాకిస్తాన్ మాత అంటున్నమా? భారత్‌మాత, రాముడిని మీకు పట్టా రాసిచ్చినరా?" అని బీజేపీపై మండిపడ్డారు.

పోలీసు కస్టడీకి వంశీ

- విజయవాడ కోర్టు 3 రోజుల అనుమతి
- నేడు కస్టడీకి తీసుకోనున్న పోలీసులు
- సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో విచారణ



విజయవాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడు ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించి, కేసు నుంచి తప్పుకొనేలా చేశారన్న ఆరోపణలతో వంశీతో పాటు మరో నలుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ఆయనను పది రోజుల కస్టడీకి ఇవ్వాలని విజయవాడ పటమట పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయాధికారి హిమబిందు సోమవారం తీర్పును వెలువరించారు. మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారించాలని తీర్పులో స్పష్టం చేశారు. విజయవాడలోని జిల్లా జైలు నుంచి తీసుకెళ్లేటప్పుడు, తిరిగి జైలుకు తీసుకొచ్చేటప్పుడు ఆయనకు వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. విచారణ సమయంలో మూడు నుంచి నాలుగు సార్లు ఐదు నుంచి పది నిమిషాల పాటు న్యాయవాదులతో మాట్లాడుకునే అవకాశం కల్పించారు. పోలీసులు మంగళవారం ఉదయం వంశీని కస్టడీకి తీసుకుంటారు. వల్లభనేని వంశీపై సీఐడీ పోలీసులు కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం పీటీ వారెంట్ దాఖలు చేశారు. మరోవైపు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరో ముగ్గురు నిందితులను సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు.

జైలులో వంశీకి వసతులు

విజయవాడ జిల్లా జైలులో ఉన్న వల్లభనేని వంశీకి నిద్రించడానికి మంచం, కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెస్ట్రన్ కమోడ్ ఉన్న బాత్‌రూం కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఇంటి నుంచి భోజనం, ఫర్నీచర్ సమకూర్చుకునేందుకు నిరాకరించింది.

వంశీ అక్రమాలపై సిట్

- ఐజీ అశోక్ నేతృత్వంలో ఏర్పాటు
- సభ్యులుగా తూర్పు, ఏలూరు ఎస్పీలు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు గన్నవరం వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేసిన అరాచకాలపై విచారణకు ఐజీ ర్యాంకు అధికారి జీవీజీ అశోక్ కుమార్(ఏలూరు రేంజ్) నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల ఎస్పీలు నరసింహ కిశోర్, ప్రతాప్ శివకిశోర్‌తో కూడిన ఐపీఎస్ అధికారుల బృందం (సిట్) వంశీ దోపిడీని వెలికి తీయబోతోంది. మట్టి, ఇసుక ఇతర అక్రమ మైనింగ్ ద్వారా ప్రభుత్వానికి రూ. 195 కోట్లు మేర వంశీ నష్టం చేకూర్చినట్లు ఇప్పటికే విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా సిట్ ఏర్పాటు చేసింది. దర్యాప్తులో సహకారం, అవసరం నిమిత్తం డీజీపీ ఎవరినైనా సిట్‌లోకి సిఫారసు చేస్తే తీసుకోవాలని ఆదేశించింది. ఇప్పటికే విజిలెన్స్ గుర్తించిన వంశీ అక్రమాల్లో కొన్నింటిని పరిశీలిస్తే.. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జిల్లాలో ఇష్టారాజ్యంగా కొండలను తవ్వేశారు. పానకాల చెరువు నుంచి అక్రమంగా 100 కోట్ల విలువైన మట్టిని అనుచరులతో తవ్వించి దోచేశారు. ఇలా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. విజిలెన్స్ వెలికితీసిన వీటితో పాటు బెదిరింపులు, ఇతర అరాచకాలు నిగ్గు తేల్చే బాధ్యత ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. సిట్‌కు అవసరమైన అన్ని సహకారాలు ప్రభుత్వ శాఖలు అందించాలని ఆదేశించింది.

విస్తీర్ణంలో తేడాలున్నా భరోసా ఆపొద్దు!

- ఈసారికి ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం
- వర్షాకాలం సాయం అందే నాటికి పాస్‌బుక్‌ల సవరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలకో, ఇతర అవసరాలకో రైతుల్లో కొందరు లేని భూమిని ఉన్నట్లుగా చూపిన పాస్‌బుక్‌లను ప్రక్షాళన చేసే పనిలో పడింది ప్రభుత్వం. ప్రభుత్వం! వీటిపై ఇప్పటికే సేకరించిన వివరాల ఆధారంగా, సేత్వార్ రికార్డుల కన్నా 1.5 లక్షల ఎకరాల మేర అదనపు విస్తర్ణం పాస్‌బుక్కుల్లో నమోదైందని గుర్తించింది. ఇలా అసలు భూములతో పాటు లేని భూములు కూడా ఉన్న రైతులకు మొత్తంగా పెట్టుబడి సాయం నిలిచిపోయింది. ఉదాహరణకు ఐదెకరాలున్న ఓ రైతుకు పాస్‌బుక్కులో అదనంగా లేని భూమి రెండెకరాలు నమోదైతే ఉన్న ఆ ఐదెకరాలకూ సాయం నిలిచిపోయింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 9.5 లక్షల ఎకరాలకు రైతుభరోసా నిలిచిపోయింది. దీనిపై రైతుల్లో ఆందోళన నెలకొంది. ఫలితంగా రైతు కమిషన్‌కు ఫిర్యాదులు రావడం, కమిషన్ ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో ఈ దఫా ఎవరికి రైతు భరోసా ఆపకుండా అందరికీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వర్షాకాలం పంటకు పెట్టుబడి సాయం ప్రకటించేలోపు ఆర్ఎస్ఆర్ (రీ సెటిల్‌మెంట్ సర్వే రికార్డు) ప్రకారం సవరణ చేయాలని సూచించింది. క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి సంబంధించి 45శాతం పాస్‌బుక్కుల్లో పొంతన ఉండదని భూచట్టాల నిపుణుడు భూమి సునీల్ పేర్కొన్నారు. సరిదిద్దాల్సిన రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే సమస్య జటిలంగా మారింది. కొత్త చట్టం అమల్లోకి వస్తే ఈ తరహా ఇబ్బందులు తలనొప్పిగా మారతాయనే వాదనలు కూడా ఉన్నాయి.

కృష్ణాజలాలపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

- సత్వర పరిష్కారం చూపాలన్న మంత్రి తుమ్మల

ఏన్కూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాల పంపకాలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సత్వర పరిష్కారం చూపాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు హిమాంనగర్ సమీపంలో గ్యాస్ పైప్‌లైన్ వద్ద జరుగుతున్న రాజీవ్ లిఫ్ట్ కెనాల్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. రాజీవ్ లిఫ్ట్ కెనాల్‌తో వైరా, మధిర, సత్తుపల్లి ప్రాంతాలకు సాగు నీటి ఇబ్బంది తొలగుతుందన్నారు. నాగార్జునసాగర్ కాల్వలకు గోదావరి జలాలను అనుసంధానం చేయడం ద్వారా ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో ఆంధ్రప్రదేశ్ నీటిని ఎక్కువగా వినియోగిస్తుండటంతో తెలంగాణకు నష్టం జరుగుతోందన్నారు. రాష్ట్ర రైతులు నష్టపోకముందే కేంద్ర ప్రభుత్వం నీటి పంపకాలు తేల్చి నీటిని విడుదల చేయాలని తుమ్మల కోరారు.

ఏప్రిల్‌లో కాళేశ్వరం కమిషన్ నివేదిక!

- తుది దశకు విచారణ.. 27 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ నివేదిక ఏప్రిల్‌లో ప్రభుత్వానికి అందే అవకాశాలున్నాయి. ఇప్పటికే విచారణ ప్రక్రియ తుది దశకు చేరింది. వాస్తవానికి ఈ దఫా కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో కీలక పాత్రధారులను విచారించాలని కమిషన్ తొలుత యోచించింది. అయితే విచారణలో పలువురు కీలక ఇంజనీరింగ్ అధికారులు వాస్తవ విరుద్ధంగా సమాచారం ఇచ్చినట్లు గుర్తించింది. రికార్డుల్లో వివరాలు ఒకలా ఉంటే... వీరంతా మరోలా సమాచారంఇచ్చారని కమిషన్ భావిస్తోంది. రికార్డులను పరిశీలించే క్రమంలో వీరి పాత్రపై మరిన్ని ఆధారాలు లభించినట్లు సమాచారం. దాంతో కీలక అధికారులను మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్‌కు కమిషన్ పిలవనుంది. 27 నుంచి తదుపరి విచారణ జరపనుంది. తొలిరోజు ఇద్దరు మాజీ అధికారులు సహా ఒక కీలక అధికారిని విచారించే అవకాశాలున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సీపీఎస్ మద్దతు



మంత్రి శ్రీధర్‌బాబుకు మద్దతు లేఖను అందజేస్తున్న సీపీఎస్ ప్రతినిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ తెలిపారు. ఈ మేరకు సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి మద్దతు లేఖను అందజేశారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి స్థితప్రజ్ఞ విజ్ఞప్తి చేశారు. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని మంత్రి హామీనిచ్చారు. 60 వేల ఓట్లున్న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల సభ్యులంతా ఓటింగ్‌లో పాల్గొనాలని ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు.

మెదక్-ఎల్లారెడ్డి రహదారి విస్తరణకు.. వన్య ప్రాణుల సంరక్షణ బోర్డు ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : పోచారం వన్యప్రాణుల అభయారణ్యం మీదుగా వెళ్తున్న మెదక్-ఎల్లారెడ్డి రహదారి విస్తరణను వన్య ప్రాణుల సంరక్షణ బోర్డు ఆమోదించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు 8వ సమావేశం సోమవారం జరిగింది. ఇందులో పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. నాగార్జున సాగర్ డివిజన్‌లోని పెద్దగుట్టలో ములుగు 11 కేవీ సబ్‌స్టేషన్, ఎత్తిపోతల పథకం నిర్మాణానికి బోర్డు ఆమోదం తెలిపింది. రక్షిత అటవీ ప్రాంతాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్లు వేయడానికి ప్రతిపాదనలపై బోర్డు సమావేశంలో చర్చించారు.

జూన్ 6న టీజీ లాసెట్, పీజీ లాసెట్

మూడేళ్ల బీఎల్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం టీజీ లాసెట్, పీజీ లాసెట్ పరీక్షలను జూన్ 6న నిర్వహించనున్నట్లు కన్వీనర్ విజయలక్ష్మి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆలస్య రుసుము లేకుండా మార్చి 1వరకు, ఆలస్య రుసుముతో మే 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. జూన్ 6న లాసెట్ పరీక్ష తొలి సెషన్ ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, పీజీ లాసెట్ పరీక్షలు సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జూన్ 25లోగా ఫలితాలను వెల్లడిస్తామన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత సివిల్స్ కోచింగ్

- ఎల్వీ సుబ్రహ్మణ్యం, జ్వాలా నరసింహారావు వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సాధికారత, విద్య, ఉపాధి అవకాశాల లక్ష్యంగా బ్రాహ్మణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మాజీ సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు తెలిపారు. ఈ కేంద్రం కార్యాచరణ, విధివిధానాలపై సోమవారం శ్రీనగర్ కాలనీలోని ఆయన నివాసంలో సమావేశం నిర్వహించారు. అనంరం ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణ విద్యార్థుల్లోని ప్రతిభావంతులకు ప్రముఖ కోచింగ్ సెంటర్లలో సివిల్స్ సర్వీసెస్ పరీక్షలకు పూర్తి ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని ప్రకటించారు.

ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

- విద్యార్థులు తమ కాలేజీల నుంచి పొందవచ్చు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం విడుదల చేశారు. విద్యార్థులందరి హాల్ టికెట్లను కళాశాలల లాగిన్‌లకు అప్‌లోడ్ చేశామని, విద్యార్థులు తమ కాలేజీల నుంచి పొందవచ్చని ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో విద్యార్థులకు వ్యక్తిగతంగానూ పంపిస్తామన్నారు. హాల్ టికెట్లలో ఏమైనా తేడాలుంటే వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

మీ కాళ్లు పట్టుకున్నందుకేనా?

(మొదటిపేజీ తరువాయి)

పట్టుకున్నందునే వారిని అమెరికా నుంచి రప్పించడంలేదు" అని సీఎం ఆరోపించారు. బండి సంజయ్ ఇప్పటికైనా ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును తెచ్చి తమకు అప్పగించాలన్నారు. ఈ కేసులో జైలుకు పంపించిన రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావుకు పది నెలల తర్వాతే బెయిల్ వచ్చిందని గుర్తు చేశారు. హరీశ్‌రావు కోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఫార్ములా ఈ-కార్ రేసులో ఫైళ్లన్నీ తీసుకెళ్లిన ఈడీ అధికారులు.. కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం పాల్గొని మాట్లాడారు. "ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఢిల్లీ వెళ్లని బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ ఇప్పుడెందుకు వెళ్తున్నారో, కేంద్ర మంత్రులను ఎందుకు కలుస్తున్నారో అర్థం కావడంలేదా? కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన కేటీఆర్ రాష్ట్రానికి చిల్లిగవ్వయినా తెచ్చారా? తెలంగాణకు నిధులు కావాలంటే మాతో కలిసి రావాలి కదా! మీరిద్దరూ చీకట్లో కలిసేది ఎందుకు? బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చీకట్లో ఒప్పందాలు చేసుకునేందుకే కలుస్తున్నారు" అని రేవంత్ ఆరోపించారు. రాష్ట్రానికి నిధుల కోసం తాము రోజూ పోరాడుతున్నామని, నిధులెలా తేవాలో తమకు తెలుసన్నారు.

ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం..

తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, కుట్రలు, కుతంత్రాలు చేసి బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చొని కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను నిలపలేదని, మరి పట్టభద్రులైన కేసీఆర్, కేటీఆర్, కవిత ఎవరికి ఓటేస్తారని ప్రశ్నించారు. పైగా అభ్యర్థిని నిలబెట్టని పార్టీ.. ఎవరికి ఓటు వేయాలో ఎలా చెబుతుందని నిలదీశారు. పోటీ చేయడానికి ఆ పార్టీకి అభ్యర్థులే లేరని ఎద్దేవా చేశారు. పోటీ ఎందుకు చేయడంలేదని, పోటీ చేయని పార్టీకి రాజకీయ పార్టీ అని చెప్పుకొనే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 8 సీట్లలో డిపాజిట్లు కోల్పోతే, అవే సీట్లలో బీజేపీ ఎలా గెలిచిందో ప్రజలకు అర్థం కాదా? అని అన్నారు. పది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదంటున్న బీఆర్ఎస్ నేతలు.. పదేళ్లలో వారేం చేశారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజులకే పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయని, దీంతో ఎన్నికల కోడ్ కారణంగా తమకు 8 నుంచి 9 నెలలు మాత్రమే పరిపాలన చేసే అవకాశం వచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగుల సమస్య పరిష్కారం కాలేదని, తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన పట్టభద్రులకే ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఉద్యోగాల భర్తీ చేపట్టినట్టు పేర్కొన్నారు. 10 నెలల కాలంలోనే 55,163 ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. కొత్తగా 17వేల మంది టీచర్లను నియమించామని, 35 వేల మందికి పదోన్నతులు కల్పించామని, 22 వేల మందిని బదిలీ చేశామన్నారు. భార్యాభర్తలు ఒకేచోట పనిచేసే అవకాశం కల్పించామన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులకు.. ప్రతి నెలా రూ.6500కోట్లు వాయిదాలుగా చెల్లిస్తున్నామని తెలిపారు.



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తదితరులు

బీజేపీ జనగణన ఎందుకు చేయలేదు?

"బీసీ కులగణనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆకాశమంత ఎగిరి దూకుతున్నాడు. తామే బడా బీసీలమని బండి సంజయ్, మోదీ చెబుతున్నారు. అయితే దేశంలో 2021లో బీజేపీ ప్రభుత్వం జనగణన ఎందుకు చేపట్టలేదు?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. వందేళ్లలో బీసీ కులగణన చేయలేదని, తమ ప్రభుత్వ హయాంలో నెలరోజుల్లోనే చేపట్టి ప్రజల ముందు లెక్కలు పెట్టామని అన్నారు. ప్రభుత్వం కులగణన చేపడితే బీజేపీ నేతలు మాత్రం కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేంద్రం జనగణనతో పాటే కులగణన చేసి.. తాము చేసిన కులగణన లెక్కలు తప్పని తేలిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు.మైనారిటీలను బీసీల్లో ఎలా కలుపుతారని బండి సంజయ్ ప్రశ్నిస్తున్నారని, కానీ.. 1960 నుంచే మైనారిటీలు బీసీ రిజర్వేషన్లు పొందుతున్నారని సీఎం తెలిపారు. గుజరాత్‌లో 29 ముస్లిం కులాలు బీసీ రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయని, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్‌లోనూ ముస్లింలు బీసీ రిజర్వేషన్ పొందుతున్నారని పేర్కొన్నారు. అవసరమైతే ఆ రాష్ట్రాలకు నిజనిర్ధారణ కమిటీని పంపిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల నుంచి కొట్లాడుతున్నారని సీఎం తెలిపారు. మందకృష్ణ మాదిగకు ప్రధాని మోదీ ముద్దు పెట్టారు తప్ప.. ఎస్సీ వర్గీకరణ లెక్క తేల్చలేదని విమర్శించారు. తాము ఎస్సీ వర్గీకరణకు చట్టం చేశామని గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్వే విస్తరణకు అడ్డు పడింది.. అనుమతి ఇవ్వవద్దన్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డేనని ఆరోపించారు. మూసీ ప్రక్షాళనకు, రీజినల్ రింగ్ రోడ్డుకు అనుమతులు రాకుండా, నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నదీ ఆయనేనన్నారు. రాష్ట్రానికి నిధులు తీసుకురాని దద్దమ్మ కిషన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. తెలంగాణ నుంచి ఇద్దరికి(కిషన్‌రెడ్డి, సంజయ్‌కు) మాత్రమే ఉద్యోగాలిచ్చిన బీజేపీకి ఓట్లడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. ఆ పార్టీని బండకేసి కొడితే మెట్రో, మూసీ, ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టులు ముందుకు సాగుతాయన్నారు. పట్టభద్రులు బీజేపీని బొంద పెట్టాలని, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఒకటో తేదీనే జీతాలిస్తున్నాం..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒకటో తేదీనే ఉద్యోగుల వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, రాష్ట్రంలోని 65ఐటీఐలను రూ.2400కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాను సీఎంగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క రోజైనా సెలవు తీసుకోలేదని, హామీల అమలు కోసం పని చేస్తున్నానని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉద్యోగాలివ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. రేవంత్ అగ్రవర్ణానికి చెందిన వ్యక్తిఅయి ఉండీ.. రిజర్వేషన్ల విషయంలో బీసీలకు మద్దతివ్వడం గొప్పవిషయమన్నారు.

అప్పుడు ఉప ఎన్నికలు వచ్చాయా?

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ అసెంబ్లీకి రారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ పెట్టరని, కానీ.. ఉప ఎన్నికల్లో మాత్రం తడాఖా చూపిస్తానంటూ ప్రకటనలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. "పదేళ్లలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలను చేర్చుకుంటే ఉప ఎన్నికలు వచ్చాయా? ఇప్పుడెందుకు వస్తాయి? అప్పుడున్న స్పీకర్లు, కోర్టులే ఇప్పుడూ ఉన్నాయి కదా!" అని సీఎం అన్నారు. పార్టీలు మారిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను, సబితా ఇంద్రారెడ్డిని మంత్రులను చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు ఇక మిగిలింది గతమేనని, భవిష్యత్తు లేదని అన్నారు.

ఎల్ఆర్ఎస్ పోర్టల్ అనుసంధానం

- నేటి నుంచి ఫీజులు చెల్లించేలా అందుబాటులోకి సాఫ్ట్‌వేర్
- డీడీ తప్ప ఆన్‌లైన్, యూపీఐ చెల్లింపులకు అనుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ద్వారా ఆదాయాన్ని రాబట్టుకోవాలని చూస్తున్న ప్రభుత్వం ఆ దిశగా వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకుంటే 25 శాతం రాయితీ, కనీసం 10శాతం రిజిస్ట్రేషన్లతో మిగిలిన ప్లాట్లు కలిగిన లేఅవుట్లకు రిజిస్ట్రేషన్‌కు అనుమతినిస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధీనంలో ఉన్న ఎల్ఆర్ఎస్ పోర్టల్‌ను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానం చేశారు. సోమవారం సాయంత్రం నుంచి ఎల్ఆర్ఎస్ వివరాలు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు అందుబాటులోకి వస్తాయని డీటీసీపీ దేవేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. లేఅవుట్లు, అమ్ముడవ్వని ప్లాట్ల వివరాలు అన్ని రిజిస్ట్రేషన్ శాఖకు అనుసందానించారు. మంగళవారం నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి కూడా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు చెల్లించాల్సిన ఫీజును డీడీ తప్ప మిగిలిన అన్ని మార్గాల ద్వారా చెల్లించేందుకు అవకాశం ఉందని డీటీసీపీ తెలిపారు. డీడీలు తీస్తే ఒకే డీడీని పది దరఖాస్తులకు జత చేసే అకాశం ఉంటుందని, ఆ పొరపాటుకు తావు లేకుండా ఆన్‌లైన్ బ్యాంకింగ్, గూగుల్ పే, ఫోన్ పే, ఇతర యూపీఐ పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లింపులకు అవకాశం కల్పించారు. కాగా 2020లో రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి దాదాపు 25.68 లక్షల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఫీజు పరిధిలోకి ఎన్ని వస్తాయనేదానిపై లెక్కలు తీస్తున్నామని డీటీసీ దేవేందర్ రెడ్డి తెలిపారు.

ఆ సర్వే నంబర్ల వివరాలు పంపండి

లేఅవుట్ల క్రమబద్ధీకరణ నిబంధనల్లో సడలింపులపై మరింత స్పష్టతనిస్తూ పురపాలక శాఖ రెండో మెమో జారీ చేసింది. మునిసిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీల వీసీలు, జీహెచ్ఎంసీ కమిషనర్, డీటీసీపీవోలు తమ పరిధిలో ఉండే నీటి వనరులు, సరస్సులకు 200 మీటర్ల పరిధిలో ఉండే భూముల సర్వే నంబర్లు, ప్రభుత్వ భూములకు ఆనుకొని ఉన్న సర్వే నంబర్ల వివరాలను జీసీసీకి పంపాలని ఆదేశించింది. ఈ రెండు కేటగిరీల్లో లేని దరఖాస్తులను పంచాయతీ రాజ్, పురపాలక శాఖ అధికారులు పరిశీలిస్తారని స్పష్టం చేసింది. ఆయా భూములకు ఆటోమేటిక్‌గా ఫీజు జనరేట్ అవుతుందని, వారికి మార్చి 31 వరకు 25 శాతం ఫీజు రాయితీ వర్తిస్తుందని తెలిపింది.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో క్వీన్స్‌లాండ్ మంత్రి రోస్‌బేట్స్

కీలక ఖనిజాల మైనింగ్‌లో క్వీన్స్‌లాండ్ సహకారం

- ఇరు రాష్ట్రాల మధ్య నోడల్ ఏజెన్సీగా సింగరేణి: భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో కీలక ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) మైనింగ్‌లో తెలంగాణ ప్రధాన భూమిక పోషించనుందని.. ఖనిజాల సాంకేతికత, మైనింగ్ రంగంలో పరస్పర సహకారానికి క్వీన్స్‌లాండ్ (ఆస్ట్రేలియా) ప్రభుత్వాన్ని భాగస్వామ్యం చేసుకుంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. సోమవారం సింగరేణిభవన్‌లో భట్టితో క్వీన్స్‌లాండ్ మంత్రి రోస్‌బేట్స్ భేటీ అయ్యారు. రాష్ట్రంతో పాటు దేశంలో విద్యుత్తు వాహనాలు, సౌర విద్యుత్తు, బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్‌కు డిమాండ్ ఉందని.. ఈ రంగంలో అవసరమైన వెనాడియం, కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 కీలక ఖనిజాలను విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామని భట్టి అన్నారు. అయితే వీటి లభ్యత క్వీన్స్‌లాండ్‌లో అధికంగా ఉన్నందున వీటి ఉత్పత్తి, విక్రయం, పరస్పర లబ్ధి చేకూరే అంశంపై అవగాహనకు వచ్చామని తెలిపారు. 2029-30 నాటికి రాష్ట్రంలో 20 వేల మెగా వాట్ల సామర్థ్యం కలిగిన గ్రీన్ ఎనర్జీ లక్ష్యాన్ని సాధించడం ద్వారా దేశంలో ఆదర్శంగా నిలిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇందుకు క్వీన్స్‌లాండ్ సహకారం తీసుకుంటామన్నారు. క్వీన్స్‌లాండ్, తెలంగాణ మధ్య సంయుక్త మైనింగ్, ఖనిజ వ్యాపారానికి సింగరేణి సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమిస్తున్నామన్నారు. త్వరలోనే అధ్యయనం కోసం సింగరేణి నుంచి ఒక బృందాన్ని క్వీన్స్‌లాండ్‌కు పంపుతామని తెలిపారు. మైనింగ్ రంగంలో అపార అనుభవం కలిగిన సింగరేణితో ఇప్పటికే తమకు సంబంధాలున్నాయని క్వీన్స్‌లాండ్ మంత్రి రోస్‌బేట్స్ అన్నారు. రానున్న మార్చిలో క్వీన్స్‌లాండ్‌లో జరిగే వ్యాపార సదస్సుకు హాజరుకావాలని భట్టిని ఆహ్వానించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరాంతో పాటు క్వీన్స్‌లాండ్ అధికారులు పాల్గొన్నారు.

సాగుకు ప్రత్యేక నిధులు కేటాయించండి..

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని భట్టిని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కోరారు. కూరగాయలు, పండ్లు, పూల తోటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు ఉపాధి హామీని అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో 'ఆమ్జెన్' భారీ పెట్టుబడులు

రూ. 1600 కోట్లతో విస్తరిస్తామన్న కంపెనీ సీఈవో.. బయో ఏషియాకు ముందు రోజు ప్రకటన

- టెక్నాలజీ, ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్
- బయోటెక్ హబ్‌గా హైదరాబాద్ పేరు మరింత బలోపేతం
- ట్రిలియన్ డాలర్ల జీడీపీ దిశగా అడుగులు: రేవంత్‌రెడ్డి



ఆమ్జెన్ సీఈవో బ్రాడ్‌వేకు జ్ఞాపికను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అమెరికా కేంద్రంగా.. ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల్లో విస్తరించిన ప్రముఖ అంతర్జాతీయ దిగ్గజ ఔషధ తయారీ సంస్థ ఆమ్జెన్.. తెలంగాణలో మరింత విస్తరించనుంది. క్యాన్సర్, గుండె జబ్బులు, బోలు ఎముకల వ్యాధి, ఇన్‌ఫ్లమేటరీ, ఇతర అరుదైన వ్యాధుల చికిత్సకు అవసరమయ్యే ఔషధాలను ఈ కంపెనీ ఉత్పత్తి చేస్తూ.. ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేస్తోంది. భారత్‌లో ముంబై, హైదరాబాద్‌లో ఇప్పటికే ఈ కంపెనీకి కార్యాలయాలుండగా.. హైటెక్‌సిటీలో కొత్తగా అంతర్జాతీయ టెక్నాలజీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని నెలకొల్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆమ్జెన్ చైర్మన్, సీఈవో రాబర్ట్.ఎ.బ్రాడ్‌వే సోమవారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ భారీ విస్తరణ ప్రణాళికలను బ్రాడ్‌వే ప్రకటించారు. "ఔషధాల శ్రేణిని మరింత సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్లో ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పాం. ఏఐ, డేటా సైన్స్, డిజిటల్ సామర్థ్యాలతో ఇన్నోవేషన్ సైట్‌గా దీన్ని అభివృద్ధి చేస్తాం. ఈ ఏడాది చివరికల్లా రూ.1600 కోట్ల(200 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెడతాం" అని వివరించారు. సమీప భవిష్యత్‌లో మరిన్ని విస్తరణ ప్రణాళికలున్నాయని, తెలంగాణలో పెట్టుబడులకు ప్రాధాన్యత నిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బయోఏషియా సదస్సుకు ముందు రోజే.. ఆమ్జెన్ భారీ పెట్టుబడులను ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఆమ్జెన్ విస్తరణతో హైదరాబాద్ నగరం బయోటెక్ హబ్‌గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందన్నారు. గత ఏడాది ఆగస్టులో అమెరికా పర్యటన సందర్భంగా ఆమ్జెన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లోనే రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానించానని, ఇప్పుడు హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ కేంద్రాన్ని నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. "లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయో-టెక్ రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉంది. ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. అభివృద్ధి, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలతో వచ్చే పరిశ్రమలకు మా ప్రభుత్వం సహకరిస్తుంది" అని వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. త్వరలో హైదరాబాద్ నగరం ప్రపంచ బయోటెక్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏఐసిటీలో పెట్టుబడులు పెట్టండి: శ్రీధర్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఏఐ సిటీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్ట్రేలియా-క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను కోరారు. క్వీన్స్ లాండ్ రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ మంత్రి రాసిన్ బేట్స్ ఆధ్వర్యంలోని బృందం సోమవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-క్వీన్స్‌లాండ్' మధ్య ప్రాధాన్య రంగాల్లో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు శ్రీధర్ బాబు తెలిపారు. త్వరలో రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే లైఫ్ సైన్సెస్ విశ్వవిద్యాలయం గురించి ప్రత్యేకంగా వివరించామన్నారు. జీవ విజ్ఞానం, ఔషధ తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ప్రతినిధుల బృందం ఆసక్తి వ్యక్తంచేసిందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న క్రీడలు-నైపుణ్య విశ్వ విద్యాలయానికి సహకరిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్య, పరిశోధన, అభివృద్ధి, వ్యవసాయం తదితర అంశాల్లో క్వీన్స్‌లాండ్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో క్వీన్స్ లాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సీఈవో జస్టిన్ మెక్ గవాన్, బెంగళూరులోని ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్ గెచీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై రాజీ మార్గం!

(మొదటిపేజీ తరువాయి)

అతుల్ జైన్ అధ్యక్షతన సోమవారం అత్యవసర ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, సాగర్ ఈఈ శ్రీధర్, ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు హాజరయ్యారు. ఇప్పటికే పరిమితికి వించి నీటిని తరలించినందున...తదుపరి నీటిని ఏపీ తరలించకుండా అడ్డుకోవాలని తెలంగాణ అధికారులు కోరారు. రానున్న మే 31వ తేదీ దాకా కల్వకుర్తి, నాగార్జునసాగర్ ఎడమకాలువ, ఏఎమ్మార్పీ కింద 90 టీఎంసీలు, తాగునీటి అవసరాల కోసం 17 టీఎంసీలు కలుపుకొని 107 టీఎంసీలు తమకు కేటాయించాలని, జూన్ 1 నుంచి జూలై 31వరకు తాగునీటి అవసరాల కోసం 9 టీఎంసీలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద 6.38 లక్షల ఎకరాలు, కల్వకుర్తి కింద 2.80 లక్షల ఎకరాలు, ఏఎమ్మార్పీ/ఎస్ఎల్‌బీసీ కింద 2.39 లక్షల ఎకరాలు సాగు అవుతున్నాయని, ఈ తరుణంలో నీరు విడుదల చేయకుంటే ఇబ్బందులు ఏర్పడుతాయని నివేదించారు. అయితే, తమ రాష్ట్రంలోనూ సాగు నీటి అవసరం భారీగానే ఉందని ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. అయితే, సాగర్‌లో నీటి లభ్యత ఆధారంగా కుడి, ఎడమ కాలువల నీటి అవసరాలను తేల్చడానికి నల్లగొండ సీఈ, నాగార్జునసాగర్ రైట్ మెయిన్ కెనాల్ సీఈతో ఓ కమిటీని వేస్తూ కృష్ణాబోర్డు నిర్ణయం తీసుకుంది. ఇద్దరు సీఈలు మంగళవారం నల్లగొండలో సమావేశమై.. రెండు రాష్ట్రాల్లోనూ ఏ మేరకు సాగు నీటి అవసరం ఉంది? అనే అంశంపై పరస్పరం చర్చించుకొని, నివేదికను బోర్డుకు సమర్పించనున్నారు. ఈనెల 27న జరగనున్న సమావేశంలో తెలుగు రాష్ట్రాల విజ్ఞప్తులపై చర్చించి, నీటి విడుదలకు ఉత్తర్వులు ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది.


ముగ్గురు పిల్లలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ, వైద్యులు

పెళ్లైన ఏడేళ్లకు గర్భం.. ఒకే కాన్పులో ముగ్గురికి జన్మనిచ్చిన తల్లి

గజ్వేల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు ఓ మహిళ జన్మనిచ్చింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగింది. ములుగు మండలం అడవిమజీద్‌కు చెందిన నాగరత్న-నర్సింహులుకు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి పిల్లలు కాకపోవడంతో అనేక ఆస్పత్రులకు వెళ్లారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందగా నాగరత్న గర్భం దాల్చింది. తొమ్మిది నెలలుగా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో నొప్పులు రావడంతో ఆదివారం నాగరత్నను ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమె ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఇద్దరు మగ, ఒక ఆడపిల్ల జన్మించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ తెలిపారు. తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారని చెప్పారు.

పౌల్ట్రీ ఫామ్‌లో 900 కోళ్ల మృతి

పుల్‌కల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి గ్రామ శివారులోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో రెండు రోజుల క్రితం 900 కోళ్లు మృతి చెందాయి. పశుసంవర్ధకశాఖ అధికారుల సూచన మేరకు ఫామ్ నిర్వాహకుడు ఆ కోళ్లను అక్కడే వ్యవసాయ పొలంలో పూడ్చేశాడు. పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకురాలు ఎం. వసంత కుమారి సోమవారం ఫామ్‌ను సందర్శించారు. శాంపిల్స్‌ను లేబొరేటరీకి పంపించామని, బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి మృతి చెందాయా? లేదా మరే ఇతర కారణాలతో మృతి చెందాయా? అన్నది నివేదిక వచ్చాకనే నిర్ధారణ అవుతుందని చెప్పారు.

ఆస్తి పన్ను పెంచకూడదంటే లక్ష ఇవ్వాల్సిందే

- రాజేంద్రనగర్ సర్కిల్ బిల్ కలెక్టర్ డిమాండ్.. అరెస్టు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఓ పరిశ్రమ యజమాని నుంచి తన సహాయకుడి ద్వారా రూ.45వేలు లంచం తీసుకున్న రాజేంద్రనగర్ సర్కిల్ బిల్ కలెక్టర్‌ను, ఆయన సహాయకుడిని సోమవారం రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని ఓ పరిశ్రమకు సంబంధించి ఆస్తి పన్ను పెంచకుండా ఉండాలంటే రూ.లక్ష లంచం ఇవ్వాలని బిల్ కలెక్టర్ సి.మధు డిమాండ్ చేశాడు. సదరు పరిశ్రమ యజమాని రూ.45వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి వార్డు కార్యాలయం వద్ద బిల్ కలెక్టర్ సహాయకుడైన వి.రమేశ్‌కు డబ్బు ఇచ్చాడు. ముందస్తు సమాచారంతో అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు వెంటనే ఆ డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. మధు, రమేశ్‌లను అరెస్టు చేశారు.

మావోయిస్టు డీవీసీఎం పద్మ లొంగుబాటు

ములుగు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ డీవీసీఎం పుల్సం పద్మ అలియాస్ ఊరే అలియాస్ గంగక్క సోమవారం పోలీసులకు లొంగిపోయారు. దివంగత కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ భార్య అయిన ఆమె 27 ఏళ్ల తన అజ్ఞాత జీవితాన్ని విడిచి 52 ఏళ్ల వయసులో జనజీవన స్రవంతిలో కలిశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ములుగు ఎస్పీ శబరీశ్ మీడియాకు వివరించారు. ములుగు జిల్లా తుపాకులగూడెం గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో పుల్సం పద్మ జన్మించారు. పీడబ్ల్యూజీ సిద్ధాంతం పట్ల ఆకర్షితురాలైన ఆమె 1998లో దళంలో చేరి 2001 వరకు ఏటూరునాగారం దళసభ్యురాలిగా పనిచేశారు. ఆ తర్వాత 2004 వరకు మహిళా దళంలో కొనసాగి, 2005లో మహిళా దళం కమాండర్ అయ్యారు. 2005లోనే కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్‌ను వివాహం చేసుకున్నారు. 2007లో ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొందారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పలు హింసాత్మక సంఘటనల్లో పద్మ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అనారోగ్య సమస్యలు పెరగడంతో ఆమె లొంగుబాటును ఎంచుకున్నట్లు ఎస్పీ తెలిపారు. దాంతో పద్మకు ఎస్పీ ఆర్థిక సాయం అందించారు.


పుల్సం పద్మ

డ్రైనేజీ లీకేజీలకు చెక్ పెట్టే పరికరం

- మురుగునీరు 22 సెంటీమీటర్లకు రాగానే అలర్ట్
- విషవాయువులను పసిగట్టి హెచ్చరించే ఆవిష్కరణ
- ఓయూ ఇంజనీరింగ్ విద్యార్థుల అద్భుత సృష్టి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ మహానగరం ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యల్లో ఒకటి.. డ్రైనేజీ లీకేజీ. చిన్న చిన్న గల్లీల నుంచి ప్రధాన రహదారుల దాకా.. పేదలు ఉండే బస్తీల నుంచి సంపన్నులు ఉండే ప్రాంతాల దాకా.. డ్రైనేజీ లీకై మురుగు నీరు ఏరులై పారే దృశ్యాలు సర్వసాధారణం. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ లీకేజీలను గుర్తించి శుభ్రం చేయడంలో పారిశుధ్య కార్మికులు అవస్థలు పడుతుంటారు. గుర్తించాక.. ఆ సమస్యను పరిష్కరించడానికి వారు మ్యాన్‌హోల్స్‌లో దిగి అందులో నుంచి వచ్చే విషవాయువుల వల్ల మృతి చెందిన ఘటనలు ఎన్నో. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టే అద్భుతమైన పరికరాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ఆధారంగా పనిచేసే ఈ పరికరాన్ని మ్యాన్‌హోల్‌లో అమర్చి.. సంబంధిత అధికారుల వాట్సాప్ నంబర్లకు అనుసంధానం చేస్తే చాలు. మురుగునీటి స్థాయి 22 సెంటీమీటర్లకు చేరగానే ఆయా నంబర్లకు అలర్ట్ వస్తుంది. 28 సెంటీమీటర్లు దాటితే.. మురుగునీరు పొంగి ప్రవహిస్తుందని హెచ్చరిక జారీ చేస్తుంది. ఈ హెచ్చరికల ఆధారంగా ఆయా విభాగాల అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని డ్రైనేజీ లీకేజీని ముందే అరికట్టవచ్చు. అందులో విషవాయువుల గురించి ఈ పరికరం ముందే హెచ్చరించడం వల్ల తగు జాగ్రత్తలు పాటించి పారిశుధ్య కార్మికుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఓయూ సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు ప్రొఫెసర్ శశికాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ పరికరాన్ని రూపొందించారు. ఇటీవల చండీగఢ్‌లో నిర్వహించిన సస్టెయినబుల్ స్మార్ట్ సిటీస్ అంతర్జాతీయ సదస్సులో దీనిని ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టుకు అంతర్జాతీయ గుర్తింపు కూడా లభించింది.


విద్యార్థులు తయారు చేసిన పరికరం

జీహెచ్ఎంసీ సహకరిస్తే..



ఈ పరికరంతో డ్రైనేజీ లీకేజీలను ముందుగా గుర్తించొచ్చు. విషవాయువుల నుంచి పారిశుధ్య కార్మికుల ప్రాణాలను కాపాడొచ్చు. దీనిని ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రూపొందించాం. జీహెచ్ఎంసీ సహకరిస్తే దీన్ని మరింతగా అభివృద్ధి చేయొచ్చు. ఈ పరికరం తయారు చేయడానికి కేవలం రూ.2,500 ఖర్చవుతుంది. త్వరలో పేటెంట్ కోసం దరఖాస్తు చేయబోతున్నాం.

- ప్రొఫెసర్ శశికాంత్, అధ్యాపకుడు, ఓయూ ఇంజనీరింగ్ విభాగం

నేటి నుంచి వేములవాడలో మహా జాతర

- శివరాత్రి వేడుకలకు 4 లక్షల మంది భక్తులు!
- బందోబస్తుకు 1500 మంది పోలీసులు
- వేములవాడ జాతరకు 850 ఆర్టీసీ బస్సులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం శివనామస్మరణతో మారుమోగనుంది. మంగళవారం 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మహాశివరాత్రి జాతర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాజాతర కోసం రాజన్న ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి 4 లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో భారీ ఏర్పాట్లు చేశారు. 3 రోజుల పాటు ఆర్టీసీ 850 ప్రత్యేక బస్సులు నడిపించనుంది. వేములవాడకు చేరుకున్న భక్తులను దేవస్థానం వద్దకు చేర్చడానికి 14 మినీ బస్సులను దేవస్థానం ఏర్పాటు చేసింది. వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ నుంచి గుడిచెరువు వరకు 3 రోజులు బస్సులు ఉచితంగా నడపనున్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. రాత్రి 7.30 గంటలకు టీటీడీ తరపున పట్టు వస్త్రాల సమర్పణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు నిశీ పూజ అనంతరం భక్తులకు స్వామి వారి లఘు దర్శనం, కోడె మొక్కులు కొనసాగిస్తారు.


వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో విద్యుద్దీపాలతో అలంకరణ

ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో నెలకు వెయ్యి కొత్త కేసులు

- 18 రాష్ట్రాల నుంచి వస్తున్న క్యాన్సర్ బాధితులు
- ఐదు నెలల్లో 5257 కొత్త కేసుల నమోదు
- బాధితుల్లో 10% వేరే రాష్ట్రాలకు చెందినవారు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లోని మెహదీ నవాజ్ జంగ్ (ఎంఎన్‌జే) క్యాన్సర్ ఆస్పత్రిలో నెలకు సగటున వెయ్యి దాకా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ ఆస్పత్రికి రోజూ సుమారు 700 మంది దాకా అవుట్ పేషంట్స్ వస్తారు. రోజూ వచ్చే కేసుల్లో కొత్తగా 30-35 మందికి క్యాన్సర్ నిర్ధారణ అవుతున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. ఇలా గత నాలుగేళ్లలో ఏకంగా 49,166 కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. 2021లో 10,712 కొత్త కేసులు రాగా, మరుసటి ఏడాది ఆ సంఖ్య 12,089కి పెరిగింది. 2023లో 12,728 కొత్త కేసులు నమోదు.. కాగా నిరుడు 13,637 కేసులు వచ్చాయి. కాగా.. ఎంఎన్‌జేలో నమోదయ్యే ప్రతి వంద కొత్త కేసుల్లో 18-19 నోటి క్యాన్సర్‌వే ఉంటున్నాయి. రొమ్ము క్యాన్సర్ కేసులు 12 శాతం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్స్ 9-10 శాతం నమోదు అవుతున్నాయి. అంటే ఈ మూడు రకాల క్యాన్సర్లే సుమారు 39-40 శాతం వరకు ఉంటున్నట్లు. మిగతా అన్ని రకాలూ కలిసి మరో 60 శాతం కేసులు ఉంటున్నాయి.

ఉత్తరాది నుంచి..

ఎంఎన్‌జే ఆస్పత్రిలో గత ఐదు నెలల్లో 5,257 కొత్త కేసులు నమోదు కాగా.. బాధితుల్లో 550 మందికిపైగా ఇతర రాష్ట్రాల వారే. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం.. మొత్తం 18 రాష్ట్రాలకు చెందిన రోగులు ఎంఎన్‌జేలో చికిత్స పొందుతున్నారు. మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 54 మంది ఇక్కడ వైద్యం చేయించుకుంటుండగా.. బిహార్‌వాసులు 24 మంది, ఉత్తరప్రదేశ్ నుంచి 15 మంది, పశ్చిమబెంగాల్ నుంచి 10 మంది, ఒడిశా నుంచి 12 మంది చికిత్స పొందుతున్నారు. అలాగే రాజస్థాన్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, మణిపూర్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, జమ్ము కశ్మీర్, హరియాణా, అసోం నుంచి కూడా పేషెంట్లు ఇక్కడికి వస్తున్నారు. నేపాల్ నుంచి సైతం ఇద్దరు రోగులు ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతున్నారు. అనుభవజ్ఞులైన క్యాన్సర్ వైద్య నిపుణులు, సమర్థమైన చికిత్స అందుతుందన్న నమ్మకం ఉండడం వల్లనే ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తున్నట్లు రోగులు చెబుతున్నారు.

పెరుగుతున్న ముప్పు..

మన దేశంలో రోజూ సగటున 200 మందికిపైగా మహిళలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. అన్ని రకాల క్యాన్సర్లతో.. రోజుకు సగటున 1600-1700 మంది చనిపోతున్నట్లు ఐసీఎంఆర్‌తో పాటు ఇతర సంస్థలు చెబుతున్నాయి. ఈ ఏడాది చివరికి కొత్తగా 15 లక్షలకుపైగా క్యాన్సర్ కేసులు నమోదయ్యే ముప్పుందనే హెచ్చరికలు ఇప్పటికే జారీ అయ్యాయి. 2019లో దేశవ్యాప్తంగా 7.51 లక్షల క్యాన్సర్ మరణాలు సంభవించగా.. 2023 నాటికి ఆ సంఖ్య 8.28 లక్షలకు పెరిగిందని నిరుడు డిసెంబర్‌లో కేంద్ర వైద్యశాఖ పార్లమెంట్‌కు సమర్పించిన నివేదిక పేర్కొంది.

'ఆయుష్మాన్ భారత్'తో ఉత్తరాది వారికి చికిత్స



మన రాష్ట్ర రోగులకు ఆరోగ్య శ్రీ కింద.. ఉత్తరాదివారికి, ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా వైద్య సేవలందిస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ కార్డుతో పాటు క్యాన్సర్ రోగులకు కేంద్రం ఇచ్చే వన్‌టైమ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ రూ.10 లక్షలు, ప్రధానమంత్రి సహాయ నిధి వంటి వాటి ద్వారా ఇక్కడికి వచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా పేద రోగులు ఇక్కడికి చికిత్స కోసం వస్తున్నారు. ఎటువంటి ఆరోగ్య బీమా లేని పేద రోగులు వస్తే వారికి ఉచితంగానే చికిత్స చేస్తున్నాం.

-డాక్టర్ జి. శ్రీనివాస్, డైరెక్టర్, ఎంఎన్‌జే ఆస్పత్రి, హైదరాబాద్

కుంభమేళా నుంచి తిరిగొస్తూ అనంతలోకాలకు

- యూపీలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి
- మృతుల్లో సంగారెడ్డి, నల్లగొండ జిల్లా వాసులు
- విచారం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి


డీఈఈ వెంకట్‌రాంరెడ్డి, భార్య విలాసిని(ఫైల్)


మల్లారెడ్డి(ఫైల్)

న్యాల్‌కల్, నల్లగొండ క్రైం, హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహా కుంభ మేళాలో పాల్గొన్ని వస్తుండగా జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. కుంభమేళా నుంచి కాశీవిశ్వేశ్వరుడి దర్శనం కోసం వారణాసికి వెళ్తుండగా కారు, టిప్పర్ ఢీకొనడంతో సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. జహీరాబాద్ డివిజన్ న్యాల్‌కల్ మండలం మామిడ్గికి చెందిన డీఈఈ వెంకట్ రాంరెడ్డి(44), అతని భార్య విలాసిని(40), విలాసిని అక్క విశాలతో పాటు మరో ముగ్గురు ఈ నెల 21న కారులో ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. సోమవారం ప్రయాగ్‌రాజ్ నుంచి వారణాసి వెళ్తుండగా యూపీలోని మిర్జాపూర్ సమీపంలో వారి కారు టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీఈఈ వెంకట్ రాంరెడ్డి, అతని భార్య, కారు డ్రైవర్ మల్లారెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా, నల్లగొండకు చెందిన రాచకొండ చంద్రశేఖర్, కళావతి(45) దంపతులు, గజ్జల నాగరాజు, నాగలక్ష్మి దంపతులు, హైదరాబాద్‌లోని మరో కుటుంబానికి చెందిన ముగ్గురు కలిసి ఈ నెల 19వ తేదీన కుంభమేళాకు వెళ్లారు. తిరిగి వస్తుండగా యూపీలోని కట్ని ప్రాంతం సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో కళావతి(45) మృతి చెందింది. కారులో ఉన్న చంద్రశేఖర్, నాగరాజుకు తీవ్ర గాయాలుకాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు బంధువులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసులు మృతిచెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స, తక్షణ సహాయక చర్యల్ని అందించేందుకు యూపీ ప్రభుత్వంతో మాట్లాడాలని అధికారుల్ని సీఎం ఆదేశించారు.

'కాళేశ్వరం'పై కేసు పెట్టినందుకే.. రాజలింగమూర్తిని హత్య చేశారు

- హతుడి భార్యాబిడ్డలు ఇదే చెప్పారు
- ఫిర్యాదుదారు చనిపోయినా.. విచారణ కొనసాగించవచ్చు: ప్రభుత్వం
- భూపాలపల్లి కోర్టు ఆదేశాలు కొట్టేయాలటూ కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్.. హైకోర్టులో తీర్పు రిజర్వు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కేసు పెట్టినందుకే.. భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తిని హత్య చేశారు. ఈ విషయాన్ని హతుడి భార్యాబిడ్డలు ప్రెస్‌మీట్ పెట్టి చెప్పారు" అని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. భారత నేర శిక్షా స్మృతి(సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 200 ప్రకారం రాజలింగమూర్తి ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారని.. ఆయన చనిపోయినప్పటికీ విచారణను కొనసాగించవచ్చని.. సాక్షులను విచారించి, నిజానిజాలు నిర్ధారించుకుని, ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీసులకు ఆదేశాలు ఇచ్చే అధికారం ట్రయల్ కోర్టుకు ఉంటుందని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి వల్లే మేడిగడ్డ కుంగుబాటుకు గురైందంటూ రాజలింగమూర్తి ఫిర్యాదు మేరకు.. వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ భూపాలపల్లి జిల్లా కోర్టు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతరులను ఆదేశిస్తూ.. నోటీసులిచ్చిన విషయం తెలిసిందే.! జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలంటూ కేసీఆర్, హరీశ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలను వినిపిస్తూ.. ఫిర్యాదుదారు చనిపోయినప్పటికీ కేసు కొనసాగించవచ్చని పేర్కొన్నారు. తొలుత ఫిర్యాదుపై విచారించే పరిధి తమకు లేదని పేర్కొంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ భూపాలపల్లి మెజిస్ట్రేట్ కోర్టు తుది ఉత్తర్వులు జారీ చేసిందని.. సదరు ఉత్తర్వులపై భూపాలపల్లి జిల్లా కోర్టులో రివిజన్ పిటిషన్ వేశారని పేర్కొన్నారు. మెజిస్ట్రేట్ కోర్టు తుది ఉత్తర్వులు ఇచ్చినందున.. జిల్లా కోర్టులో రివిజన్ వేయడం చట్టసమ్మతమేనని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా కోర్టు నిర్ణయంలో ఎలాంటి లోపం లేదన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై జిల్లా కోర్టు రివిజన్ పిటిషన్‌ను స్వీకరించడమే తప్పన్నారు. ఫిర్యాదుదారు లేనప్పుడు కేసును ఎవరు నిరూపిస్తారని ప్రశ్నించారు. వాదోపవాదాలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. రాజలింగమూర్తి వారసులు ఈ కేసును కొనసాగించడానికి సిద్ధంగా ఉంటే వారి వాదన వినడానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టంచేసింది. ఫిర్యాదుదారు వారసుల నుంచి ఏమైనా సూచనలు అందాయా? అని రాజలింగమూర్తి న్యాయవాదిని ప్రశ్నించింది. దానికి న్యాయవాది స్పందిస్తూ.. ఎలాంటి సూచనలు అందలేదని చెప్పారు. అలాంటప్పుడు కేవలం పత్రికల్లో వచ్చిన విషయాలను ఎలా ఆధారాలుగా చూపిస్తారని పీపీని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

14 నెలల్లోనే 905 కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

"ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది నిరుపేదలు, పేద, మధ్య తరగతి వారికి సంబంధించింది. దీన్ని పారదర్శకంగా అమలుచేయాలి, నిజమైన అర్హులకు ఎలాంటి సమస్య లేకుండా అందజేయాలి. అవకతవకలకు, అక్రమాలకు తావివ్వకూడదు."

- సీఎంఆర్ఎఫ్ అమలుపై అధికారులతో సీఎం రేవంత్

తర్వాత సంబంధిత బిల్లులను జత చేసి, ప్రజాప్రతినిధి సిఫారసు ద్వారా దరఖాస్తు పెట్టుకున్నవారికి సాయం అందించడం; ఆస్పత్రిలో చికిత్సకు ముందుగానే అవసరమైన ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకుంటే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) రూపంలో సాయం అందించడం.. ఇలా ఈ పథకాన్ని ప్రభుత్వం రెండు రకాలుగా అమలు చేస్తోంది. ఆస్పత్రి బిల్లులతో దరఖాస్తు చేసుకున్న సుమారు 1.93 లక్షల మందికి రూ.600 కోట్లు, ఎల్‌వోసీ కింద 16,502 మందికి రూ.300 కోట్లను ఇప్పటి వరకు సాయంగా అందించింది. ఎల్‌వోసీల్లో అధికంగా నిమ్స్‌కు 286 కోట్లు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో 3.60 కోట్లు, ఈఎన్‌టీ ఆస్పత్రికి 3.57 కోట్లు అందజేసింది. ఇవిగాక వివిధ సమస్యలు ఎదుర్కొంటూ, దీర్ఘకాలిక వ్యాధితో ఇబ్బందులు పడుతూ పలు మార్గాల్లో వెలుగులోకి వస్తున్న వారికి సీఎం రేవంత్ ప్రత్యేకంగా ఆర్థిక భరోసా ఇస్తున్నారు. ఇలాంటి కేసులకు సంబంధించి కేవలం ఆర్థిక సాయమే కాకుండా వారి కుటుంబ పోషణకు అవసరమైన సహాయాన్ని కూడా ప్రభుత్వం తరఫున అందిస్తున్నారు. 'ప్రజావాణి'లో సీఎంఆర్ఎఫ్ కోసం వచ్చిన దరఖాస్తుల విషయంలోనూ సంబంధిత అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు.

గత సర్కారు ఐదేళ్లలో ఇచ్చింది 2,400 కోట్లే

సీఎంఆర్ఎఫ్ కింద గత ప్రభుత్వం కూడా సాయం అందించింది. అయితే 2019 నుంచి 2023 డిసెంబరు 7 నాటికి ఎల్‌వోసీలకు ఇచ్చే వాటితో కలిపి మొత్తం రూ.2,400 కోట్లను మాత్రమే అందించింది. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ అమల్లోనూ అవినీతి చోటుచేసుకుంది. పేదల పేరిట మెడికల్ బిల్లులు సృష్టించి నిధులను పక్కదారి పట్టించే దందా వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎంఆర్ఎఫ్ అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు విచారణకు ఆదేశించింది. గతంలో కొందరు ప్రజాప్రతినిధుల ఆఫీసుల్లో పనిచేసిన సిబ్బంది సీఎంఆర్ఎఫ్ చెక్కులు తమ ఖాతాల్లో వేసుకున్న ఘటనలు తెరపైకి వచ్చాయి. దీంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులపై లబ్ధిదారుల పేర్లతో పాటు వారి బ్యాంక్ ఖాతా నంబరును ముద్రిస్తూ, అక్రమాలకు అడ్డుకట్ట వేశారు. దొంగ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేయడాన్నీ నిరోధించడంతో అర్హులకే సాయం అందుతోంది.

వేగంగా ఎల్‌వోసీలు..


అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్‌పై దృష్టిసారించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై వచ్చిన ఆరోపణలను తేల్చాలంటూ అధికారులను ఆదేశించారు. సీఎం సహాయ నిధిలో అక్రమాలకు, అవినీతికి తావుండకూడదన్న ఉద్దేశంతో ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఫలితంగా ప్రతి దరఖాస్తు విషయంలో పారదర్శకత ఉండడంతో పాటు చెక్కు మంజూరు వరకు ప్రతి దశను ఆన్‌లైన్‌లోనే తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఇక ఎల్‌వోసీల జారీని ప్రభుత్వం వేగవంతం చేసింది. ఎల్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంది. ఆదివారంతో పాటు సెలవు రోజుల్లో కూడా ఎల్‌వోసీలను మంజూరు చేయాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఆ పిల్లల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు..

మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు ఆరేళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశం ఉంటుంది. వారికి శస్త్రచికిత్సలతో పాటు అవసరమైన వినికిడి పరికరాలు అమర్చాల్సి ఉంటుంది. ఇందుకు రూ.లక్షలు వెచ్చించాల్సి రావడంతో చాలామంది పేద కుటుంబాల వారు తమ పిల్లలకు ఆపరేషన్లు చేయించుకోలేకపోతున్నారు. అలాంటి వారిని గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారవర్గాలు తెలిపాయి. వైద్యారోగ్యశాఖ సిబ్బంది, కలెక్టర్లు, ఇతర అధికారులు, సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చినవారికి ప్రత్యేకంగా చికిత్సలు చేయించేలా చర్యలు తీసుకుంటున్నారు. 14 నెలల్లో సుమారు 104 కేసులకు ప్రభుత్వం ఎల్‌వోసీలను మంజూరు చేసింది. మొత్తంగా సీఎం సహాయ నిధి ద్వారా నిజమైన అర్హులకు సాయం అందించాలన్న సీఎం లక్ష్యం ఫలిస్తోందని ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు తీసిన రుణపాశాలు !

- అప్పులు తీర్చలేక నలుగురు రైతుల బలవన్మరణం
- యాదాద్రి, భూపాలపల్లి, సిరిసిల్ల, మహబూబాబాద్ జిల్లాల్లో ఘటనలు


రాంచంద్రయ్య, రాజు, దేవయ్య, వెంకన్న (ఫైల్)

తుర్కపల్లి, మొగుళ్లపల్లి, ముస్తాబాద్, దంతాలపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటల దిగుబడి సరిగా రాక, అప్పులు తీర్చలేక నలుగురురైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లికి చెందిన మంద హంసమ్మ, రాంచంద్రయ్య(59)లది నిరుపేద కుటుంబం. ఉన్న అర ఎకరం భూమిలో రాంచంద్రయ్య వర్షాధార పంటలు సాగు చేస్తుండగా ఈ ఏడాది పత్తి పంట వర్షాభావ పరిస్థితులతో సరిగా దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయాడు. ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో పాటు అప్పుల బాధతో తీవ్ర మానసిక వేదనకు గురై రాంచంద్రయ్య ఆదివారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. అలాగే, భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అరికాంతపు రాజు(38) తనకున్న మూడెకరాల్లో పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నాడు. ఏటా పంటల దిగుబడి సరిగా రావడం లేదు. ఈసారీ అదే పరిస్థితి ఎదురవడంతో అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఆదివారం రాత్రి పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇక, రాజన్న సిరిసిల్ల జిల్లా పోతుగల్ గ్రామానికి చెందిన జెల్ల దేవయ్య (51) తనకున్న ఎకరం పొలంతో పాటు, పక్కనే ఉన్న ఐదెకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. వరి పంట వేసిన దేవయ్య సాగు నీరు లేక పంట ఎండిపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక జీవితంపై విరక్తితో ఆదివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఘటనలో మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం వేములపల్లిలో మట్టపల్లి వెంకన్న (55) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మూడెకరాల్లో వరి, మిర్చి పంటలను సాగు చేసి దిగుబడి ఆశించిన మేర వచ్చే పరిస్థితి కనిపించకపోవడం, చేసిన అప్పులు వడ్డీలతో పెరిగిపోతుండటంతో ఈ చర్యకు పాల్పడ్డాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.